# యిర్మీయా గ్రంథ పరిచయం



టి.పి. వరప్రసాద్ రెడ్డి

# యిర్మీయా గ్రంథ
# పరిచయము

రచయిత
టి.పి. వరప్రసాదరెడ్డి

ప్రతులకు

టి.పి. వరప్రసాదరెడ్డి
షాలోమ్ చర్చి, జె.యన్.టి.యు. పోస్టాఫీస్
అనంతపురము - 515002
సెల్: 9440285883

వెల : రూ. 30.00

# విషయ సూచిక


| వ.సం. | అంశము -అధ్యాయములు | పేజి నెం. |
|---|---|---|
| I. ప్రవక్తల పెద్ద గ్రంథాల పరిచయము | | 4 |
| II. యిర్మీయా గ్రంథ పరిచయము | | 6 |
| III. యిర్మీయా గ్రంథ విభజన | | 8 |
| IV. యిర్మీయా ప్రవక్తగా నియామకము. 3 ప్రత్యక్షతలు 1) 1:4వ. 2) 1:11వ. 3) 1:13వ. | | 15 |
| V బబులోను చెరకు ముందు 20సం.లో ఆరు ప్రత్యక్షతలు 1) 2-6అ, 2) 7-10అ, 3)11-13అ, చెరకాలమందు 20 సం.లో యిర్మీయాకు 23 ప్రత్యక్షతలు. | | 17 |
| VI. 21-23 అ. దేశాధిపతులకు, మతాధిపతులకు 1 ప్రత్యక్షత 24-29అ. చెరకాలమందు 20 సం. లో చెరను గూర్చిన ఆరు ప్రత్యక్షతలు | | 43 |
| VII. 24-26అ. 3 ప్రత్యక్షతలు (అంజూరపు పండ్ల గంపల సూచన)1) 24:4వ. 2)25:3వ. 3)26:1వ. | | 48 |
| VIII. 27-29వ. 3 ప్రత్యక్షతలు (కాడి పలుపులు అను సూచన). 1) 27:1వ. 2) 28:12వ. 3) 29:30వ. | | 53 |
| IX. 30-33అ. విడుదలను గూర్చిన 8 ప్రత్యక్షతలు. 1)301వ. 2) 31:3వ, 3)32:1వ, 4)32:6వ, 5) 32:26వ, 6) 33:1, 7) 33:19వ, 8)33:23వ. | | 57 |
| X. 34-39 (6అ.) యెహోయాకీము, సిద్కియా రాజుల పాపములను గూర్చిన 8 ప్రత్యక్షతలు. 1) 36:1వ, 2) 34:8వ, 3) 35:1వ, 4) 35:12వ, 5)36:1వ, 6) 36:27వ, 7) 37:6వ, 8) 39:1వ. | | 63 |
| XI. 40-44 అ. ఐగుప్తుకు వెళ్లకముందు, వెళ్లిన తరువాత 4 ప్రత్యక్షతలు 1) 40:1వ, 2) 42:7వ, 3) 43:8వ, 4) 44:1వ. | | 73 |
| XII. 46:51అ. యూదా చుట్టునున్న శత్రువులకు 4 ప్రత్యక్షతలు 1)46:1వ, 2) 46:13వ, 3) 47:1వ, 4)49:34వ. | | 80 |
| XIII . 52అ. చెరల కాలము నాటి రాజుల చరిత్ర | | 87 |

*Published*

# IN LOVING MEMORY OF

# BRO. G.S. JOSEPH

(1915-2009)

who went to be with the Lord to take his reward on 17-4-2009

# ప్రవక్తల పెద్ద గ్రంథముల పరిచయము

యూదా ఇశ్రాయేలు వారికి మూల పురుషుడైన అబ్రాహాము, కల్దీయుల దేశము (ప్రస్తుత ఇరాక్ దేశము) లోని ఊరు అను గ్రామమునకు చెందినవాడు. అబ్రహాము పితరులు యితర దేవతలను పూజించేవారు. (యెహోషువ 24:1-2). మహిమ గల దేవుడు అబ్రహామునకు ప్రత్యక్షమై నేను నీకు చూపించు దేశమునకు రమ్మనగా దేవుని యందు విశ్వాసముంచి క్రీ.పూ. 2075 సం॥ కనాను దేశమునకు వచ్చి నివసించాడు. (అపొ 7:1-4వ). అబ్రహాము క్రీ.పూ 2004 సం॥లో ఇస్సాకును, ఇస్సాకు క్రీ.పూ. 1944లో యాకోబును కనెను. యాకోబు 12గురు కుమారులను కుమార్తెలను కనెను. యాకోబు సంతానము ఇశ్రాయేలీయులుగా పిలువబడిరి, యాకోబు కుమారుడైన యోసేపు క్రీ.పూ. 1857లో పుట్టెను. క్రీ.పూ 1836-40లో అన్నలు అమ్మివేయగా ఐగుప్తుకు వెళ్ళెను. ఇశ్రాయేలు తన సంతానమైన 12 గోత్రముల వారితో క్రీ.పూ. 1814లో ఐగుప్తుకు వెళ్ళెను. ఇశ్రాయేలీయులు క్రీ.పూ. 1440లో మోషే నాయకత్వాన ఐగుప్తును విడచి క్రీ.పూ. 1400లో కనానుకు తిరిగివచ్చారు.

కనానులో అప్పుడు నివసించు ఏడుజాతుల వారిని సంహరించి యెహోషువ ద్వారా ఆ దేశమంతటిని దేవుడు 12 గోత్రముల ఇశ్రాయేలీయుల వారికి క్రీ.పూ. 1400-1370 వరకు పంచి పెట్టాడు (అపొ.13:20). అప్పటి నుండి అది ఇశ్రాయేలు దేశమని పిలువబడినది. యెరూషలేము నుండి క్రింది భాగము బెన్యామీను, యూదా గోత్రముల వారికి పంచిపెట్టబడెను. యెరూషలేము నుండి, పై నున్న ఉత్తర దేశము మిగిలిన 10 గోత్రముల వారికి పంచిపెట్టబడెను. న్యాయాధిపతుల గ్రంథమందు క్రీ.పూ. 1370 నుండి 1060 వరకు సుమారు 310 యేండ్లు దేవుడు వారిని న్యాయాధిపతుల ద్వారా పాలించెను. తరువాత ప్రజల కోరికపై దేవుడు వారికి రాజుల నిచ్చాడు. ఇశ్రాయేలు 12 గోత్రముల వారిని సౌలు రాజు (క్రీ.పూ 1050-1010), దావీదు రాజు (క్రీ.పూ 1010-970), సొలొమోను రాజు (క్రీ.పూ. 970-930) పరిపాలించిన తదుపరి రాజైన రెహబాము కాలమందు రాజ్యము రెండు భాగములై యూదా, బెన్యామీను గోత్రాలవారు యూదావారని పిలువబడిరి. యూదా ప్రజలను 20 మంది రాజులు యెరూషలేము నుండి క్రీ.పూ. 930-586 వరకు పాలించిరి. వారిలో 8 మంది మంచివారు, 12 మంది చెడ్డవారు, మిగిలిన 10 గోత్రాల ప్రజలు ఇశ్రాయేలు వారని పిలువబడి 19 మంది రాజులచే షోమ్రోను, తిర్సాలు ముఖ్య పట్టణములుగా నుండి క్రీ.పూ. 930-721 వరకు పాలించబడిరి. వారందరు చెడ్డవారు. అందుచేత వారు (క్రీ.పూ. 732, 721)లో అష్షూరు చెరకు వెళ్ళి నేటికి తిరిగిరాలేదు.

యూదా వారిని పాలించిన రాజులలో 8 మంది మంచివారు, మిగిలిన 12 మంది రాజులు, ప్రజలు చెడ్డవారైనందున దేవుడు వారిని క్రీ.పూ. 606, 597, 586లో మూడు విడతలుగా బబులోనుకు చెరకు పంపెను. సొలొమోను రాజు క్రీ.పూ. 967-960 వరకు యెరూషలేములో కట్టించి క్రీ.పూ. 959లో ప్రతిష్ఠించిన మందిరము క్రీ.పూ. 586లో

పడగొట్టబడెను. యెరూషలేము పట్టణము కాల్చబడెను. 70 ఏండ్ల పిదప క్రీ.పూ. 536లో బబులోను నుండి యూదులు తిరిగి వచ్చిరి. క్రీ.పూ. 535-516 వరకు మందిరము నిర్మించబడి క్రీ.పూ. 457 ఎజ్రాచే అలంకరించబడినది. క్రీ.పూ. 445లో నెహెమ్యాచే పట్టణ ప్రకారము కట్టబడిన తరువాత క్రీ.పూ. 396 వరకు మలాకీ గ్రంథ రచనద్వారా ప్రజల జీవితములు కట్టబడినవి. యూదా వారు విగ్రహములను పూజించిన కారణమున మరియు ధర్మశాస్త్రమును మీరిన కారణమున దేవుడు యెషయా ద్వారా క్రీ.పూ. 760 నుండి 700 వరకు 60 ఏండ్లు యిర్మీయా ద్వారా క్రీ.పూ. 626 నుండి 586 వరకు 40 ఏండ్లు బుద్ధి చెప్పిననూ వారు విననందున యూదావారిని క్రీ.పూ. 606లో రాజైన యెహోయాకీము దినములలో బబులోనుకు మొదటి విడతగా చెరకు పంపాడు. చెరకు వెళ్ళినవారిలో ప్రముఖులైన దానియేలు, షద్రకు, మేషాకు, అబేద్నెగోలు కలరు. యూదయలో మిగిలినవారు ఇంకను జీవితాలు దిద్దుకొననందున రెండవ విడతగా క్రీ.పూ. 597లో యెహోయాకీను రాజు దినాలలో యెహోయాకీను రాజును యూదావారిని చెరకు బబులోనుకు పంపాడు. వీరిలో ప్రముఖుడైన యెహెజ్కేలు ద్వారా క్రీ.పూ. 592 నుండి 572 వరకు 20 ఏండ్లు బుద్ధి చెప్పించాడు. తదుపరి చివరి రాజైన సిద్కియా దినాలలో క్రీ.పూ. 586లో యూదా దేశము పతనమై యెరూషలేము పట్టణము, నాశనము కాగా యిర్మీయా విలపించిన గ్రంథము విలాపవాక్యములు. దేశములో మిగిలిన వారు యిర్మీయా యొద్దకు వెళ్ళి ప్రార్థించి దేవుని చిత్తమును తెలుపుమనికోరగా యిర్మీయా ప్రార్థించాడు. జవాబుగా దేవుడు మిగిలినవారు ఎక్కడకు వెళ్ళవద్దని యూదయలోనే ఉండవలెనని సెలవిచ్చాడు. కాని దేవుని మాట వినక మిగిలిన సామాన్యులు యిర్మీయాను వెంటబెట్టుకొని ఐగుప్తుకు వెళ్ళిరి. ఐగుప్తుకు వెళ్ళినవారిని క్రీ.పూ. 581లో బబులోను రాజు చెరకు పోయెను. క్రీ.పూ. 606లోని మొదటి విడత చెర నుండి 70 ఏండ్లకు క్రీ.పూ. 536 పారశీకులు రాజైన కోరెషు దినాలలో చెర నుండి విడుదల పొంది యెరూషలేముకు తిరిగి వచ్చిరి. క్రీ.పూ. 606 నుండి 533 వరకు సుమారు 80 ఏండ్లు రాజనగరు నుండి దానియేలు ప్రవచించాడు. యెషయా దేవుని రక్షణను గూర్చి, యిర్మీయా దేవుని తీర్పుల గూర్చి, యెహెజ్కేలు దేవుని ప్రభావము గూర్చి, దానియేలు దేవుని మహిమను గూర్చి ప్రవచించిరి. క్రీ.పూ. 535-515 మధ్య యూదులు దేవాలయమును కట్టిరి. వివరములు ఎజ్రా గ్రంథమందు, హగ్గయి, జెకర్యా గ్రంథములందు గలవు. పాడైన పట్టణ ప్రాకారమును నెహెమ్యా కాలములో క్రీ.పూ. 445లో బాగు చేసిన వివరములు నెహెమ్యా గ్రంథమందు కలవు. యూదా ప్రజల జీవితములు కట్టబడుట హగ్గయి, జెకర్యా, మలాకీ గ్రంథములందు కలదు. యూదావారిని శిక్షించిన బబులోనీయులను, వారికి సహకరించిన చుట్టునున్న శత్రు దేశాలను 1. అష్షూరు 2. ఫిలిష్తీయ 3. మోయాబు 4. దమస్కు 5. కూషు 6. ఐగుప్తు 7. అరేబియ 8. తూరు 9. ఎదోము, 10. అమ్మోను 11. సీదోను 12. కేదారు 13. ఏలాములను దేవుడు తదుపరి శిక్షించాడు. దానియేలు సుమారు 80 ఏండ్లు, యెషయా 60 ఏండ్లు, యిర్మీయా 40 ఏండ్ల కంటె కొంచెము ఎక్కువ, యెహెజ్కేలు 20 ఏండ్లు ప్రవచించిరి.

# యిర్మీయా గ్రంథ పరిచయము

గ్రంథకర్త: యిర్మీయా (36:2) లేఖికుడు: బారూకు (36:22)

**కాలము:** క్రీ.పూ. 626-586 (తదుపరి కొంతకాలము)

**గ్రంథ పరిచయము:** ప్రవక్తల పెద్ద గ్రంథముల పరిచయము చదువుము. యూదావారు యెహోవాను విడిచి విగ్రహాలను పూజించి నిబంధనను మీరి లేవీ 25:1-12, 2దిన. 36:21 ప్రకారము భూమికి విశ్రాంతిని పాటించనందున దేవుడు హెచ్చరించి తీర్పు తీర్చి, 70 ఏండ్లు శిక్షించెను. (యిర్మీయా 1:16).

క్రీ.పూ. 967-960లో సొలొమోను రాజు మందిరమును నిర్మించి క్రీ.పూ. 959లో ప్రతిష్ఠించినది మొదలు, యూదులు బబులోను చెరకువెళ్ళి చెరనుండి విడుదలై మందిరమును కట్టి ముగించిన క్రీ.పూ. 516 వరకు 442 సంవత్సరాలు. ఈ కాలమున యూదులు విశ్రాంతి సంవత్సరాలు పాటించలేదు. ప్రతి ఏడవ సంవత్సరము, ప్రతి 50వ సంవత్సరము భూమికి విశ్రాంతి నివ్వాలి. (లేవీ 25:4,8-10) కనుక 50 సంవత్సరములకు 8 విశ్రాంతి సం॥లు. 442 సంవత్సరాలలో, 400 సం॥లకు 64 విశ్రాంతి సంవత్సరములు + 42 సంవత్సరములకు 6 విశ్రాంతి సం॥లు. మొత్తము 70 సం॥లు భూమికి విశ్రాంతి నివ్వాలి. కాని భూమికి విశ్రాంతి నివ్వనందున క్రీ.పూ. 606లో యూదావారిని దేవుడు మొదట విడతగాను, 597 రెండవ విడతగాను, 586లో మూడవ విడతగాను చెరకు పంపి 70 ఏండ్ల కాలము 606 - 536 (కొన్ని ప్రాంతములలో 586-516) వరకు వారిని శిక్షించి భూమికి విశ్రాంతి నిచ్చారు. 70 ఏండ్లు చెర తీరిన తరువాత యెహోషువ జెరుబ్బాబేలుల నాయకత్వాన యెరూషలేముకు నడిపించి మందిరమును నిర్మింపజేసెను. మొదటి విడత చెరకు ముందు 20 ఏండ్ల నుండి (క్రీ.పూ. 626) మూడవ విడత చెరవరకు క్రీ.పూ. 586 వరకు తదుపరి కొంత కాలము మొత్తము 40 ఏండ్ల పైబడి యెహోవా వాక్కు 40 మారులు ప్రత్యక్షమగుట ద్వారా యిర్మీయా ప్రకటించాడు. యిర్మీయా సున్నితమైన మనసు కలిగి శక్తిలేని బాలుడనని గుర్తించినను దేవుడు అసాధారణ శక్తి, సామర్థ్యమిచ్చి హృదయాలు బ్రద్దలు చేయు ప్రసంగములు చేసాడు. పడచువాడు పిరికివాడు కాని ప్రకటించుటకు పెల్లగించుటకు పడద్రోయుటకు ప్రతిష్ఠించబడ్డాడు.

యెహోవా వాక్కు ప్రత్యక్షతలు ఈ గ్రంథమందు 40 ఉన్నను యెహోవా వాక్కు అనుపదము 182 పర్యాయములు, యెహోవా సెలవిచ్చుచున్నాడని 192 పర్యాయములు, హృదయము అను పదము 71 పర్యాయములు, ఖడ్గము అను పదము 68 పర్యాయములు, ప్రత్యక్షత అను పదము 47 పర్యాయములు, కీడు 50 పర్యాయములు కనిపించును.

**యిర్మీయాను గూర్చిన పరిచయము:-** యిర్మీయా బెన్యామీను దేశమందలి అనాతోతులో కాపురమున్న యాజకులలో ఒకడైన హిల్కీయా కుమారుడు అవివాహితుడు (16:11). ఐగుప్తులో రాళ్ళచేత కొట్టబడి చనిపోయెను (హెబ్రీ 11:37) పై పేరుల అర్థములు క్రింద చెప్పబడినవి. యిర్మీయా ప్రకటించిన కాలంలో రాజ్యపాలన చేసిన యూదా రాజులు (1)

యోషీయా క్రీ.పూ. 639-608 (మంచి రాజు) (2) యెహోయాహాజు 608 (3 నెలలు) (చెడ్డరాజు) (3) యెహోయాకీము 608-597 (చెడ్డరాజు) (4) యెహోయాకీను 597 (3 నెలలు) (చెడ్డరాజు) (5) సిద్కియా 597-586 (చెడ్డరాజు)

(1) యెషీయా: యెహోవా బాగుచేయువాడు (2) యెహోయాహాజు = యెహోవా పట్టుకొనుట (3) యోహోయాకీము = యెహోవా స్థాపించును. (4) యెహోయాకీను = యెహోవా స్థాపించును (5) సిద్కియా = యెహోవా నీతి (6) బెన్యామీను = కుడిచేతి పుత్రుడు (7) అనాతోతు = యెహోవా జవాబిచ్చును. (8) హిల్కీయా = యెహోవా నా స్వాస్థ్యము (9) యిర్మీయా = యెహోవా నియమించును.

మొదటి విడత చెరకు ముందు ఇరువది ఏండ్లకాలమున క్రీ.పూ. 626లో దేవుడు యిర్మీయాను మూడు పర్యాయాలు యెహోవా వాక్కు ప్రత్యక్షమగుట ద్వారా ప్రవక్తగా నియమించాడు. (1) వివరములు మొదటి అధ్యాయములో కలవు. (2) - (7) భాగములలో తదుపరి క్రీ.పూ. 626 నుండి 606 వరకు ఇరువది ఏండ్ల కాలములో యెహోవా వాక్కు 6 పర్యాయములు ప్రత్యక్షమగుట ద్వారా సెలవిచ్చాడు. ప్రతి ప్రకటనలో ప్రజల పాపాలు తెలుపుచూ, పశ్చాత్తాపడమని, లేని యెడల శిక్షింతునని తెలుపుట చూడగలము. 2వ. అధ్యా. నుండి 20వ అధ్యాయము వరకు 19 అధ్యాయములలో 6 ప్రత్యక్షతలు/ ప్రకటనల వివరములు కలవు. 21-39వ అధ్యాయము వరకు మొదటి విడత చెరనుండి మూడవ విడత చెర వరకు అనగా 606 నుండి 586 వరకు ఇరువది ఏండ్లలో 23 ప్రత్యక్షతల ద్వారా ప్రకటించాడు. ఈ 21-39 అధ్యాయములు కాలక్రమమునుబట్టి కాక అంశముల వరుసలో కూర్చబడినవి. (8) రాజ్యాధిపతులకు, మతాధిపతులకు 21-23 అధ్యాయాలలో ప్రకటించాడు. డెబ్బది ఏండ్ల బబులోను చెరను గూర్చి 24-29 అధ్యాయాలలో ప్రకటించాడు. చెరను గూర్చిన భాగములలో రెండు సూచనలు కలవు. (9) 24-26 అధ్యా. చెరను గూర్చి యెహోయాకీము, యెహోయాకీను రాజులకాలములో పండ్ల గంప సూచన ద్వారా (24 అధ్యా) ప్రకటించాడు. (10) 27-29 అధ్యా. సిద్కియా రాజుకాలంలో కొయ్యకాడి (27 అధ్యా) ఇనుపకాడి (28 అధ్యా) సూచనల ద్వారా ప్రకటించాడు. (11) 30-33 అధ్యాయాలలో 70 ఏండ్ల చెరపిదప కలుగు విడుదలను గూర్చి ప్రవక్త తన వెండినిచ్చి బంధువుల భూమినికొని విడిపించుట అను సూచన ద్వారా దేవుడు విడుదల నిచ్చునని (32 అధ్యా) ప్రకటించాడు. (12) 34-37 అధ్యా. సిద్కియా, యెహోయాకీము రాజుల పాలనలో వారి పాపములను గూర్చి ప్రకటించెను. (13) 37-39 అధ్యా. యెరూషలేము ముట్టడి వేయబడి పట్టబడు కాలమున యిర్మీయా చెరలో నుండి తెలిపిన ప్రకటనలు కలవు. (14) 40-44 అధ్యా. నాలుగు ప్రత్యక్షతల ద్వారా చెరకు పిదప మిగిలిన యూదులు యూదయలో నుండగను, తరువాత యిర్మీయాను వెంటబెట్టుకొని ఐగుప్తుకు వెళ్ళి, అక్కడనే యిర్మీయా లేఖికుడగు బారూకుకు దేవుడిచ్చిన వర్తమానము కలదు.

(16) 46-51 అధ్యాయాలలో నాలుగు ప్రత్యక్షతల ద్వారా పొరుగు అన్యదేశములగు ఐగుప్తు, ఫిలిష్తీయ, మోయాబు, అమ్మోను, ఎదోము, దమస్కు కేదారు, హాసోరు, ఏలాము బబులోనులకు రాబోవు శిక్షలను గూర్చిన ప్రకటనలు కలవు. (17) 52వ అధ్యాయములలో యెరూషలేము పట్టబడుటను గూర్చిన పలు చెరల వివరములు చరిత్ర కలదు.

# యిర్మీయా గ్రంథ విభజన

అధ్యాయాల విభజన: 1+19+19+5+1+6+1=52 అధ్యా.

వరుస సంఖ్య అధ్యాయము అంశము ప్రత్యక్షతలు

**I. 1) 1.** అధ్యా. యిర్మీయాను ప్రవక్తగా నియమించుట **(3** ప్రత్యక్షతలు**)**

**II. 2) 2-20/19** అధ్యా. మొదటి విడత చెరకు ముందు క్రీ.పూ. **626-606 (20** ఏండ్లు**)** వరకు **6** ప్రకటనలు **(6**ప్రత్యక్షతలు**)**

బహిరంగ ప్రకటనతో కూడిన మొదటి ప్రత్యక్షత + సూచనలతో కూడిన 5 ప్రత్యక్షతలు 2) 2-6/5 అధ్యా. మొదట ప్రత్యక్షత - యెరూషలేము పట్టణములో 2 అధ్యా. జనుల నేరములు 3. అధ్యా. పశ్చాత్తాపముకై పిలుపు. 4. అధ్యా. తీర్పు. 5 అధ్యా. పట్టణములోని పాపము. 6. అధ్యా. పట్టణములోని పాపముకై తీర్పు

(3) 7-10/4. అధ్యా. రెండవ ప్రత్యక్షత - మందిర ద్వారము దగ్గర విలాపము అను సూచన (9:1). 7 అధ్యా. మార్గములోను క్రియలలోను తప్పిన యూదావారు. 8 అధ్యా. పశ్చాత్తాప పడనందున శిక్ష. 9 అధ్యా. పాపమును బట్టి కలుగు శిక్షకై విలాపము (1వ). 10 అధ్యా. విగ్రహారాధనయను పాపమును బట్టి కలుగు శిక్షల వివరము.

4) 11-13/3 అధ్యా. మూడవ ప్రత్యక్షత - నడికట్టు సూచన (13:1వ).

11 అధ్యా. నిబంధన భంగము. 12 అధ్యా. యూదావారు విసర్జించబడుట - 13 అధ్యా. విస్తారమైన దోషమునుబట్టి శిక్ష

5) 14-15/2 అధ్యా. నాల్గవ ప్రత్యక్షత - కరువు సూచన (14:1వ).

14 అధ్యా. తమ ఇష్టప్రకారము తిరుగుటనుబట్టి శిక్ష. 15 అధ్యా. తప్పని శిక్ష.

(6) 16-17/2 అధ్యా. అయిదవ ప్రత్యక్షత - అవివాహితుడైన ప్రవక్త సూచన. (16:2వ)
16 అధ్యా. శిక్షను బట్టి దుఃఖము. 17 అధ్యా. విశ్రాంతి దినమును మరచుట.

7) 18-20/3 అధ్యా. ఆరవ ప్రత్యక్షత - కుమ్మరి కూజా సూచన. (18:1,3వ).

18 అధ్యా. కుమ్మరిచేతిలో సారెపై విడిపోయిన కుండ. 19 అధ్యా. కుమ్మరి యొద్ద కూజ కొని పగలు కొట్టుట.
20 అధ్యా. బబులోనుకు వెళ్ళుట - చనిపోవుట.

**III. 21-39/19** అధ్యా. మొదటి విడత చెర తరువాత యెరూషలేము నాశనము వరకు క్రీ.పూ. **606-586 (20** ఏండ్ల**)** వరకు **(23**ప్రత్యక్షతలు**)**

8) 21-23/3 అధ్యా. రాజ్య అధిపతులకు - మతాధిపతులకు వర్తమానములు - (ఒక ప్రత్యక్షత.)

21 అధ్యా. సిద్కియాకు ప్రకటన. 22 అధ్యా. యూదారాజులకు వర్తమానము. 23 అధ్యా. అపవిత్రులైన కాపరులు.

24-29 అధ్యా. చెరను గూర్చిన గ్రంథం.

(9) 24-26/3 అధ్యా. చెరను గూర్చి సిద్కియారాజు, యెహోయాకీను రాజుల కాలములో వర్తమానములు. 24 అధ్యా. రెండు గంపల అంజూరపు పండ్ల సూచన. 25 అధ్యా. చెర 70 ఏండ్లు అను వివరణ 26 అధ్యా. ప్రవక్తకు హింస. (3 ప్రత్యక్షతలు)

(10) 27-29/3 అధ్యా. చెరను గూర్చి సిద్కియారాజు కాలములో వర్తమానములు (3 ప్రత్యక్షతలు)

27 అధ్యా. కాడి పలుపులు సూచన ద్వారా చెరను గూర్చిన వర్తమానము.

28-29 అధ్యా. చెరను గూర్చి చెరలోని వారికి పంపిన పత్రిక.

30-33 అధ్యా. విడుదలను గూర్చి గ్రంథం - ఆదరణ గ్రంథం.

11) 30-33/4 అధ్యా. విడుదలను గూర్చి సిద్కియారాజు కాలములో వాగ్దానములు - సూచనగా యిర్మీయా భూమిని కొనుట - నిబంధన విడుదల ప్రవచనములతో కూడినది. (8 ప్రత్యక్షతలు).

30-31. అధ్యా. వాగ్దానము - నూతన నిబంధన

32 అధ్యా. విడుదలను గూర్చిన సూచనతో కూడిన వివరణ.

33 అధ్యా. రాబోవు దావీదు రాజ్య ప్రవచనము.

12) 34-36/3 అధ్యా. సిద్కియా రాజు చెరకు వెళ్ళుటను గూర్చి రేకాబీయుల విధేయత యెహోయాకీము రాజు అవిధేయతను గూర్చినది (6 ప్రత్యక్షతలు)

34 అధ్యా. యుద్ధకాలమున సిద్కియాకు వర్తమానము. 35 అధ్యా. దేవుని మాటలు వినిన రేకాబీయులు - వినని యూదావారు. 36 అధ్యా. దేవుని మాట వినక గ్రంథము కాల్చిన యెహోయాకీము

13) 37-38/3 అధ్యా. యెరూషలేము ముట్టడి వేయబడి పట్టబడిన కాలమున యిర్మీయా చెరలో నుండగా తెలుపబడిన ప్రకటనలు. (2 ప్రత్యక్షతలు)

37 అధ్యా. ఐగుప్తును ఆశ్రయించుట వ్యర్థము - కల్దీయులు చెరగొనుట ఖాయము.

38 అధ్యా. చెర తప్పదు. 39 అధ్యా. రాజు, ప్రజలు, చెఱకు వెళ్ళుట - యిర్మీయా విడిపించబడుట.

**IV 14) 40-44/5 అధ్యా. చెరకు పిదప కాలము యూదయలోను తదుపరి ఐగుప్తులోను ఉండగా తెలుపబడిన ప్రకటనలు (4 ప్రత్యక్షతలు)**

40 అధ్యా. గెదల్యా అధిపతిగా నియమించబడుట. 41 అధ్యా. గెదల్యా చంపబడుట. 42 అధ్యా. ఐగుప్తుకు వెళ్ళకూడదని దేవుడు సెలవిచ్చుట. 43 ప్రజలు యిర్మీయాతో కూడా

ఐగుప్తుకు వెళ్ళుట. 44 అధ్యా. ఐగుప్తులో కలుగబోవు కీడును గూర్చి దేవుని సెలవు.

**V. 15) 45/1 అధ్యా. బారూకుకు వర్తమానము**

**VI. 16) 46-51/6 అధ్యా. పొరుగు అన్యదేశాలకు ప్రకటనలు (4 ప్రత్యక్షతలు)**

46 అధ్యా. ఐగుప్తుకు (2 ప్రత్యక్షతలు). 47 అధ్యా. ఫిలిష్తీయులకు (1 ప్రత్యక్షత). 48 అధ్యా. మోయాబుకు ప్రకటన. 49 అధ్యా. అమ్మోను, ఎదోము, దమస్కు, కేదారు, హాసారు, ఏలాముకు ప్రకటన.

**VII. 17) 52/1 అధ్యా. యెరూషలేము పట్టబడుట, చెరల వివరమును గూర్చిన చరిత్ర మొత్తము (40 ప్రత్యక్షతలు)**

# యిర్మీయా గ్రంథ పరిచయము

## (1+19+20+5+1+5+1=52అ.)

కాలము - క్రీ.పూ. 626-586 = 40సం.

ఈ కాలమందు పాలించిన రాజులు.

| | |
|---|---|
| 1) యోషీయా | క్రీ.పూ. 639-608 = 31 సం. |
| 2) యెహోయాహాజు | క్రీ.పూ. 608 = 3 నెలలు. |
| 3) యెహోయాకీము | క్రీ.పూ. 608-597 =11సం. |
| 4) యెహోయాకీను | క్రీ.పూ. 597 = 3 నెలలు |
| 5) సిద్కియా | క్రీ.పూ. 597-586 = 11సం. |
| బబులోను చెరకు వెళ్ళుట. | క్రీ.పూ. 606-597 = 586 |

క్రీ.పూ. 586లో యెరూషలేము పట్టణము కాల్చబడి దేవాలయము కూల్చబడినది.

### యెహోవా వాక్కు ప్రత్యక్షతలు

1) క్రీ.పూ. 626-606=20సం. 1అ.లో యెహోవా వాక్కు ప్రత్యక్షతలు (3).
2-19అ.లో యెహోవా వాక్కు ప్రత్యక్షతలు (6)

2) క్రీ.పూ. 606-586 = 20సం. 21-39అ.లో యెహోవా వాక్కు ప్రత్యక్షతలు (23).

I. 21-23అ. ప్రత్యక్షమైన 1 యెహోవా వాక్కు

II. 24-26అ. ప్రత్యక్షమైన 3 వాక్కులు ( అంజూరపు పండ్ల గంపల సూచన)

III. 27-29అ. ప్రత్యక్షమైన 3 వాక్కులు (కాడి పలుపులు అను సూచన)

IV. 30-33అ. విడుదలను గూర్చి 8 యెహోవా వాక్కులు.

V. 34-39 (6అ) యెహోయాకీము, సిద్కియా రాజుల పాపాలను గూర్చిన 8 ప్రత్యక్షతలు.

3) 40-44అ.లో ఐగుప్తుకు వెళ్ళకముందు, ఐగుప్తులో నుండగా ప్రత్యక్షతలు (4)

4) 46-49అ.లో శత్రు దేశాలకు యెహోవా వాక్కు ప్రత్యక్షతలు (4).

క్రీ.పూ. 606-586, యెహోవా వాక్కు ప్రత్యక్షతల మొత్తము (3+6+23+4+4=40).

**ప్రత్యక్షత వివరము**

**I. యిర్మీయా ప్రవక్తగా నియామకము. మూడు ప్రత్యక్షతలు 1:4,11,13వ.**

యిర్మీ. 1:2వ. పదుమూడవ సం. యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమాయెను.

1) యిర్మీ 1:4వ. యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను.

2) యిర్మీ 1:11వ. యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యిర్మీయా, నీకేమి కనబడుచున్నది. అందుకు బాదము చెట్టు చువ్వ కనబడుచున్నదని నేననగా.

3) యిర్మీ 1:13వ. రెండవ మారు యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై నీకేమి కనబడుచున్నదని సెలవియ్యగా - నాకు మసలుచున్న బాన నాకు కనబడుచున్నది.

**II. చెరకు ముందు 20 సం.లో ఆరు ప్రత్యక్షతలు.**

1) యిర్మీ. 2:1వ. యెహోవా వాక్కు ప్రత్యక్షమై యెరూషలేము పట్టణ నివాసులకు ప్రకటన.

2) యిర్మీ. 7:1వ. యెహోవా వాక్కు ప్రత్యక్షమై మందిర ద్వారమున ప్రకటన. (సూచన - విలాపము)

3) యిర్మీ. 11:1వ. యిర్మీయాకు ప్రత్యక్షమైన వాక్కు యూదా పట్టణములలోను, వీధులలోను (నడికట్టు సూచన). (13:3,8లో నున్న ప్రత్యక్షతలు ఇందులోనే ఇమిడి యున్నవని తలంచుచున్నాము).

4) యిర్మీ. 14:1వ. కరువు కాలము (సూచన) గూర్చి ప్రధాని కొరకు ప్రత్యక్షమైన యెహోవా వాక్కు (అవివాహితుడైన ప్రవక్త సూచన).

6) యిర్మీ 18:1-5వ. రాజులకు, ప్రజలకు ప్రత్యక్షమైన వాక్కు (నీవు కుమ్మరి ఇంటికి పొమ్ము) (కుమ్మరి, కూజా సూచన).

**చెరకాలమందు 20సం.లో యిర్మీయాకు ప్రత్యక్షమైన 23 యెహోవా వాక్కులు.**

III 21-23అ. ప్రత్యక్షమైన 1 యెహోవా వాక్కు.

1. యిర్మీ 21:2వ. రాజైన సిద్కియా యెహోవాచేత విచారించుడని వారిని పంపగా యెహోవా యొద్ద నుండి ప్రత్యక్షమైన వాక్కు.

**24-26అ. అంజూరపు పండ్ల గంపల సూచన. (ప్రత్యక్షమైన 3 వాక్కులు)**

1) యిర్మీ. 24:4వ. యెహోవా యిర్మీయా, నీకేమి కనబడుచున్నదని అడుగగా అంజూరపు పండ్లు మంచివి మిక్కిలి మంచివిగాను జబ్బువి మిక్కిలి జబ్బువిగాను, తినశక్యముకానంత జబ్బువి గాను కనబడుచున్నవంటిని. అప్పుడు యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై...

2) యిర్మీ. 25:1-3వ. ఆమోను కుమారుడును యూదా రాజునైన యోషీయా పదమూడవ సంవత్సరము మొదలుకొని నేటి వరకు ఈ ఇరువది మూడు సంవత్సరములు యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమగుచు వచ్చెను.

3) యిర్మీ 26:1వ. యోషీయా కుమారుడును యూదా రాజునగు యెహోయాకీము ఏలుబడి ఆరంభములో యెహోవా వాక్కు ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను.

**27-29అ. కాడి పలుపులు అను సూచన. (ప్రత్యక్షమైన 3 వాక్కులు)**

1) యిర్మీ. 27:1వ. యూదా రాజైన యోషీయా కుమారుడగు యెహోయాకీము ఏలనారంభించినప్పుడు యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమాయెను.

2) యిర్మీ 28:12వ. ప్రవక్తయైన హనన్యా ప్రవక్తయైన యిర్మీయా మెడమీదనున్న కాడి విరిచిన తరువాత యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమాయెను.

3) యిర్మీ 29:30వ. యాజకుడైన జెఫన్యా ప్రవక్తయైన యిర్మీయా వినుచుండగా ఆ పత్రికను చదివి వినిపించగా యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై సెలవిచ్చెను.

**30-33అ. విడుదలను గూర్చి 8 యెహోవా వాక్కులు.**

1) యిర్మీ. 30:1 యెహోవా యొద్ద నుండి వచ్చి యిర్మీయాకు ప్రత్యక్షమైన వాక్కు.

2) యిర్మీ. 31:3 చాలాకాలము క్రిందట యెహోవా నాకు ప్రత్యక్షమై ఇట్లనెను శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక విడువక నీ యెడల కృప చూపుచున్నాను.

3) యిర్మీ 32:1 యూదారాజైన సిద్కియా యేలుబడి పదియవసంవత్సరమున, అనగా నెబుకద్రెజరు ఏలుబడి పదునెనిమిదవ సంవత్సరమున యిర్మీయాకు ప్రత్యక్షమైన వాక్కు.

4) యిర్మీ. 32:6 యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను. హనమేలు భూమిని కొనుటకు విమోచకుని ధర్మము నీదే. దాని కొనుక్కొనుమని చెప్పును.

5) యిర్మీ 32:26 యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై సెలవిచ్చెను. నేను యెహోవాను సర్వశరీరులకు దేవుడను, నాకు అసాధ్యమైనదేదైన నుండునా?

6) యిర్మీ 33:1 మరియు యిర్మీయా చెరసాల ప్రాకారములలో ఇంక ఉంచబడి యుండగా యెహోవా వాక్కు రెండవసారి ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను.

7) యిర్మీ 33:19 యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై సెలవిచ్చెను.

8) యిర్మీ 33:23 యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై సెలవిచ్చెను.

**34-39 (6అ.) యెహోయాకీము, సిద్కియా రాజుల పాపములను గూర్చిన 8 ప్రత్యక్షతలు.**

1) యిర్మీ 34:1 నెబుకద్రెజరును సేనయు అతని అధికారము క్రిందనున్నవారు కూడి యెరూషలేము మీద యుద్ధము చేయుచుండగా యెహోవా యొద్ద నుండి యిర్మీయాకు దర్శనమైన వాక్కు

2) యిర్మీ. 34:8 యూదులచేత యూదులు కొలువు చేయించుకొనక విడుదల చాటింపవలె నని రాజైన సిద్కియా యెరూషలేములో నున్న సమస్త ప్రజలతో నిబంధన చేసిన తరువాత యెహోవా యొద్ద నుండి యిర్మీయాకు ప్రత్యక్షమైన వాక్కు.

3) యిర్మీ 35:1 యెహోయాకీము దినములలో యెహోవా యొద్దనుండి యిర్మీయాకు వాక్కు ప్రత్యక్షమై నీవు రేకాబీయుల యొద్దకు పోయి వారితో మాటలాడి...

4) యిర్మీ 35:12 యెహోవా వాక్కు ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను. నీవు వెళ్లి యూదా వారికిని యెరూషలేము నివాసులకును ఈ మాట ప్రకటింపుము యెహోవా వాక్కు ఇదే.

5) యిర్మీ 36:1 యూదా రాజైన యోషీయా కుమారుడగు యెహోయాకీము నాలుగవ సం. యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను.

6) యిర్మీ 36:27 యిర్మీయా నోటి మాటనుబట్టి బారూకు వ్రాసిన గ్రంథమును రాజు కాల్చిన తరువాత యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను.

7) యిర్మీ 37:6 యెహోవా వాక్కు ప్రవక్తయైన యిర్మీయాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను.

8) యిర్మీ 39:1 యిర్మీయా బందీ గృహశాలలో నుండగా యెహోవా వాక్కు ప్రత్యక్షమాయెను.

**40-44అ. ఐగుప్తుకు వెళ్లక ముందు, వెళ్లిన తరువాత ప్రత్యక్షమైన నాలుగు వాక్కులు.**

1) యిర్మీ 40:1 నెబూజరదాను సంకెళ్లచేత కట్టబడియున్న యిర్మీయాను తీసికొని రామాలో నుండి పంపివేయగా యెహోవా యొద్ద నుండి అతనికి ప్రత్యక్షమైన వాక్కు

2) యిర్మీ 42:7 పది దినముల తరువాత యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమాయెను.

3) యిర్మీ 43:8 ఐగుప్తు తహపనేసులో యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమాయెను.

4) యిర్మీ 44:1 మిగ్దోలు తహపనేసు నొపు పత్రోసులోగాని ఐగుప్తు దేశ వాసము చేయుచున్న యూదులనందరిని గూర్చి యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై సెలవిచ్చెను.

**46-51అ. యూదా చుట్టూనున్న శత్రువులకు ప్రత్యక్షమైన 4 వాక్కులు**

1) యిర్మీ 46:1 అన్యజనులగూర్చి యిర్మీయాకు ప్రత్యక్షమైన యెహోవా వాక్కు

2) యిర్మీ 46:13 బబులోను రాజైన నెబుకద్రెజరు బయలుదేరి వచ్చి ఐగుప్తీయులను హతము చేయుటను గూర్చి యిర్మీయాకు ప్రత్యక్షమైన యెహోవా వాక్కు.

3) యిర్మీ 47:1 ఫరో గాజాను కొట్టకమునుపు ఫిలిష్తీయులను గూర్చి ప్రత్యక్షమైన వాక్కు

4) యిర్మీ 49:34 యూదా రాజైన సిద్కియా యేలుబడి ఆరంభములో యెహోవా వాక్కు ప్రవక్తయైన యిర్మీయాకు ప్రత్యక్షమై ఏలామును గూర్చి సెలవిచ్చెను.

**గ్రంథ ముఖ్య ఉద్దేశము:-**

1:16-17వ. యెరూషలేము వారు దేవుని విడిచి అన్యదేవతలకు ధూపము వేసి, తమ చేతులు రూపించిన వాటికి నమస్కరించుటయను తమ చెడుతనమంతటిని బట్టిన దేవుని తీర్పులు యిర్మీయా ప్రకటించాలి. యిర్మీయా నడుము కట్టుకొని నిలువబడి అనగా సిద్ధమనస్సుతో, విధేయుడై దేవుడు ఆజ్ఞాపించునదంతయు వారికి భయపడక ప్రకటన చేయాలి. యిర్మీయా అలాగే చేసాడు.

**ముఖ్యమైన సంఘటనల కాల వివరములు.**

1) క్రీ.పూ. 1050-1010 సౌలు రాజు పాలన.

2) క్రీ.పూ. 1010-970 దావీదు రాజు పాలన.

3) క్రీ.పూ. 970-930 సొలొమోను రాజు పాలన.

4) క్రీ.పూ. 967-960 సొలొమోను రాజుచే మందిర నిర్మాణము.

5) క్రీ.పూ. 930 రాజ్యము ఉత్తర, దక్షిణ రాజ్యములుగా విభజించబడుట.

6) క్రీ.పూ. 970-721, 19 మంది ఇశ్రాయేలు రాజులచే ఉత్తర రాజ్యముగా పాలన.

7) క్రీ.పూ. 970-721, ఇశ్రాయేలు రాజులు, ప్రజలు అందరు విగ్రహారాధికులు.

8) క్రీ.పూ. 732, 721. ఇశ్రాయేలు ప్రజలు రెండు విడతలుగా అష్షూరు చెరకు వెళ్ళుట.

9) క్రీ.పూ. 930-586, 20 మంది యూదా రాజులచే దక్షిణ రాజ్యముగా పాలన.

10) క్రీ.పూ. 960-536 విశ్రాంతి దినములు పాటించక పోవుట. (2దిన. 36:21వ).

11) క్రీ.పూ. 755-695 యెషయా ప్రవచించిన కాలము.

12) క్రీ.పూ. 626-586 యిర్మీయా ప్రవచించిన కాలము.

13) క్రీ.పూ. 692-672 యెహెజ్కేలు ప్రవచించిన కాలము.

14) క్రీ.పూ. 606, 597, 586 యూదా ప్రజలు మూడు విడతలుగా చెరకు వెళ్ళుట.

15) క్రీ.పూ. 586 యెరూషలేము మందిర నాశనము.

16) క్రీ.పూ. 606-536, వరకు 70 సంవత్సరములు బబులోనులో చెరగా నుండుట.

17) క్రీ.పూ. 536 యూదా ప్రజలు చెర నుండి తిరిగి వచ్చుట.

18) క్రీ.పూ. 536-515 మందిర నిర్మాణము.

# యిర్మీయా ప్రవక్తగా నియామకము - మూడు ప్రత్యక్షతలు

## 1వ. అధ్యాయము (3+7+2+2=14వ)

అంశము:- యిర్మీయా ప్రవక్తగా నియామకము.

**1-3వ. గ్రంథ పరిచయము:-** యిర్మీయా బెన్యామీను దేశమందలి అనాతోతులో కాపురమున్న యాజకుడైన హిల్కీయా కుమారుడు కనుక యాజక వంశమునకు చెందినవాడు. ఆనాటి రాజుల పాలనా కాలము. 1) యోషీయా క్రీ.పూ. 639-608=31సం. 2) యెహోయాకీము క్రీ.పూ. 608-597=11సం. 3) యెహోయాకీను క్రీ.పూ. 597=3నెలలు. 4) సిద్కియా క్రీ.పూ. 597-586=11సం. యోషీయా యూదాకు రాజైయుండగా (యోషీయా క్రీ.పూ. 639-608) అతని యేలుబడి పదుమూడవ సంవత్సరము నుండి (క్రీ.పూ. 626), యోషీయా కుమారులగు యెహోయాకీము, సిద్కియాలు యూదాకు రాజులై యుండగా (సిద్కియా క్రీ.పూ. 597-586), అతని యేలుబడి పదునొకండవ సంవత్సరాంతము వరకు (క్రీ.పూ. 586), ఆ సంవత్సరము అయిదవ నెలలో యెరూషలేము చెరదీసికొని పోబడు వరకు యెహోవా వాక్కు యిర్మీయాకు క్రీ.పూ. 626 నుండి 586 వరకు 40 సం. ప్రత్యక్షమగుచుండెను.

**4-10వ. మొదటి ప్రత్యక్షత - యిర్మీయాను ప్రవక్తగా నియమించిన విధానము:-** 4-5వ. గర్భములో నేను నిన్ను రూపింకమునుపే నిన్నెరిగితిని, నీవు గర్భము నుండి బయలుపడక మునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని, జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితిని అన్నందున మనము గర్భములో రూపించబడకముందే దేవుడు మనలను యెరిగి మన పట్ల తన ప్రణాళిక సిద్ధపరచి ఆ పనికి ప్రతిష్ఠించును. సరియైన సమయములో సంఘమునకు అపో. 13:2 ప్రకారము తెలియపరచి దానిని నెరవేర్చును. 6-8వ. యెహోవా, చిత్తగించుము నేను బాలుడనే; మాటలాడుటకు శక్తిచాలదని యిర్మీయా అనగా నేను బాలుడననవద్దు

అన్నాడు. దీని భావము నేను బాలుడనే అను గుర్తింపును మనమును కలిగియుండాలి. కాని అలాగని ఆగిపోకూడదు. దేవుడు చెప్పిన మాటలు / ఆజ్ఞలు గమనింతము.

1) నేను నిన్ను పంపువారందరి యొద్దకు నీవు పోవలెను,

2) నీకాజ్ఞాపించిన సంగతులన్నియు చెప్పవలెను,

3) వారికి భయపడకుము,

4) నిన్ను విడిపించుటకు నేను నీకు తోడైయున్నాను,

5) నేను ఈ దినమున జనముల మీదను రాజ్యములమీదను నిన్ను నియమించియున్నాను.

9-10వ. దేవుడు తన చేయి చాపి యిర్మీయా నోరు ముట్టి నోటిలో తన మాటలు ఉంచినట్లు మన నోటిలో తన మాటలను ఉంచును. పెల్లగించుటకును విరుగగొట్టుటకు, నశింపజేయుటకు పడద్రోయుటకును, కట్టుటకును, నాటుటకును నేను ఈ దినమున జనముల మీదను రాజ్యముల మీదను నిన్ను నియమించియున్నాను అనుటలో మనము ఏమేమి చేయాలో తేటగా చెప్పును.

**11-12వ.** రెండవ ప్రత్యక్షత - **యూదా వారు బబులోను శిక్షకు కొనిపోబడు విధము -** బాదము చెట్టు చువ్వ సూచన:- యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై బాదము చెట్టు చువ్వ చూపగా యిర్మీయా బాగుగా కనిపెట్టాడు. చువ్వ శిక్షించునది కనుక దేవుడు యూదా వారిని శిక్షించుటకు ఆతురుపడుచున్నాడని గుర్తించాడు.

**13-14వ. మూడవ ప్రత్యక్షత - యూదా వారు బబులోను శిక్షకు కొనిపోబడు విధము- రెండవ సూచనగా మసలుచున్న బాన:-** రెండవమారు యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై ముఖము ఉత్తర దిక్కునకు తిరిగియున్న మసలుచున్న బానను చూపించాడు. ఉత్తర దిక్కు మార్గము గుండా కొనిపోయి ఈ దేశనివాసులందికి కీడు కలుగ చేయుట అనగా బానిసలుగా చేయునని దీని భావము.

**15-16వ. గ్రంథము యొక్క సారాంశము - శిక్షకు కారణమైన విగ్రహారాధన:-** యెరూషలేమువారు యెహోవాను విడిచి అన్యదేవతలకు ధూపమువేసి, తమ చేతులు రూపించిన వాటికి నమస్కరించుటయను చెడుతనమంతటినిబట్టి యెహోవా తీర్పులు ప్రకటించాడు. ఇదిగో నేను ఉత్తరదిక్కున నున్న రాజ్యములను పిలిచెదనని, వారు వచ్చి ప్రతివాడును యెరూషలేము గుమ్మములలోను, యెరూషలేము చుట్టునున్న ప్రాకారములన్నిటికి, యూదా పట్టణములన్నిటికి ఎదురుగాను తమ సింహాసనములను స్థాపింతురు అన్నాడు. దీని నెరవేర్పుగా బబులోను రాజు యూదులను జయించి **తన** రాజ్యమును స్థాపించాడు.

**17-19వ. ప్రవక్తకు తోడైయుంటానని దేవుని అభయము:-** కాబట్టి నీవు నడుము కట్టుకొని నిలువబడి నేను నీకాజ్ఞాపించునదంతయు వారికి ప్రకటన చేయుము; భయపడకుము లేదా నేను వారి యెదుట నీకు భయము పుట్టింతును. యీ దేశమంతటిలో నీవెక్కడికి పోయినను, ప్రాకారముగల పట్టణముగాను ఇనుప స్తంభముగాను ఇత్తడి గోడలు గాను నీవుందునట్లు ఈ దినమున నిన్ను నియమించి యున్నాను. వారు నీతో యుద్ధము చేతురు గాని నిన్ను విడిపించుటకు నేను నీకు తోడైయున్నందున వారు నీపైని విజయము పొందజాలరు అని యెహోవా సెలవిచ్చాడు.

II. చెరకు ముందు 20 సం.లో ఆరు ప్రత్యక్షతలు.

1) యిర్మీ. 2:1 వాక్కు ప్రత్యక్షమై యెరూషలేము పట్టణ నివాసులకు ప్రకటించాడు.

2) యిర్మీ. 7:1 వాక్కు ప్రత్యక్షమై మందిర ద్వారమున ప్రకటన (సూచన - విలాపము).

3) యిర్మీ 11:1 యిర్మీయాకు ప్రత్యక్షమైన వాక్కు యూదా పట్టణములలోను, వీధులలోను (నడికట్టు సూచన).

4) యిర్మీ 14:1 కరవు కాలము (సూచన) గూర్చి ప్రధాని కొరకు ప్రత్యక్షమైన వాక్కు

5) యిర్మీ 16:1 రాజులకు, ప్రజలకు ప్రత్యక్షమైన వాక్కు (అవివాహితుడైన ప్రవక్త సూచన).

6) యిర్మీ 18:1 రాజులకు, ప్రజలకు ప్రత్యక్షమైన వాక్కు (నీవు కుమ్మరి ఇంటికి పొమ్ము) (కుమ్మరి, కూజా సూచన).

**చెరకు ముందు 20సం.లోని ఆరు ప్రత్యక్షతలలో మొదటి ప్రత్యక్షత.**
**మొదటి ప్రత్యక్షత 2-6అ.- యెరూషలేము నివాసులకు వీధులలో ప్రకటన.**

## 2వ. అధ్యాయము (9+10+9+9=37వ)

**అంశము:- జనుల నేరములు.**

**1-9వ.** పాపములు:- 1-3వ. ఐగుప్తు నుండి విమోచించాక అరణ్య ప్రయాణములో నున్నప్పుడు దేవుడు ముఖ్యముగా పది ఆజ్ఞలను, మిగిలిన ఆజ్ఞలను ఇవ్వగా ఇశ్రాయేలీయులు అంగీకరించి, దేవుని వెంబడించిరి. 1) దీనిని దేవుడు యౌవన కాలములో చూపిన అనురాగము, వైవాహిక ప్రేమగా నేను జ్ఞాపకము చేసికొనుచున్నానని చెప్పుచున్నాడు. అప్పుడు ఇశ్రాయేలు విరోధులైన వారందరిని దేవుడు శిక్షకు పాత్రులుగా చేసాడు. 4-6వ. 2) ఇప్పుడైతే ఇశ్రాయేలు వ్యర్థమైనదాని ననుసరించి, దేవుని యొద్దనుండి దూరముగా తొలగి పోయిరి. 3) ఐగుప్తు దేశములో బానిసత్వము నుండి విడిపించి, రప్పించి, నడిపించిన

వారి వెంబడి పోదునని యూదులు చెప్పుచున్నారు. 26-28వ. వారు దేవుని తట్టు ముఖము త్రిప్పుకొనక వీపునే త్రిప్పుకొనిరి; క్రమశిక్షగా ఆపదలను దేవుడు పంపినను దిద్దుకొనకయే మమ్మును రక్షింపుమని వారు దేవునికి మనవి చేయుచున్నారు.

**29-37వ. పాపము చేసియు చేయలేదని చెప్పుట:-** 29-32వ. వారందరు తిరుగుబాటు చేసి మేము స్వేచ్ఛగా తిరుగులాడువారము, ఇకను దేవుని యొద్దకు రామని చెప్పుచున్నారు. కన్యక తన ఆభరణములను, పెండ్లికుమార్తె తన ఒడ్డాణమును మరువదు. దేవుని ప్రజలైన ఇశ్రాయేలు లెక్కలేనన్ని దినములు యెహోవాను మరచిరి. 33-37వ. కామము తీర్చుకొనుటకై ఉపాయముగా నటించుచు నేను నిర్దోషిని, నిశ్చయముగా ఆయన కోపము నామీద నుండి తొలగిపోయెనని ఇదిగో పాపము చేయలేదని చెప్పినదానిబట్టి దేవునితో వ్యాజ్యెము కలిగినదని దేవుడు చెప్పుచున్నాడు. చేతులు నెత్తిని బెట్టుకొని బానిసత్వమునకు బయలువెల్లుదురని దేవుడు చెప్పుచున్నాడు.

## 3వ. అధ్యాయము (5+5+5+5+5=25వ)

**అంశము:- పశ్చాత్తాపమునకై పిలుపు**

**1-5వ. తన దగ్గరకు తిరిగి వచ్చిన విమోచించెదనన్న పిలుపు:-** 1-2వ. ఒకడు తన భార్యను త్యజించగా ఆమె అతని యొద్ద నుండి తొలగిపోయి వేరొక పురుషునిదైన తరువాత అతడు ఆమె యొద్దకు తిరిగి చేరుట లోకములో జరుగదు. ఒకవేళ అలాగు జరిగినయెడల దేశము బహుగా అపవిత్రమగును. కాని యూదావారు యెహోవాను విడిచి విగ్రహములను సేవించి తనకు దూరమై, దుష్కార్యములచేత దేశమును అపవిత్రపరచిరి. 3-5వ. వానలు కురియక మాని, కడవరి వర్షము లేకపోయి యున్నది, ఆయన నిత్యము,కోపించక దయచూపుదునని ప్రార్థించి తనయొద్దకు తిరిగి రమ్మని యెహోవా చెప్పుచున్నాడు.

**6-10వ. పూర్ణహృదయముతో కాక పై వేషముతో వచ్చిన యూదా:-** 6-8వ. ఇశ్రాయేలు ద్రోహినియై ప్రతి కొండ మీద వ్యభిచారమగు విగ్రహారాధన చేసినను, ఆమెను యెహోవా తన యొద్దకు తిరిగి రమ్మని సెలవియ్యగా ఆమె తిరిగి రాలేదు. పది గోత్రముల ఇశ్రాయేలు వ్యభిచారము చేసిన హేతువు చేతనే యెహోవా విడిచిపెట్టి ఆమెకు పరిత్యాగ పత్రిక ఇయ్యగా అనగా అష్షూరుకు చెరకు పంపగా, ఆమె సహోదరియైన యూదా చూచియు తాను భయపడక వ్యభిచారము అనగా విగ్రహారాధన చేయుచు వచ్చుచున్నది. 9-10వ. యూదా విశ్వాసఘాతకురాలై రాళ్లను మొద్దులను పూజించి దేశమును అపవిత్రపరచెను. యూదా పై వేషమునకే గాని తన పూర్ణ హృదయముతో దేవుని వైపుకు తిరుగుటలేదని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**11-15వ. ఒప్పుకొనవలసిన విధము:-** 11-12వ. యిర్మీయా ఉత్తర దిక్కునకు వెళ్లి ద్రోహినివగు ఇశ్రాయేలూ, తిరిగి రమ్ము; దేవుడు కృపగలవాడు, గనుక దేవుడు ఎల్లప్పుడు కోపించడని చెప్పాడు. 13-15వ. దేవుడైన యెహోవా మీద తిరుగుబాటు చేయుచు, ఇటు అటు పోయిన దోషము యూదా ఒప్పుకొని రావాలని భ్రష్టులగు పిల్లలారా, తిరిగి రండి అని పిలుచుచున్నాడు. ఒకానొక పట్టణములో నుండి ఒకనిగాను, ఒకానొక కుటుంబములోనుండి ఇద్దరినిగాను తీసికొని సీయోనునకు రప్పించి, తనకిష్టమైన కాపరులను నియమింతునని వారు జ్ఞానముతోను వివేకముతోను ఏలుదురని యెహోవా చెప్పుమన్నాడు.

**16-20వ. తిరిగి రాని యెడల మందసము వెళ్లిపోవునని చెప్పుట:-** 16-17వ. మీరు ఆ దేశములో అభివృద్ధి పొంది విస్తరించు దినములలో జనులు యెహోవా నిబంధన మందసమని చెప్పబడకుండునట్లు, అది కనబడకుండా పోయినను వారి మనస్సు లోనికి రాదు, దానిని జ్ఞాపకము చేసికొనరు, అది పోయినందుకు చింతపడరు, ఇకమీదట దాని చేయరాదని చెప్పాడు. కనుక నాటినుండి నేటివరకు మందసము భూమిమీద లేదు. కాని అంత్య కాలమున యెహోవా యొక్క సింహాసనమని యెరూషలేమునకు పేరు పెట్టెదరు; యూదా వంశస్థులును ఇశ్రాయేలు వంశస్థులును ఉత్తర దేశములో నుండి దేవుడు స్వాస్థ్యముగా ఇచ్చిన దేశమునకు వచ్చి జనములన్నిటితో కలియుదురు. తమ దుష్టమనస్సులో పుట్టు మూర్ఖత్వము చొప్పున నడుచుకొనక యెహోవా నామమునుబట్టి యెరూషలేమునకు గుంపులుగా కూడివచ్చెదరు. 18-20వ. స్త్రీ తన పురుషునికి విశ్వాస ఘాతకురాలగునట్లు ఇశ్రాయేలు వంశస్థులు, నిశ్చయముగా విశ్వాస ఘాతకులైరని చెప్పుచున్నాడు.

**21-25వ. పశ్చాత్తాపపడి తిరిగి వచ్చిన మేలు చేయుదునన్న వాగ్ధానము:-** 21-22వ. తాము దుర్మార్గులై తమ దేవుడైన యెహోవాను మరచిన దానినిబట్టి ఇశ్రాయేలీయులు చేయు రోదన విజ్ఞాపనములు దేవుడు వినుచున్నాడు. భ్రష్టులైన బిడ్డలారా, తిరిగి రండి, మీ అవిశ్వాసమును నేను బాగుచేసెదను అని మెట్టలమీద ఒక స్వరము వినబడుచున్నది. 23-25వ. నీవే మా దేవుడైన యెహోవావు, నీ యొద్దకే మేము వచ్చుచున్నాము, నిశ్చయముగా మా దేవుడైన యెహోవా వలన ఇశ్రాయేలునకు రక్షణ కలుగును అని యూదా తదుపరి గుర్తించును. సిగ్గునొందిన వారమై సాగిలపడుదము రండి, మన దేవుడైన యెహోవా మాట వినక మన బాల్యమునుండి మన దేవుడైన యెహోవాకు విరోధముగా పాపము చేసినవారము అని ప్రార్థించుదురు అన్నాడు.

# 4వ. అధ్యాయము (6+6+6+4+4+5=31వ)

అంశము:- తీర్పు

**1-6వ. రానున్న కీడును గూర్చిన ప్రకటన:-** 1-3వ. ఇదే యెహోవా వాక్కు ఇశ్రాయేలూ, నీవు తిరగి రానుద్దేశించిన యెడల నా యొద్దకే రావలెను, నీవు ఇటు అటు తిరుగుట మాని నీ హేయక్రియలను తొలగించి సత్యమునుబట్టి న్యాయమును బట్టి నీతినిబట్టి యెహోవా జీవముతోడని ప్రమాణము చేసినయెడల జనములు ఆయన యందు తమకు ఆశీర్వాదము కలుగుననుకొందరు, ఆయనయందే అతిశయపడుదురు. ముళ్ల పొదలలో ఆశీర్వాదము కలుగుననుకొందరు, ఆయనయందే అతిశయపడుదురు. ముళ్ల పొదలలో విత్తనములు చల్లక బీడు పొలమును దున్నమన్నాడు. 4-6వ. అవిధేయులై యుండుట మానుకొని లోబడియుండుడని యెహోవా ఉత్తరదిక్కు నుండి కీడును, గొప్ప నాశనమును రప్పించుచున్నాడని చెప్పుచున్నాడు.

**7-12వ. రానున్న తీర్పు వివరమును గూర్చిన ప్రకటన:-** 7-9వ. పొదలలో నుండి సింహము అనగా బబులోను రాజు దేశమును నాశనము చేయుటకు ప్రయాణమై తన నివాసమును విడిచి వచ్చుచున్నాడు, కనుక పట్టణములు పాడై నిర్జనముగా నుండునని, అందుకై గోనెపట్ట కట్టుకొని ప్రార్థించమన్నాడు. 10-12వ. యెహోవా మీకు క్షేమము కలుగునని గతములో చెప్పాడు కాని ఇప్పుడు వారి పాపమునుబట్టి వారి మీదికి రావలసిన తీర్పులు చెప్పుదును అని చెప్పుచున్నాడు.

**13-18వ. తీర్పును గూర్చిన కారణములు:-** 13-15వ. హృదయములో నున్న చెడుతనము, దుష్టాభిప్రాయములు తీర్పుకు కారణములు. యెరూషలేమా, ఎన్నాళ్లవరకు నీ దుష్టాభిప్రాయములు నీకు కలిగియుండును? నీవు రక్షింపబడునట్లు నీ హృదయములో నుండి చెడుతనము కడిగివేసికొనుము అని దేవుడు సెలవిచ్చుచున్నాడు. మేఘములు కమ్మునట్లు, ఆయన రథములు సుడిగాలివలె, గుఱ్ఱములు గద్దలకంటె వేగముగలవిగా వచ్చుచున్నవి. 16-18వ. ముట్టడి వేయువారు దూరదేశము నుండి వచ్చి యూదా పట్టణములను పట్టుకొందుమని బిగ్గరగా అరచుచున్నారని యెరూషలేమును గూర్చి జనములకు తెలియజేయమన్నాడు. యూదా ప్రవర్తనయు, క్రియలును, చెడుతనమే కారణములై ఈ తీర్పును రప్పించెను.

**19-22వ. ప్రవక్త యొక్క అంతరంగము:-** ఈ తీర్పునుబట్టి ప్రవక్త కడుపులో వేదన, గుండె నరములు, కొట్టుకొనుచున్నది, బాకానాదము వినబడుట, కీడు వెంట కీడు వచ్చుట, దేశమంతయు దోచుకొనబడుట జరుగుచున్నది.

**23-26వ. తీర్పు యొక్క వివరము - ప్రవక్త చూచిన తీర్పు:-** 23-24వ. ప్రవక్త భూమిని చూడగా అది నిరాకారముగాను శూన్యముగాను ఉండెను; ఆకాశము తట్టు చూడగా అచ్చట వెలుగు లేకపోయెను. పర్వతములను చూడగా అవి కంపించుచున్నవి. కొండలన్నియు కదులుచున్నవి. 25-26వ. ప్రవక్త చూడగా నరుడొకడును లేకపోయెను, ఆకాశ పక్షులన్నియు ఎగిరి పోయి యుండెను. ఫలవంతమైన భూమి యెడారి ఆయెను, అందులోని పట్టణములన్నియు యెహోవా కోపాగ్నికి నిలువలేక ఆయన యెదుట నుండకుండ పడగొట్టబడి యుండెను. దేవుడు కృపగలవాడైనను ఆయన తీర్పులు కఠినములే. 70 ఏండ్ల కాలములో ఈ ప్రవచన సమీప నెరవేర్పు, అంత్యకాలములో సంపూర్ణ నెరవేర్పు చూతుము.

**27-31వ. పాడైన దేశము, ప్రజలు:-** యెహోవా దేశమంతయు పాడగును గాని నిశ్శేషముగా నాశనము చేయను. దానినిబట్టి భూమి దుఃఖించునని, ప్రవసవేదనపడు స్త్రీ కేకలు వేయునట్లు సీయోను కుమార్తె యెగరోజుచు చేతులార్చుచు కేకలు వేయుట దేవునికి వినబడెను.

## 5వ. అధ్యాయము (4+5+5+5+5+5+2=31వ)

అంశము:- పట్టణములోని పాపము - తీర్పు

**1-4వ. రాజవీధిలో పాపము:-** యెరూషలేము పట్టణ వీధులలో రాజవీధులలో న్యాయము జరిగించుచు నమ్మకముగా నుండ యత్నించుచున్న ఒకడు కనబడుట లేదని, యెహోవా జీవముతోడు అను మాట పలికి మోసముకై ప్రమాణము చేయుదురని దేవుడు చెప్పుచున్నాడు. యెహోవా, యథార్థత మీద దృష్టి యుంచువాడు కనుక వారిని కొట్టి క్షీణింపజేసినను దేవుని న్యాయవిధిని ఎరుగక బుద్ధిహీనులై వారు శిక్షకు లోబడనొల్లకున్నారని దేవుడు చెప్పుచున్నాడు.

**5-9వ. ఘనుల పాపము:-** ఘనులైన వారు యెహోవా మార్గమును, తమ దేవుని న్యాయవిధిని ఎరుగనివారై ఒకడును తప్పకుండ వారు దేవుని కాడిని విరిచినవారుగా కట్లను తెంపుకొనినవారుగా ఉన్నారు. వారు వ్యభిచారము చేయుచూ తిరుగుబాటు చేసిరి. గనుక రాబోవు దినములలో అరణ్యము నుండి వచ్చిన సింహము అనగా బబులోనీయులు, చిరుతపులి అనగా గ్రీకులు వారిని చంపుదురని చెప్పుచున్నాడు.

**10-14వ. నాశనము:-** ఇశ్రాయేలు వంశస్థులును, యూదా వంశస్థులును బహుగా విశ్వాసఘాతుకులైనందున వారిని నాశనము చేయుడి, అయినను నిశ్శేషముగా నాశనము

చేయకుడి, అని దేవుడు అన్నాడు. వారు పలుకువాడు యెహోవా కాదనియు అసలు ఆయన లేడని పలికినందున దేవుని వాక్యము వారిని కాల్చునట్లు ఈ జనమును కట్టెలుగాను చేసెదను అని యెహోవా అన్నాడు.

**15-19వ. నాశన వివరము:-** ఇశ్రాయేలు కుటుంబమువారలారా, ఆలకించుడి, దూరమున నుండి మీ మీదికి ఒక జనమును రప్పించెదను, వారు నీ పంటను నీ ఆహారమును నాశనము చేయుదరు, నీ కుమారులను నీ కుమార్తెలను నాశనము చేయుదరు, నీ గొఱ్ఱెలను నీ పశువులను నాశనము చేయుదురు, నీ ద్రాక్షచెట్ల ఫలమును నీ అంజూరపు చెట్ల ఫలమును నాశనము చేయుదురు అంటున్నాడు.

**20-24వ, 25-29వ. యూదాకు పాపమునుబట్టి శిక్ష:-** యూదా జనులు తిరుగుబాటును ద్రోహమును చేయు మనస్సు గలవారై, తొలగిపోవుచున్నారు. వారు మన దేవుడైన యెహోవాయందు భయభక్తులు కలిగియుందమని తమ మనస్సులో అనుకొనరు. యూదా వారికి మేలు కలుగకుండుటకు వారి దుష్టత్వమే కారణమని చెప్పుచున్నాడు. వారు క్రొవ్వి బలిసియున్నారని, అట్టి వాటిని చూచి తప్పక శిక్షింతునని దేవుడు చెప్పుచున్నాడు.

**30-31వ. ముగింపు:-** ప్రవక్తలు అబద్ధ ప్రవచనములు పలుకుట, యాజకులు వారి పక్షమున ఏలుబడి చేయుట, మొదలగు ఘోరమైన కార్యము దేశములో జరుగుట వలన ప్రజలు దాని ఫలము తప్పక పొందుదురని దేవుడు చెప్పుచున్నాడు.

## 6వ. అధ్యాయము (8+7+6+5+4=30వ)

**అంశము:- పట్టణములో అన్యాయమునుబట్టి శిక్ష**

**1-8వ. చెడుతనమునుబట్టి పట్టణమునకు శిక్ష:-** 1-4వ. బెన్యామీనీయులారా, యెరూషలేము నుండి పారిపోవుడి, సుందరియు సుకుమారియునైన సీయోను కుమార్తెను దేవుడు పెల్లగించుచున్నాను. శత్రుకాపరులగు బబులోనీయులతో ఆమెపై యుద్ధమునకు సిద్ధపరచుకొనుడని చెప్పబడినందున వారు తమ గుడారములను ఆమె చుట్టు వేసి తన మందను మేపుదురన్నాడు. 5-8వ. వారు వచ్చి ఆమె నగరులను నశింపజేయుటకు చెట్లను నరికి యెరూషలేమునకు ఎదురుగా ముట్టడిదిబ్బ కట్టుదురు, ఈ పట్టణము కేవలము అన్యాయమును అనుసరించి నడచునది గనుక శిక్ష నొందవలసి వచ్చెను. గాయములు, దెబ్బలు నిత్యము నాకు కనబడుచున్నవని యెరూషలేమా, నేను నీ యొద్ద నుండి తొలగింపబడకుండునట్లును నేను నిన్ను పాడైన నిర్మానుష్య ప్రదేశముగా చేయకుండునట్లు శిక్షకు లోబడుమని దేవుడు యూదులకు చెప్పుచున్నాడు.

**9-15వ. వాక్యమును తిరస్కరించిన ప్రజలు - వంచకులైన ఘనులు, అల్పులు, ప్రవక్తలు, యాజకులు:-** 9-10వ. యూదావారు వినుటకు తమ మనస్సు సిద్ధపరచుకొనక, వారు వాక్య మందు సంతోషము లేనివారై దాని తృణీకరించిరి. కావున యెహోవా క్రోధముతో నిండి ద్రాక్షచెట్టు ఫలమును ఏరుకొనునట్లు మనుష్యులు ఏమియు మిగులకుండ ఇశ్రాయేలు శేషమును ఏరుకొనుటకు దేవుడు సెలవిచ్చాడు. 11-13వ. అల్పులేమి, ఘనులేమి, ప్రవక్తలేమి యాజకులేమి, భార్యభర్తలు, పసిపిల్లలు, యౌవనులు, అందరు వంచకులు, మోసముచేసి దోచుకొనువారు కనుక దేవుని ఉగ్రత అందరిమీద కుమ్మరింపబడునని, ఏమియు మిగులకుండ వారి యిండ్లు వారి పొలములు వారి భార్యలును ఇతరులకు అప్పగింపబడునట్లు దేవుడు తన చెయ్యి వారి మీద చాపుదునని చెప్పుచున్నాడు. 14-15వ. సమాధానములేని సమయమున సమాధానమని చెప్పుచు, ప్రజలకున్న గాయమును పైపైన మాత్రమే బాగుచేయుచు, వారు తాము హేయక్రియలు చేయుచున్నందున సిగ్గుపడవలసి వచ్చెను గాని వారు ఏమాత్రమును సిగ్గుపడుట లేదు. అవమానము నొందితిమని వారికి తోచనేలేదు గనుక దేవుడు వారిని విమర్శించుకాలమున వారు పడిపోదురని, తొట్రిల్లుదురని యెహోవా చెప్పుచున్నాడు.

**16-21వ. మేలుకలుగు మార్గమందు నడుచుకొనుటకై హెచ్చరిక - నడుచుకొననందున శిక్ష:-** 16-18వ. పురాతన మార్గములను గూర్చి, మేలు కలుగు మార్గమేది అని విచారించి అందులో నడుచుకొనిన, నెమ్మది కలుగునని దేవుడు చెప్పగా వారు మేము అందులో నడుచుకొనమని చెప్పుచున్నారు. 19-21వ. భూలోకమా, వినుము; ఈ జనులు నా మాటలు వినకున్నారు, నా ధర్మశాస్త్రమును విసర్జించుచున్నారు గనుక తమ ఆలోచనలకు ఫలితమైన కీడు నేను వారిమీదికి రప్పించుచున్నానని దేవుడు చెప్పుచున్నాడు.

**22-26వ. శిక్ష యొక్క వివరము:-** ఉత్తర దేశమునుండి యొక క్రూరజనమగు బబులోనీయులు యుద్ధము చేయవలెనని వ్యూహము తీరి, జనులను పాడుచేయుటకు హఠాత్తుగా వచ్చుచున్నాడు. గోనెపట్ట కట్టుకొని బూడిదె చల్లుకొని, ఏక కుమారుని గూర్చి దుఃఖించునట్లు దుఃఖము సలుపి ప్రార్థించుము అని దేవుడు చెప్పుచున్నాడు.

**27-30వ. ముగింపు:-** యిర్మీయాను జనుల మార్గమును తెలిసికొని పరీక్షించు వానిగా దేవుడు నియమించియున్నాడు. వారందరు బహు ద్రోహులు, కొండెగాండ్రు కనుక, యెహోవా వారిని త్రోసివేసెను. త్రోసివేయవలసిన వెండియని వారికి పేరు పెట్టెను.

చెరకు ముందు 20 సం.లోని ఆరు ప్రత్యక్షతలలో రెండవ ప్రత్యక్షత.

రెండవ ప్రత్యక్షత:- 7-10అ. మందిర ద్వారము దగ్గర.

## 7వ. అధ్యాయము (4+4+4+4+4+8+6=34వ)

అంశము:- మార్గములోను, క్రియలలోను తప్పిపోయిన యూదావారు.

**1-16వ. మందిర నాశనమును గూర్చిన వివరము:-** 1-4వ. యిర్మీయా మందిర ద్వారమున నిలువబడి యెహోవాకు నమస్కారముచేయుటకై మందిర ద్వారములలోబడి ప్రవేశించు యూదావారలకు ప్రకటించాడు. ఈ స్థలము యెహోవా ఆలయమని, చెప్పుకొనుచు మోసకరమైన మాటలు ఆధారము చేసికొనక యెహోవా ఈ స్థలమున మిమ్మును నివసింపజేయునట్లు మీ మార్గములను మీ క్రియలను దిద్దుకొనుడని ప్రకటించాడు. 5-8వ. మీ మార్గములను మీ క్రియలను మీరు యథార్థముగా చక్కపరచుకొని, ప్రతివాడు తన పొరుగు వానియెడల తప్పక న్యాయము జరిగించి, పరదేశులను తండ్రిలేని వారిని విధవరాండ్రను బాధింపకయు ఈ చోట నిర్దోష రక్తము చిందింపకయు, మీకు కీడు కలుగజేయు అన్యదేవతలను అనుసరింపకయు అబద్ధపు మాటలను మీరు నమ్ముకొనక నుండిన యెడల ఈ స్థలమున తమకు నిత్యముగా నుండుటకై పూర్వకాలమున నేను మీ పితరులకిచ్చిన దేశమున మిమ్మును కాపురముంచుదునని దేవుడు చెప్పాడు.

9-12వ. జారచోర క్రియలను నరహత్యను చేయుచూ అబద్ధ సాక్ష్యము పలుకుచు బయలుకు ధూపము వేయుచు మీరెరుగని దేవతలను అనుసరించుచున్నారు. అయినను దేవుని నామము పెట్టబడిన మందిరములోనికి వచ్చి దేవుని సన్నిధిని నిలుచుచు విడుదల నొందియున్నామని మీరు చెప్పుచు, దేవుని మందిరము దొంగల గుహగా చేసారని చెప్పుచున్నాడు. 13-16వ. పెందలకడ లేచి దేవుడు మాటలాడినను యూదావారు వినకయు, నుండినవారై యీ క్రియలన్నిటిని చేసినందున ఎఫ్రాయిమును అనగా పది గోత్రముల ఇశ్రాయేలును తన సన్నిధినుండి వెళ్లగొట్టినట్లు యూదాను కూడ వెల్లగొట్టుదునని చెప్పుచున్నాడు. దేవుడు షిలోహునకు చేసినట్లు యీ మందిరమునకును, స్థలమునకును నాశనము కలుగ చేయుదునని చెప్పాడు. కాబట్టి ఈ జనము కొరకు ప్రార్థన చేయకుము అని యిర్మీయాకు చెప్పాడు.

**17-20వ. పట్టణములో పాపము:-** యూదా పట్టణములలోను యెరూషలేము వీధులలో వారు దేవునికి కోపము పుట్టించునట్లు ఆకాశరాణి దేవతకు పిండివంటలు చేయవలెనని, అన్యదేవతలకు పానార్పణములు పోయవలెనని, పిల్లలు కట్టెలు ఏరుచున్నారు. తండ్రులు అగ్ని రాజబెట్టుచున్నారు, స్త్రీలు పిండి పిసుకుచున్నారు. అందువలన ప్రభువగు యెహోవా

ఈ స్థలము మీద, నరులమీద, జంతువులమీద, పొలముల చెట్లమీద భూమి పంట మీదను దేవుడు తన కోపమును ఉగ్రతను కుమ్మరించెదనని చెప్పుచున్నాడు.

**21-28వ. ప్రారంభము నుండి అవిధేయత:-** 21-24వ. ఐగుప్తు దేశములోనుండి మీ పితరులను రప్పించిన దినమున దహనబలులను గూర్చి గాని బలులను గూర్చి గాని నేను వారితో చెప్పలేదు కాని దేవుని మాటలు వారు అంగీకరించిన యెడల యెహోవా వారికి దేవుడనైయుందునని చెప్పాడు. అయితే వారు వినకపోయిరి, చెవియొగ్గకుండిరి, ముందుకు సాగక వెనుక దీయుచు తమ ఆలోచనలనుబట్టి తమ దుష్ట హృదయ కాఠిన్యమిననుసరించి నడుచుచు వచ్చిరి.

25-28వ. దేవుడు అనుదినము పెందలకడ లేచి ప్రవక్తలైన సేవకులనందరిని యూదా వారి యొద్దకు పంపుచు వచ్చినను, వారు దేవుని మాట వినక మనస్సును కఠిన పరచుకొని, తమ పితరులకంటె మరి దుష్టులైరి. వీరు తమ దేవుడైన యెహోవా మాట వినక తొలగిపోయి యున్నారని చెప్పుచున్నాడు.

**29-34వ. తీర్పు యొక్క వివరము:-** 29-31వ. దేవుని నామము పెట్టబడిన మందిరము అపవిత్రపడునట్లు వారు దానిలో హేయ వస్తువులను ఉంచియున్నారు. దేవుడు ఆజ్ఞాపించని క్రియను ఆయనకు తోచని క్రియను వారు చేసియున్నారు, అగ్నిలో తమ కుమారులను తమ కుమార్తెలను దహించుటకు బెన్‌హిన్నోము లోయలోనున్న తోఫెతు నందు బలిపీఠములను కట్టుకొనియున్నారు. తనకు కోపము తెప్పించు తరమువారిని యెహోవా విసర్జించి వెళ్లగొట్టుచున్నాడు; 32-34వ. కాలము సమీపించుచున్నది; అందరు వధించబడగా పాతిపెట్టుటకు స్థలము లేకపోవువరకు తోఫెతులో శవములు పాతిపెట్టబడి శవములు ఆకాశపక్షులకును భూజంతువులకును ఆహారమగును. ఉల్లాస ధ్వనియు ఆనంద ధ్వనియు పెండ్లి కుమారుని స్వరమును పెండ్లి కుమార్తె స్వరమును యూదా పట్టణములలోను యెరూషలేము వీధులలోను లేకుండ చేసెదను; ఈ దేశము తప్పక పాడైపోవును అని దేవుడు చెప్పుచున్నాడు. ప్రవచన సమీప నెరవేర్పుగా 70 ఏండ్ల చెరకాలమందు సంపూర్ణ నెరవేర్పుగా అంత్యకాలమందు జరుగును.

## 8వ. అధ్యాయము (3+3+3+3+3+2+5=22వ)

**అంశము:- పాపము చేసి పశ్చాత్తాపపడనందున శిక్ష.**

**1-3వ. అధిపతులు - ప్రజలు పాపము చేయుట:-** ఆ కాలమున శత్రువులు యూదా రాజుల యెరూషలేము నివాసుల యొక్కయు యెముకలను సమాధులలోనుండి వెలుపలికి

తీసి వారు ప్రేమించుచు పూజించుచు విచారణ చేయుచు నమస్కరించుచువచ్చిన ఆ సూర్య చంద్ర నక్షత్రముల యెదుట వాటిని పరచగా అవి కూర్చబడక పాతిపెట్టబడక భూమి మీద పెంటవలె పడియుండును. అప్పుడు చెడ్డ వంశములో శేషించిన వారందరు జీవమును ప్రతిగా మరణమును కోరుదురని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**4-6వ. పశ్చాత్తాపపడనివారు:-** మనుష్యులు పడి తిరిగి లేవకుందురా? తొలగిపోయిన తరువాత మనుష్యులు తిరిగిరారా? యెరూషలేము ప్రజలు విశ్వాసఘాతకులై నిత్యము ద్రోహము చేయుచు, మోసమును ఆశ్రయము చేసికొని తిరిగి రామని యేల చెప్పుచున్నారని దేవుడు చింతించుచున్నాడు. తమ చెడుతనము గూర్చి ఒక్కడైన పశ్చాత్తాపపడక ప్రతివాడును తనకిష్టమైన మార్గమును తిరుగుచున్నాడని చెప్పుచున్నాడు.

**7-9వ. తిరిగి రాని యెరూషలేము ప్రజలు:-** ఆకాశముల కెగురు సంకుబుడి కొంగయైనను, తెల్లగువ్వయు, మంగలకత్తిపిట్టయు, ఓదెకొరుకును తాము తిరిగి రావలసిన కాలమును ఎరుగును. అయితే యూదా ప్రజలు యెహోవా వాక్యమును నిరాకరించి దేవునికి దూరమై తిరిగి వచ్చుట లేదు. వారికి ఏపాటి జ్ఞానము లేదని దేవుడు చెప్పుచున్నాడు.

**10-12వ. పాపమునుబట్టి శిక్షగా పడిపోవుట, తొట్రిల్లుట:-** యూదావారి పాపమునుబట్టి వారి భార్యలు అన్యుల కప్పగించబడి, వారిని జయించువారికి వారి పొలములను అప్పగింతునని దేవుడు చెప్పుచున్నాడు. తాము హేయమైన క్రియలు చేయుచున్నందున సిగ్గుపడవలసి వచ్చెను గాని వారు సిగ్గుపడనందున దేవుడు వారిని విమర్శించు కాలమున వారు తొట్రిల్లుదురని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**13-15వ. పాపమునుబట్టి శిక్షగా చెట్ల ఆకులు పండ్లు రాలినట్లు రాలిపోవుట - దేవుడే నాశనము చేయుట - క్షేమము లేకపోవుట:-** ద్రాక్ష చెట్టున ఫలములు లేనట్లును, అంజూరపు చెట్టున అంజూరపు పండ్లు లేనట్లును, ఆకులు వాడిపోవునట్లును దేవుడు యూదా వారిని బొత్తిగా కొట్టివేయుదునని పాపము చేసినందున యెహోవాయే వారిని నాశనము చేయుచున్నాడు అని వారు చెప్పుకొందురు. సమాధానము కొరకు, క్షేమము కొరకు వారు కనిపెట్టుచున్నను భీతియే కలుగుచున్నది అని వారు చెప్పుకొనుచున్నారు.

**16-17వ. పాపమునుబట్టి శిక్షగా దేశము అందులోనున్న సమస్తము నాశనమగుట - పట్టణము, అందులో నివసించువారు నాశనమగుట:-** దాను నుండి అనగా ఉత్తర దిక్కు నుండి బబులోను రాజువచ్చునని వారు వచ్చి యూదా దేశమును అందులో నున్న పట్టణమును, అందులో నివసించువారిని నాశనము చేయునని చెప్పుచున్నాడు. దేవుడు మిడునాగులవంటి గుణముగల బబులోను రాజులను పంపుచున్నానని చెప్పుచున్నాడు.

18-22వ. ప్రవక్త విలాపము:- కోత కాలము గతించియున్నది, గ్రీష్మకాలము జరిగిపోయెను, మనము రక్షణనొందకయే యున్నాము అని చెప్పుదురు. జనుల వేదననుబట్టి ప్రవక్త ఘోరభయము కలిగి, గుండె తన లోపల సొమ్మసిల్లుచున్నదని చెప్పుచున్నాడు. ప్రజలును యెహోవా సీయోనులో లేకపోయెనా? ఆమె రాజు ఆమెలో లేకపోయెనా? అని బహు దూరదేశమునుండి చెప్పుచున్నారు. గిలాదులో గుగ్గిలము (మందు) ఏమియు లేక, అక్కడ ఏ వైద్యుడును లేక జనులు పాపమునుబట్టి స్వస్థతలేక ఉన్నారని చెప్పుచున్నాడు.

## 9వ. అధ్యాయము (9+7+6+6=26వ)

అంశము:- పాపమును బట్టి కలుగు శిక్షకైన ప్రలాపము.

**1-9వ. నాలుకతో మోసము చేయుచు మార్గము తప్పుచున్నందున విలాపము (ఆరాధనలో లోపము):-** 1-3వ. జనులందరు వ్యభిచారులును ద్రోహుల సమూహముపై కీడువెంట కీడు చేయుచు ప్రవర్తించుచున్నారు కనుక ప్రవక్త దివారాత్రములు కన్నీరు విడుచుచూ తల జలమయముగా ఉండును గాక అంటున్నాడు. 4-6వ. ప్రతివాడును తన పొరుగు వాని విషయమై జాగ్రత్తగా నుండవలెనని; ఏ సహోదరునినైనను నమ్మకుడని చెప్పుచున్నాడు. నిజముగా ప్రతి సహోదరుడును తంత్రగొట్టయి తన సహోదరుని కొంపముంచునని, ప్రతి పొరుగువాడును కొండెములు చెప్పుటకై తిరుగులాడుచున్నాడని చెప్పుచున్నాడు. 5-9వ. సత్యము పలుకక ప్రతివాడును తన పొరుగువానిని వంచించుచు, అబద్ధములాడుట తన నాలుకలకు అభ్యాసము చేసియున్నారు, ఎదుటి వాని తప్పులు పట్టవలెనని ప్రయాసపడుదురు. ఈ సంగతులను తెలిసికొని వారిని శిక్షించి, ప్రతిదండన చేయుదునన్నాడు.

**10-16వ. స్వదేశములో బబులోను దేవతలను కొలిచినందున తీర్పునుబట్టి విలాపము:-** 10-12వ. పర్వతములు అరణ్యములోని మేతస్థలములుపాడై, సంచారము చేయువాడెవడు లేక, పశువుల అరుపులు వినబడకపోవుటనుబట్టి ప్రవక్త విలాపము చేయుదునన్నాడు; యెరూషలేమును పాడు దిబ్బలుగాను, యూదా పట్టణములను నివాసిలేని పాడు స్థలముగాను, ఆ దేశము ఎడారివలె ఎందుకు కాలిపోయి పాడాయెనని దేవుడు అడుగుచున్నాడు. 13-16వ. ప్రజలు దేవుని మాట వినక తమ హృదయ మూర్ఖతచొప్పున తమ పితరులు నేర్పినట్లు బయలు దేవతలను అనుసరించుచున్నారు గనుకనే వారి దేశము పాడైపోయెనని తామైనను తమ పితరులైనను ఎరుగని జనములలోనికి వారిని చెదరగొట్టి, వారిని నిర్మూలము చేయువరకు వారి వెంబడి ఖడ్గమును పంపుదునని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**17-22వ. సమస్త నాశనమును బట్టి స్త్రీల పిల్లల రోదనము:-** 17-19వ. రోదనము చేయు స్త్రీలును, తెలివిగల స్త్రీలును కన్నీళ్లు విడుచుచు రోదనధ్వని చేయవలెను అన్నాడు. 20-22వ. చేలమీద పెంట పడునట్లు మనుష్యుల శవములు పడును, వాటిని కూర్చువాడెవడును లేకపోవును అన్నాడు. కనుక స్త్రీలారా, కుమార్తెలకు రోదనము చేయనేర్పుడి, ఒకరికొరకు అంగలార్పు విద్య నేర్పుడి అని దేవుడు చెప్పాడు.

**23-26వ. విమోచన అందరికి - శిక్షయు అందరికి అను జవాబు:-** 23-24వ. జ్ఞాని తన జ్ఞానమునుబట్టికాక, శూరుడు తన శౌర్యమును బట్టికాక, ఐశ్వర్యవంతుడు తన ఐశ్వర్యమును బట్టికాక, భూమిమీద కృపచూపుచు నీతి న్యాయములు జరిగించుచు నున్న యెహోవాను పరిశీలనగా తెలిసికొనుటనుబట్టియే అతిశయింపవలెను అన్నాడు. అట్టివాటిలోనే యెహోవా ఆనందించువాడు. 25-26వ. అన్యజనులందరును సున్నతి పొందినవారు కారు, ఇశ్రాయేలీయులందరు హృదయసంబంధమైన సున్నతి నొందినవారు కారు గనుక, రాబోవు దినములలో యూదావారిని, అన్యులగు ఐగుప్తీయులు మొదలగు వారినందరిని శిక్షించెదను అని దేవుడు సెలవిచ్చాడు.

## 10వ. అధ్యాయము (5+5+6+6+3=25వ)

**అంశము:- విగ్రహ ఆరాధననుబట్టి కలుగు శిక్ష, దాని వివరము.**

**1-5వ. జీవములేని విగ్రహాలు:-** ఇశ్రాయేలు వంశస్థులు అన్యజనముల ఆచారముల నభ్యసించి, వెండి బంగారములచేత పనివారు బిగించి అలంకరించిన విగ్రహములు పలుకవు నడువనేరవు గనుక వాటిని మోయవలసివచ్చెను; వాటికి భయపడకుడని, అవి హానిచేయనేరవు, మేలు చేయుట వాటివలన కాదని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**6-10వ. జీవముగల మహాత్మ్యము గల దేవుడు:-** యెహోవాను, పోలినవాడెవడును లేడు, ఆయన మహాత్మ్యము గలవాడు, శౌర్యమునుబట్టి ఆయన నామము ఘనమైనదాయెను. జ్ఞానులందరిలోను వారి రాజ్యములన్నిటిలోను ఆయన వంటివాడెవడును లేడు. 8-10వ. జనులు కేవలము పశుప్రాయులు, బొమ్మల పూజవలన వారికి వచ్చు జ్ఞానము వ్యర్థము. పనివాడు వెండి బంగారమును రేకులుగా సాగగొట్టబడి పోతపోయును. యెహోవాయే నిజమైన దేవుడు, ఆయన జీవముగల దేవుడు, సదాకాలము ఆయనే రాజు, ఆయన ఉగ్రతకు భూమి కంపించును, జనములు ఆయన కోపమును సహింపలేవు.

**11-16వ. సృష్టికర్తయగు దేవుడు - సృజింపలేని విగ్రహాలు:-** యెహోవా తన బలముచేత భూమిని సృష్టించెను, తన జ్ఞానముచేత ప్రపంచమును స్థాపించెను, తన ప్రజ్ఞచేత ఆకాశమును విశాలపరచెను. ఆయన ఆజ్ఞ నియ్యగా జలరాశులు ఆకాశమండలములో పుట్టును,

భూమ్యంత భాగములలో నుండి ఆయన ఆవిరి ఎక్కజేయును, వర్షము కలుగునట్లుగా ఆయన మెరుపులు పుట్టించును, తన ధనాగారములలో నుండి గాలిని రావించును. ఆకాశమును, భూమిని సృష్టింపని యీ దేవతలు భూమి మీద నుండకుండను ఆకాశము క్రింద ఉండకుండను నశించును. 14-16వ. తెలివిలేని ప్రతి మనుష్యుడు పశుప్రాయుడు, పోతపోయు ప్రతివాడును పోతపోసినది మాయారూపము, అందులో ప్రాణమేమియు లేదు. విమర్శ కాలములో అవి నశించిపోవును, యాకోబునకు స్వాస్థ్యమగువాడు సమస్తమును నిర్మించువాడు, సైన్యములకధిపతియగు యెహోవాయని ఆయనకు పేరు.

**17-22వ. తీర్పు యొక్క వివరము:-** 17-19వ. యెహోవా ఈ దేశమును ముట్టడి వేయించి దాని నివాసులను విసరివేయుచున్నాడు, కనుక దేశము విడిచి వెళ్లుటకై సామాగ్రిని కూర్చుకొనుము అని చెప్పుచున్నాడు. 20-22వ. కాపరులు పశుప్రాయులై యెహోవా యొద్ద విచారణ చేయరు గనుక వారే వర్ధిల్లకయున్నారు, వారి మందలన్నియు చెదరిపోవుచున్నవి. యూదా పట్టణములను పాడైన స్థలముగా చేయుటకును, నక్కలను చోటుగా చేయుటకు ఉత్తరదేశమునుండి గొప్ప అల్లరి ధ్వని వినబడుచున్నది.

**23-25వ. యిర్మీయా యొక్క ప్రార్థన:-** యెహోవా, తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును. కనుక నీ నామమునుబట్టి ప్రార్థింపని వారి మీద నీ ఉగ్రతను కుమ్మరించుము అని యిర్మీయా ప్రార్థించాడు.

**చెరకు ముందు 20సం.లోని ఆరు ప్రత్యక్షతలలో మూడవ ప్రత్యక్షత.**

**మూడవ ప్రత్యక్షత 11-13అ. నిబంధన భంగము - యూదా పట్టణము, యెరూషలేము వీధులలో ప్రకటన - సూచన - నడికట్టు.**

# 11వ. అధ్యాయము (5+3+3+3+3+3+3=23వ)

**అంశము:- నిబంధనను భంగపరచిన యూదా ప్రజలు**

**1-5వ. నిబంధన వాక్యములను విననొల్లనివాడు శాపగ్రస్తుడు:-** యూదా మనుష్యులకు, యెరూషలేము నివాసులకు, యెహోవావాక్కు ప్రత్యక్షమై ఈ నిబంధన వాక్యములను వినవలెననియు విననొల్లనివాడు శాపగ్రస్తుడగుననియు చెప్పాడు. ఐగుప్తు దేశములో నుండి మీ పితరులను రప్పించి, పాలు తేనెలు ప్రవహించు దేశమును మీ పితరులకిచ్చి, నేను మీ కాజ్ఞాపించు విధులన్నిటినిబట్టి యీ నిబంధన వాక్యము అనుసరించిన యెడల మీరు నాకు జనులైయుందురు నేను మీకు దేవుడనైయుందునని యెహోవా చెప్పాడు. అందుకు యెహోవా, ఆ ప్రకారము జరుగును గాక అని యిర్మీయా అన్నాడు.

**6-8 నిబంధనను అనుసరించి నడువని యూదావారు:-** యూదా పట్టణములోను యెరూషలేము వీధులలోను నేటివరకు ఖండితముగా దేవుని మాట వినుడని పెందలకడ లేచి చెప్పినను యూదా వారు తమ దుష్టహృదయములో పుట్టు మూర్ఖత చొప్పున నడుచుచు దేవుని మాట వినకపోయిరి, వారు అనుసరింపవలెనని దేవుడు వారి కాజ్ఞాపించిన నిబంధన మాటలన్నిటిననుసరించి నడువలేదు గనుకనే ఆ నిబంధనలోని వాటినన్నిటిని దేవుడు వారి మీదికి రప్పించుచున్నాడు.

**9-11వ. నిబంధనను భంగము చేసిన యూదా, ఇశ్రాయేలు ప్రజలు:-** యూదావారు యెరూషలేము నివాసులు కుట్రతో దేవుని మాటలు వినక తమ పితరుల దోషచర్యలను జరుప తిరిగియున్నారు; వారు అన్యదేవతలను పూజించుటకై వాటిని అనుసరించుచు, దేవుడు చేసిన నిబంధనను ఇశ్రాయేలు వంశస్థులును యూదా వంశస్థులు భంగము చేసియున్నారు. కాబట్టి తాము తప్పించుకొనజాలని కీడును యెహోవా వారి మీదికి రప్పించి వారు మొఱ్ఱపెట్టినను వారి మొఱ్ఱను వినకుందునని యెహోవా చెప్పుచున్నాడు.

**12-14వ. దేవుడు ప్రవక్తను ప్రార్థించవద్దనుట:-** యూదా పట్టణస్థులును యెరూషలేము నివాసులును పోయి తాము ధూపార్పణము చేయు దేవతలకు మొఱ్ఱపెట్టెదరు గాని వారి ఆపత్కాలములో అవి వారిని ఏమాత్రమును రక్షింపజాలవు. యూదాలో ఎన్ని పట్టణములున్నవో లెక్కచొప్పున అన్ని దేవతలున్నవి. మన రాష్ట్రములోను ముందు కాలములో ముక్కోటి ఆంధ్రులకు ముక్కోటి దేవతలు ఉండెను. యెరూషలేము నివాసులారా, బయలు దేవతకు ధూపము వేయవలెనని దాని పేరట బలిపీఠములను స్థాపించిరి. కావున ఇట్టి ప్రజల నిమిత్తము ప్రార్థన చేయకుము; మొఱ్ఱపెట్టకుము యిర్మీయాకు చెప్పాడు. ప్రజలు మొఱ్ఱ పెట్టునప్పుడు నేను వినను అనియు దేవుడు అన్నాడు.

**15-17వ. కీడు చేయ నిర్ణయించుకొనిన యెహోవా:-** అది చక్కని ఫలముగల పచ్చని ఒలీవ చెట్టని యెహోవా పేరు పెట్టినను వారు దుర్వ్యాపారము చేసి మందిరమును నిర్లక్ష్యపెట్టినందున యెహోవా యూదా మీద మంటపెట్టగా దాని కొమ్మలు విరిగిపోవుచున్నవి. అనగా ఇశ్రాయేలు వంశస్థులు యూదా వంశస్థులు బయలునకు ధూపార్పణము చేసి దేవునికి కోపము పుట్టించుటచేత తమంతట తామే చేసిన చెడుతనమునుబట్టి యెహోవా వారికి కీడు చేయ నిర్ణయించుకొనియున్నాడు.

**18-20వ. యిర్మీయాకు హాని తలపెట్టిన ప్రజలు:-** చెట్టును దాని ఫలమును నశింప జేయునట్లు, యిర్మీయా పేరు జ్ఞాపకము చేయబడకపోవునట్లు బ్రదుకు వారిలో నుండకుండ వాని నిర్మూలము చేయుదము రండని వారు దురాలోచన చేయగా యెహోవా వారి క్రియలను యిర్మీయాకు కనుపరచెను. అయితే యిర్మీయా వధకు తేబడుచుండు సాధువైన గొఱ్ఱపిల్లవలె ఉండి తన వ్యాజ్యెభారమును యెహోవా మీదనే వేసి వారికి దేవుడు చేయు ప్రతిదండనను చూడాలని ఆశించాడు.

**21-23వ. యిర్మీయాకు హాని తలపెట్టిన కీడునుబట్టి దేవుడు వారిని శిక్షించుట:-** కావున నీవు మాచేత చావకుండునట్లు యెహోవా నామమున ప్రవచింపకూడదని చెప్పు అనాతోతు వారిని దేవుడు శిక్షించి, కీడును వారి మీదికి రప్పించి, వారి యౌవనులను ఖడ్గముచేత చంపగా, వారికి శేషమేమియు లేకపోవును అని దేవుడు అన్నాడు.

## 12వ. అధ్యాయము (6+7+4=17వ)

అంశము:- యూదావారును విసర్జించబడుట

**1-6వ. దుష్టులను గూర్చి యెహోవాతో యిర్మీయా మాటలాడుట :-** 1-2వ. దుష్టులు తమ మార్గములలో వర్ధిల్లనేల? మహా విశ్వాసఘాతకులు సుఖింపనేల? నీవు వారిని నాటుచున్నావు, వారు వేరు తన్నుచున్నారు, వారు ఎదిగి ఫలముల నిచ్చుచున్నారు; వారికి నీవు సమీపముగా ఉన్నావు గాని వారి అంతరింద్రియములకు దూరముగా ఉన్నావు అని దుష్టులైన లోకస్తులను గూర్చి యిర్మీయా చెప్పుచున్నాడు. 3-6వ. యెహోవా, నా హృదయము నీపట్ల ఎట్లున్నది నీవు శోధించుచున్నావు; వధకు ఏర్పడిన గొఱ్ఱలనువలె వారిని హతము చేయుము, వధ దినమునకు వారిని ప్రతిష్ఠించుము. వారి చెడుతనము వలన జంతువులును పక్షులును సమసిపోవుచున్నవి. భూమి ఎండి పోవుచున్నది. వారు నీతో దయగా మాటలాడుచున్నను నీవు వారిని నమ్మకూడదు.

**7-13వ. దేవుడు తన ద్రాక్షాతోటను శత్రువులతో నాశనము చేయించుట:-** 7-11వ. దేవుడు తన మందిరమును తన స్వాస్థ్యమును విసర్జించియున్నాడు; తన ప్రాణప్రియురాలికి విరోధియై ఆమె శత్రువులచేతికి అప్పగించగా శత్రువులైన కాపరులనేకులు ద్రాక్షతోటలగు ఇశ్రాయేలీయులను, యూదా వారిని చెరిపివేసి యున్నారు, ఆయనకిష్టమైన పొలమగు యూదాను పాడుగా, ఎడారిగా చేసియున్నారు. దానిగూర్చి చింతించువాడొకడును లేడు గనుక యూదా దేశమంతయు పాడాయెనని దేవుడు చెప్పుచున్నాడు. 12-13వ. పాడు చేయువారు అరణ్యమందలి చెట్లులేని మెట్టలన్నిటిమీదికి వచ్చుచున్నారు దేశము యొక్క యీకొన నుండి ఆ కొన వరకు యెహోవా ఖడ్గము తిరుగుచు హతము చేయు చున్నందున శరీరులకు క్షేమమేమియు లేదు. జనులు గోధుమలు చల్లి ముండ్లపంట కోయుదరు; యెహోవా కోపాగ్నివలన కోతకు పంటలేక వారు సిగ్గుపడుదురు.

**14-17వ. శత్రువులను గూర్చి దేవుని సెలవు:-** 14-15వ. ఇశ్రాయేలుకు స్వాధీనపరచిన స్వాస్థ్యము నాక్రమించుకొను దుష్టులగు పొరుగు వారిని గూర్చి వారి దేశములో నుండి స్వాస్థ్యము నాక్రమించుకొను దుష్టులగు పొరుగు వారిని గూర్చి వారి దేశములో నుండి వారిని పెల్లగింతునని యెహోవా సెలవిచ్చుచున్నాడు. వారి మధ్యనుండి యూదావారిని పెల్లగింతునని, పెల్లగించిన తరువాత మరల యూదా వారియెడల జాలిపడుదునని ఒక్కొక్కని

**15-19వ. మాట వినని యూదా వారి కొరకైన దుఃఖము:-** 15-16వ. ఆయన చీకటి కమ్మజేయక మునుపే, గాఢాంధకారముగా చేయకమునుపే, (అనగా శిక్షించకమునుపు) మీ దేవుడైన యెహోవా మహిమ గలవాడని ఆయనను కొనియాడుడని, గర్వపడక ఆయనను చెవి యొగ్గవలెనని యెహోవా ఆజ్ఞ ఇచ్చాడు.

17-19వ. దక్షిణదేశ పట్టణములు మూయబడియున్నవి; వాటిని తెరువగలవాడెవడును లేడు; యూదా వారందరు చెరపట్టబడి, సమస్తము కొనిపోబడెను. అయినను వారు దేవుని మాట విననందున, వారి గర్వమునుబట్టి దేవుడు చాటున ఏడ్చుదును అన్నాడు. యెహోవా మంద చెరపట్టబడినందున యిర్మీయా నేత్రము బహుగా వలపోయుచు కన్నీరు విడుచుచున్నది.

**20-23వ. మార్పునొందక తన సౌందర్యమును కోల్పోయిన యూదా:-** 20-21వ. కన్నులెత్తి ఉత్తరమునుండి వచ్చుచున్న బబులోనీయులను చూడుడి; దేవుని మంద సౌందర్యమును కోల్పోయినది. స్నేహితులుగా చేసికొనిన బబులోనువారిని ఆయన యూదా మీద అధిపతులుగా నియమించునని చెప్పాడు. 22-23వ. ఇవి విస్తారమైన దోషములనుబట్టియే సంభవించెనని యూదా గుర్తించాలన్నాడు. కూషు దేశస్థుడు తన చర్మమును మార్చుకొనలేనట్లు, చిరుతపులి తన మచ్చలను మార్చుకొనలేనట్లు, కీడుచేయుటకు అలవాటు పడిన యూదా మార్చుకొనలేదని కనుక యూదాకు మేలు చేయవల్లపడదని దేవుడు చెప్పాడు.

**24-27వ. రానున్న శ్రమలు:-** 24-25వ. యూదావారు అబద్ధమును నమ్ముకొనుచు దేవుని మరచినందున అడవిగాలికి పొట్టు ఎగురునట్లు వారిని చెదరగొట్టెదనని యెహోవా సెలవిచ్చుచున్నాడు. 26-27వ. యూదావారి వ్యభిచారము, జారకార్యములు, కామాతురతను, హేయక్రియలను ఎరిగిన దేవుడు యెరూషలేమా, నీకు శ్రమ, నిన్ను నీవు పవిత్రపరచుకొననొల్లవు ఇక నెంత కాలము ఈలాగు జరుగునని ప్రశ్నించుచున్నాడు.

### 14-15అ. చెరకు ముందు 20సం.లోని ఆరు ప్రత్యక్షతలలో నాల్గవ ప్రత్యక్షత.

## 14వ. అధ్యాయము (3+3+3+3+3+3+4=22వ)

**అంశము:- తమ ఇష్ట ప్రకారము తిరుగుటను బట్టి రానున్న శిక్ష**

**1-3వ. నీటికొరకైన కరువు:-** కరువు కాలమున యూదా దుఃఖించుచున్నది, దాని గుమ్మములు అంగలార్చుచున్నవి. వారిలో ప్రధానులు బీదవారిని నీళ్లకు పంపుచున్నారు. వారు చెరువుల యొద్దకు రాగా నీళ్లు దొరుకుటలేదు, వట్టి కుండలు తీసికొని వారు మరల వచ్చుచున్నారు, సిగ్గును అవమానము నొందినవారై తమ తలలు కప్పుకొనుచున్నారు. జనులు విచారగ్రస్తులై నేలకు వంగుదురు, యెరూషలేము చేయు అంగలార్పు పైకెక్కుచున్నది.

**4-6వ. ఆహారము లేని కరువు:-** దేశములో వర్షము కురువక పోయినందున నేల చీలియున్నది గనుక సేద్యము చేయువారు సిగ్గుపడి తలలు కప్పుకొనుచున్నారు. లేళ్లు పొలములో ఈని గడ్డిలేనందున పిల్లలను విడిచిపెట్టుచున్నవి. అడవి గాడిదలును చెట్లులేని మెట్టలమీద నిలువబడి నక్కలవలె గాలి పీల్చుచున్నవి, మేత ఏమియు లేనందున వాటి కన్నులు క్షీణించుచున్నవి.

**7-9వ. యూదా ప్రజల ప్రార్థన:-** యెహోవా, మా తిరుగుబాటులు అనేకములు, నీకు విరోధముగా పాపము చేసితిమి; మా దోషములు మా మీద దోషారోపణ చేయుచున్నవి; నీ నామమునుబట్టి నీవే కార్యము జరిగించుము. ఇశ్రాయేలునకు ఆశ్రయుడా, కష్టకాలమున వారికి రక్షకుడా, యెహోవా, నీవు మా మధ్య నున్నావే; మేము నీ పేరుపెట్టబడిన వారము; మమ్మును చెయ్యి విడువకుము అని ప్రార్థించిరి.

**10-12వ. ప్రజల ప్రార్థనకు జవాబు:-** యెహోవా ఈ జనులు తమ కాళ్లకు అడ్డము లేకుండ తిరుగులాడుటకు ఇచ్ఛగలవారు గనుక వారిని అంగీకరింపక, వారి పాపములనుబట్టి వారిని శిక్షించుదునని మేలు కలుగునట్లు ఈ ప్రజల నిమిత్తము ప్రార్థన చేయకుమని యిర్మీయాకు చెప్పాడు. వారు ఉపవాసమున్నను వారి మొఱ్ఱ విననని వారిని ఖడ్గము వలనను క్షామము వలనను తెగులు వలనను నాశనము చేసెదనని దేవుడు చెప్పుచున్నాడు.

**13-15వ. అబద్ధ ప్రవక్తలను గూర్చిన ప్రార్థన:-** అందుకు యెహోవాతో యిర్మీయా అయ్యో, మీరు ఖడ్గము చూడరు మీకు క్షామము కలుగదు, ఈ చోటను నేను స్థిరమైన సమాధానము మీకిచ్చెదనని వారి ప్రవక్తలు వారితో అబద్ధములు చెప్పుచున్నారని అన్నాడు. అందుకు యెహోవా ప్రవక్తలు అబద్ధములు ప్రకటించుచున్నారు; నేను వారిని పంపలేదు, వారితో మాటలాడలేదు, వారు తమ హృదయమున పుట్టిన వంచనను ప్రకటన చేయుచున్నారు. కావున ఆ ప్రవక్తలు లయమగుదురని దేవుడు సెలవిచ్చాడు.

**16-18వ. దేవుని జవాబు:-** యెహోవా ఆ జనులు క్షామమునకును ఖడ్గమునకును పాలై యెరూషలేము వీధులలో పడవేయబడెదరు; నేను వారి చెడుతనమును వారిమీదికి రప్పించెదను. వారినైనను వారి భార్యలనైనను వారి కుమారులనైనను వారి కుమార్తెలనైనను పాతిపెట్టువాడెవడును లేకపోవును. నీవు వారితో చెప్పవలసిన మాట ఏదనగా నా జనుల కన్యక గొప్ప ఉపద్రవమువలన పీడింపబడుచున్నది, ఘోరమైన గాయము నొందియున్నది; దివారాత్రము మానక నా కన్నుల నుండి కన్నీరు కారుచున్నది. పొలము ఖడ్గముచేత హతులైనవారు పట్టణములో క్షామపీడితులు నుందురు; ప్రవక్తలేమి యాజకులేమి తామెరుగని దేశమునకు పోవలెనని ప్రయాణమై యున్నారు.

**19-22వ. ప్రజల ప్రార్థన:-** యెహోవా, నీవు యూదాను బొత్తిగా విసర్జించితివా? సీయోను నీకు అసహ్యమాయెనా? మేము సమాధానము కొరకు కనిపెట్టుచున్నాము గాని మేలేదియు

కనబడుటలేదు; చికిత్స కలుగు కాలము కొరకు కనిపెట్టుచున్నాము గాని భీతి తగిలియున్నది. మా దుర్మార్గతను మా పితరుల దోషమును మేము ఒప్పుకొనుచున్నాము; నీకు విరోధముగా పాపము చేసియున్నాము. నీ నామమునుబట్టి మమ్మును త్రోసి వేయకుము, ప్రశస్తమైన నీ సింహాసనమును అవమానపరచకుము, మాతో నీవు చేసిన నిబంధనను జ్ఞాపకము చేసికొనుము, నీకొరకే మేము కనిపెట్టుచున్నామని ప్రార్థించిరి.

## 15వ. అధ్యాయము (5+4+5+4+3=21వ)

అంశము:- తప్పని తీర్పు

**1-5వ. యెరూషలేము పై రానున్న శిక్షలు:-** 1-3వ. ప్రవక్తలగు మోషేయు సమూయేలును ప్రార్థనా వీరులు. అట్టివారు ప్రార్థించుటకు నా యెదుట నిలువబడినను ఈ ప్రజలను అంగీకరించుటకు నాకు మనస్సుండదు కనుక నా సన్నిధి నుండకుండ వారిని వెళ్లగొట్టుము అని యెహూవా అన్నాడు. మేమెక్కడికి పోదుమని వారు నిన్నడిగినయెడల చావునకు నియమింప బడినవారు చావునకును, ఖడ్గమునకు నియమింపబడినవారు ఖడ్గమునకును, క్షామమునకు నియమింపబడినవారు క్షామమునకును, చెరకు నియమింపబడినవారు చెరకును పోవలెనని చెప్పుమన్నాడు. యెహూవా యూదావారి పాపమునుబట్టి చంపుటకు ఖడ్గము, చీల్చుటకు కుక్కలు, తినివేయుటకు, నాశనము చేయుటకు ఆకాశపక్షులు భూమృగములు అను ఈ నాలుగు విధముల బాధలు వారికి నియమించియున్నాను అన్నాడు. 4-5వ. రాజైన మనష్షే యెరూషలేములో చేసిన క్రియలనుబట్టి భూమి మీద నున్న సకల రాజ్యములలోనికి యిటు అటు చెదరగొట్టబడునట్లు వారిని అప్పగించుచున్నాను. యెరూషలేమా! నిన్ను కరుణించి, నీయందు జాలిపడువాడెవడును లేడన్నాడు.

**6-9వ. శిక్షకు కారణములు:-** 6-7వ. యూదా వారు యెహూవాను విసర్జించి వెనుకతీసి యున్నారు గనుక నశింపజేయునట్లు వారి మీదికి యెహూవా చేతిని చాచియున్నాడు; నా జనులు తమ మార్గములను విడిచి నాయొద్దకు రారు గనుక వారిని సంతానహీనులుగా చేయుచున్నాను, నశింపజేయుచున్నాను అని యెహూవా అన్నాడు. 8-9వ. వారి విధవరాండ్రు సముద్రపు ఇసుకకంటె విస్తారముగా ఉందురు; ఏడుగురిని కనిన స్త్రీ క్షీణించుచున్నది; ఆమె ప్రాణము విడిచి యున్నది; వారిలో శేషించిన వారిని తమ శత్రువుల యెదుట కత్తిపాలు చేసెదను అని యెహూవా అన్నాడు.

**10-14వ. యిర్మీయా యొక్క శ్రమలు:-** 10-11వ. అయ్యో నాకు శ్రమ; నా తల్లీ, జగడమాడువానిగాను దేశస్థులందరితో కలహించువానిగాను నీవేల నన్ను కంటివి? వారందరు నన్ను శపించుచున్నారు అని యిర్మీయా అన్నాడు. అందుకు యెహూవా నిశ్చయముగా నీకు మేలుచేయవలెనని నేను నిన్ను బలపరచుచున్నాను అని జవాబిచ్చాడు.

13-14వ. నా జనులారా మీరు చేయు సమస్తపాపములనుబట్టి మీ స్వాస్థ్యమును నిధులను క్రయము లేకుండ నేను దోపుడు సొమ్ముగా అప్పగించుచున్నాను. నీవెరుగని దేశములో నీ శత్రువులకు నిన్ను దాసునిగా చేతును, నా కోపాగ్ని రగులుకొనుచు నిన్ను దహించును అని యూదా ప్రజలను గూర్చి దేవుడు చెప్పాడు.

**15-18వ. శ్రమను బట్టి యిర్మీయా మొర:-** 15-16వ. యెహోవా! నా శ్రమ నీకే తెలిసియున్నది; నన్ను జ్ఞాపకము చేసికొనుము, నన్ను హింసించువారికి నా కొరకై ప్రతిదండన చేయుము. నీవు దీర్ఘశాంతము కలిగినవాడవై నన్ను కొనిపోకుము, నీ నిమిత్తము నాకు నిందవచ్చుచున్నదని తెలిసికొనుము అని ప్రార్థించాడు. నీ మాటలు నాకు దొరకగా నేను వాటిని భుజించితిని. యెహోవా! నీ పేరు నాకు పెట్టబడెను గనుక నీ మాటలు నాకు సంతోషమును ఆనందమును కలుగజేయుచున్నవి అని యిర్మీయా అన్నాడు.

17-18వ. సంతోషించు వారి సమూహములో నేను కూర్చుండలేదు. నా బాధ యేల యెడతెగనిదాయెను. నీవు నాకు నిలువని జలము అవుదువా? అని ప్రార్థించాడు.

**19-21వ. దేవుని జవాబు - ప్రవక్తగా రెండవ సారి నియామకము:-** నీవు నాతట్టు తిరిగిన యెడల నీవు నా సన్నిధిని నిలుచునట్లు నేను నిన్ను తిరిగి రప్పింతును. ఏవి నీచములో యేవి ఘనములో నీవు గురుతుపట్టినయెడల నీవు నానోటివలె ఉందువు; వారు నీ తట్టునకు తిరుగవలెను గాని నీవు వారి తట్టునకు తిరుగకూడదు అని యెహోవా అన్నాడు. అప్పుడు నిన్ను ఈ ప్రజలను పడగొట్టజాలని యిత్తడి ప్రాకారముగా నేను నియమించెదను; నిన్ను రక్షించుటకును నిన్ను విడిపించుటకు నేను నీకు తోడైయుందును గనుక వారు నీమీద యుద్ధము చేయుదురు గాని నిన్ను జయింపకపోదురని యెహోవా సెలవిచ్చుచున్నాడు. మరియు దుష్టుల చేతిలోనుండి నిన్ను విడిపించెదను, బలాత్కారుల చేతిలోనుండి నిన్ను విమోచించెదను అని దేవుడు అన్నాడు.

**16-17అ. చెరకు ముందు 20సం.లోని ఆరు ప్రత్యక్షతలలో ఐదవ ప్రత్యక్షత.**

# 16వ. అధ్యాయము (5+4+4+5+3=21వ)

**అంశము:- అవివాహితుడైన యిర్మీయా ప్రవక్త.**

**1-5వ. ప్రజల శిక్షనుబట్టి ప్రవక్త దుఃఖించకుండుట:-** చెరకు బానిసలుగా వెళ్లేవారికి వివాహములు జరుగుట ఉండదు కనుక యూదా ప్రజలు ఎరుగునట్లు ఈ స్థలమందు నీకు కుమారులైనను కుమార్తెలైనను పుట్టకుండునట్లు నీవు వివాహము చేసికొనకూడదని యెహోవా యిర్మీయాకు ఆజ్ఞాపించాడు. ఈ స్థలమందు పుట్టుపిల్లలు, వారి తల్లులు ఘోరమైన మరణము నొందెదరని వారిని గూర్చి రోదనము చేయబడదని, వారి శవములు

పక్షులకు జంతువులకు ఆహారముగా ఉండునని ప్రజలు గుర్తించు నిమిత్తము యిర్మీయా అవివాహితుడుగా ఉండాలని దేవుడు సెలవిచ్చాడు. దేవుడు ఈ ప్రజలకు సమాధానము కలుగనియ్యక వారియెడల కృపావాత్సల్యమును చూపుట లేదు గనుక రోదనము చేయు ఇంటిలోనికి అంగలార్చుటకు, ఓదార్చుటకు వెళ్లకుము అని యెహోవా చెప్పాడు.

**6-9వ. శిక్షనుబట్టి దుఃఖించని ప్రజలు:-** ఘనులేమి అల్పులేమి యీ దేశమందున్నవారు చనిపోయి పాతిపెట్టబడరు, వారి నిమిత్తము ఎవరును అంగలార్చరు, తల బోడిచేసికొనరు. చచ్చినవారిని గూర్చి జనులను ఓదార్చుటకు అంగలార్పు ఆహారము ఎవరును పంచి పెట్టరు వారి యొద్ద కూర్చుండి అన్నపానములు పుచ్చుకొనుటకు నీవు విందుశాలలో ప్రవేశింపకూడదు. మీ కన్నుల ఎదుటనే మీ దినములలోనే సంతోషధ్వనిని ఆనందధ్వనిని పెండ్లి కుమారుని స్వరమును పెండ్లి కుమార్తె స్వరమును ఈ చోట వినబడకుండ మాన్పించెదను.

**10-13వ. శిక్షకు కారణమైన ప్రజల పాపము:-** యెహోవా ఈ బాధ అంతయు నియమించుట పితరులు యెహోవాను విడిచి అన్యదేవతలను పూజించి వాటికి నమస్కారము చేయుటనుబట్టియే అని చెప్పమన్నాడు. దేవుని మాట వినకుండ మీ దుష్ట హృదయ కాఠిన్యము చొప్పున నడుచుకొనుచు పితరులకంటె విస్తారముగా చెడుతనము చేసినందున శిక్ష తప్పదని చెప్పమన్నాడు. మీరైనను మీ పితరులైనను ఎరుగని దేశమునకు మిమ్మును వెళ్లగొట్టుచున్నాను, అక్కడ మీరు దివారాత్రము అన్యదేవతలను కొలుచుదురని చెప్పమన్నాడు.

**14-18వ. విడుదల, శిక్షను గూర్చిన ప్రవచనము:-** 14-15వ. నేను వారి పితరులకిచ్చిన దేశమునకు వారిని మరల రప్పించెదను గనుక రాబోవు దినములలో ఐగుప్తు దేశములో నుండి ఇశ్రాయేలీయులను రప్పించిన యెహోవా జీవముతోడని ఇకమీదట అనక ఉత్తర దేశములో నుండియు ఆయన వారిని తరిమిన దేశములన్నిటిలో నుండియు ఇశ్రాయేలీయులను రప్పించిన యెహోవా జీవముతోడని జనులు ప్రమాణము చేయుదురు. వారిని పట్టుకొనుటకు నేను చాలామంది జాలరులను, వేటాడి తోలివేయుటకై అనేకులైన వేటగాండ్రను పిలిపించెదను అన్నాడు. 17-18వ. యూదా వారు తమ హేయక్రియలతో నా స్వాస్థ్యమును నింపియున్నారు గనుక మొదట వారి దోషమును, పాపమును బట్టియు రెండంతలుగా వారికి ప్రతీకారము చేసెదను అని యెహోవా అన్నాడు.

**19-21వ. ప్రార్థించుట - జవాబు:-** జనములు దేవుని యొద్దకు వచ్చి మా పితరులు వ్యర్థమును మాయారూపమును నిష్ప్రయోజనమునగు వాటిని మాత్రము స్వతంత్రించుకొనిరని దేవునితో చెప్పినందున తన బలమును తన శౌర్యమును ఎంతటివో వారికి తెలియజేతును అని దేవుడు అన్నాడు.

# 17వ. అధ్యాయము (4+7+7+5+4=27వ)

అంశము:- విశ్రాంతి దినమును మీరుట.

**1-4వ. నిజదేవుని కాక విగ్రహాలను పూజిస్తున్న యూదావారు:-** వారి కుమారులు తాము కట్టిన బలిపీఠములను, ప్రతి పచ్చని చెట్టుక్రిందనున్న దేవతాస్థంభములను జ్ఞాపకము చేసికొనుచుండగా యూదా పాపము ఇనుపగంటముతో వ్రాయబడియున్నది; అది వజ్రపు మొనతో లిఖింపబడియున్నది; అది వారి హృదయములనెడి పలకల మీదను చెక్కబడియున్నది. మీ బలిపీఠముల కొమ్ముల మీదను చెక్కబడియున్నది. 3-4వ. వారి పాపమునుబట్టి వారి ఆస్తిని నిధులన్నిటిని బలిపీఠములను దోపుడు సొమ్ముగా, దాసులగునట్లు శత్రువులకు దేవుడు అప్పగించుచున్నాడు.

**5-11వ. నరులను ఆశ్రయించి యెహోవాను ఆశ్రయించనివారు:-** 5-6వ. నరులను ఆశ్రయించి శరీరులను తనకాధారముగా చేసికొనుచు తన హృదయమును యెహోవా మీద నుండి తొలగించుకొనువాడు శాపగ్రస్తుడై ఎడారిలోని అరుహావృక్షమువలె ఉండును మేలువచ్చినప్పుడు అది వానికి కనబడదు, వాడు అడవిలో కాలిన నేలయందు నిర్జనమైన చవిటి భూమియందు నివసించును అని యెహోవా చెప్పుచున్నాడు. 7-8వ. యెహోవాను నమ్ముకొనువాడు ధన్యుడు, యెహోవా వానికి ఆశ్రయముగా ఉండును. వాడు జలముల యొద్ద నాటబడిన చెట్టువలె నుండి, కాలువల ఓరను దాని వేళ్లు తన్నును; వెట్ట కలిగినను దానికి భయపడదు, దాని ఆకు పచ్చగానుండును, వర్షములేని సంవత్సరమున చింతనొందదు కాపు మానదు అని దేవుడు అన్నాడు. 9-11వ. హృదయము అన్నిటికంటె మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధి కలది, దాని గ్రహింపగల వాడెవడు? ఒకని ప్రవర్తననుబట్టి వాని క్రియల ఫలముచొప్పున ప్రతికారము చేయుటకు యెహోవా హృదయమును, అంతరింద్రియములను పరీక్షించువాడను అని యెహోవా అన్నాడు.

**12-18వ. పాపమును ఒప్పుకొని ప్రార్థించిన యిర్మీయా:-** 12-14వ. ఇశ్రాయేలునకు ఆశ్రయమా, యెహోవా, నిన్ను విసర్జించి వారు యెహోవా అను జీవజలముల ఊటను విసర్జించి ద్రోహము చేసి యున్నారు గనుక వారందరు సిగ్గునొందుదురు. యెహోవా, నీవు నన్ను స్వస్థపరచుము, నేను స్వస్థత నొందుదును, నన్ను రక్షించుము నేను రక్షింపబడుదును, నేను నిన్ను స్తోత్రించుటకు నీవే కారణభూతుడవు అని యిర్మీయా ప్రార్థించాడు. 15-18వ. నా నోట నుండి వచ్చిన మాట నీ సన్నిధిలో నున్నది. ఆపత్కాలమందు నీవే నా ఆశ్రయము, నాకు అధైర్యము పుట్టింపకుము. నన్ను సిగ్గుపడనియ్యక నన్ను దిగులు పడనియ్యక వారిని దిగులు పడనిమ్ము, వారి మీదికి ఆపద్దినము రప్పించుము, రెట్టింపు నాశనముతో వారిని నశింపజేయుము అని ప్రార్థించాడు.

**19-23వ. ప్రార్థనకు యెహోవా జవాబు:-** 19-21వ. యెహోవా యిర్మీయాతో నీవు వెళ్లి యూదారాజులు వచ్చుచు పోవుచునుండు గుమ్మములన్నిటను నిలిచి ప్రకటించమన్నాడు. యూదా రాజులారా, యెరూషలేము నివాసులారా, ఈ విషయములో జాగ్రత్తపడుడి, విశ్రాంతి దినమున ఏ బరువును మోయకుడి, యేపనియు చేయకుడని పితరుల కాజ్ఞాపించినట్లు విశ్రాంతి దినమును ప్రతిష్ఠిత దినముగా ఎంచుకొనుడని దేవుడు చెప్పగా వారు వినక మొండికి తిరిగిరని యిర్మీయాకు చెప్పాడు.

**24-27వ. దేవుని మాట వినుట- వినకపోవుట:-** 24-26వ. యెహోవా మీరు నా మాట జాగ్రత్తగా విని, విశ్రాంతిదినమున ఏ పనియు చేయక దాని ప్రతిష్ఠితదినముగా నెంచి, ఏ బరువును తీసికొనిపోకుండిన యెడల దావీదు సింహాసనమందు ఆసీనులై, రథముల మీదను గుఱ్ఱములమీదను ఎక్కి తిరుగుచుండు రాజులును, అధిపతులును ఈ పట్టణపు గుమ్మములలో ప్రవేశింతురు అని చెప్పాడు. 27వ. అయితే మీరు విశ్రాంతి దినమును ప్రతిష్ఠితదినముగా నెంచి, ఆ దినమున బరువులు మోసికొనుచు యెరూషలేము గుమ్మములలో ప్రవేశించిన యెడల అది యెరూషలేము నగరులను అర్పుటకు సాధ్యము కానంతగా కాల్చివేయును అన్నాడు.

## 18వ. అధ్యాయము (6+6+6+5=23వ)

**అంశము:- మాట విననందున చెరకు పంపబడుట.**

**1-6వ. సూచన:-** యెహోవా యిర్మీయాకు నీవు లేచి కుమ్మరి యింటికి పొమ్ము అనగా యిర్మీయా కుమ్మరి యింటికి వెళ్లగా వాడు తన సారెమీద పని చేయుచుండెను. కుమ్మరి జిగటమంటితో చేయుచున్న కుండ వాని చేతిలో విడిపోగా ఆ జిగటమన్ను మరల తీసికొని కుమ్మరి తనకు యుక్తమైనట్టుగా దానితో మరియొక కుండ చేయుట చూసాడు. 5-6వ. అంతట యెహోవా జిగటమన్ను కుమ్మరిచేతిలో ఉన్నట్టుగా ఇశ్రాయేలువారలారా, మీరు నా చేతిలో ఉన్నారు. ఈ కుమ్మరి మంటికి చేసినట్లు నేను మీకు చేయలేనా? అన్నాడు.

**7-12వ. దేవుని పిలుపునకు అవిధేయత:-** 7-10వ. దాని పెల్లగింతుననియు, విరుగగొట్టుదుననియు, నశింపజేయుదుననియు ఏదోయొక జనమును గూర్చి గాని రాజ్యమును గూర్చి గాని చెప్పియుండగా ఆ జనము చెడుతనము చేయుట మానిన యెడల దేవుడు వారికి చేయనుద్దేశించిన కీడును గూర్చి సంతాపపడుదును అన్నాడు. మరియు కట్టెదననియు, నాటెదననియు ఒక జనమును గూర్చి గాని రాజ్యమునుగూర్చి గాని నేను చెప్పి యుండగా ఆ జనము దేవుడు దృష్టికి కీడుచేసిన యెడల దానికి చేయదలచిన మేలును గూర్చి నేను సంతాపపడుదును అన్నాడు. 11-12వ. కాబట్టి నీవు వెళ్లి యూదావారితోను

యెరూషలేము నివాసులతోను కీడు తెచ్చుటకై వారికి విరోధముగా ఒక యోచన చేయుచున్నాను అన్నాడు. మీరందరు మీ మీ దుష్టమార్గములను విడిచి మీ మార్గములను మీ క్రియలను చక్కపరచుకొనుడి అని దేవుడు అన్నాడు. అందుకు యూదా వారు మేము మా ఆలోచనల చొప్పున నడుచుకొందుము, మా మూర్ఖ హృదయము చొప్పున ప్రవర్తించుదుము అని అంటున్నారు.

**13-18వ. దేవుడు యూదాకు తలపెట్టిన కీడు:-** 13-16వ. ఇశ్రాయేలు కన్యక అన్యజనులను మించి బహు ఘోరమైన కార్యము చేసియున్నదని యెహోవాను మరిచి మాయకు ధూపము వేయుచు, తాము తొట్రిల్ల చేసికొనుచు శత్రువుల యెదుట నిలువకుండ చెదరగొట్టబడుచున్నారని దేవుడు చెప్పాడు. 17-18వ. అప్పుడు జనులు యిర్మీయా విషయమై యుక్తిగల యోచన చేతము రండి, యాజకుడు ధర్మశాస్త్రము వినిపించక మానడు, జ్ఞాని యోచనలేకుండ నుండడు, ప్రవక్త వాక్యము చెప్పకమానడు, వాని మాటలలో దేనిని వినకుండ మాటలతో వాని కొట్టుదము రండి అని చెప్పుకొనుచుండిరి.

**19-23వ. యిర్మీయా ప్రార్థన:-** 19-21వ. యెహోవా, నా మొఱ్ఱ నాలకించుము, నాతో వాదించు వారి మాటను వినుము. వారు నా ప్రాణము తీయవలెనని గుంటత్రవ్వి యున్నారు; చేసిన మేలునకు ప్రతిగా కీడు చేయవలెనా? వారి కుమారులను క్షామమునకు, ఖడ్గబలమునకు వారిని అప్పగింపుము, వారి భార్యలు వారి పురుషులు వారి యౌవనులు యుద్ధములో ఖడ్గముచేత హతులగుదురు గాక. 22-23వ. యెహోవా, నాకు మరణము రావలెనని వారు నా మీద చేసిన ఆలోచన అంతయు నీకు తెలిసేయున్నది, వారి దోషమునకు ప్రాయశ్చిత్తము కలుగనియ్యకుము, నీ సన్నిధినుండి వారి పాపమును తుడిచివేయకుము; వారు నీ సన్నిధిని తొట్రిల్లుదురు గాక, నీకు కోపము పుట్టు కాలమున వారికి తగినపని చేయుము అని యిర్మీయా ప్రార్థించాడు.

## 19వ. అధ్యాయము (9+6=15వ)

**అంశము:- యెహోవా మాట విననందుకు చెరకు పంపబడుట.**

**1-9వ. విగ్రహారాధనను బట్టి కీడు కలుగునన్న వర్తమానము:-** 1-3వ. నీవు వెళ్లి కుమ్మరి చేయి మంటి కూజాను కొని, జనుల పెద్దలలో కొందరిని యాజకుల పెద్దలలో కొందరిని పిలుచుకొనిపోయి, దాని సమాచారము వినువారందరికి చెవులు గింగురుమనునంత కీడును నేను ఈ స్థలము మీదికి రప్పింపబోవుచున్నాను అని ప్రకటించమన్నాడు. 4-6వ. ఏలయనగా వారు నన్ను విసర్జించి యీ స్థలములో అపచారము చేసియున్నారు, వారైనను వారి తండ్రులైనను యూదా రాజులైనను ఎరుగని అన్యదేవతలకు దానిలో ధూపము వేసి నిరపరాధుల రక్తముచేత ఈ స్థలమును నింపిరి. నేను విధింపనిదియు సెలవియ్యనిదియు

నా మనస్సునకు తోచనిదియునైన ఆచారము నాచరించిరి; తమ కుమారులను దహనబలులుగా కాల్చుటకై బయలునకు బలిపీఠములను కట్టించిరి. రాబోవు దినములలో ఈ స్థలము హత్యలోయ అనబడును. 7-9వ. తమ శత్రువుల యెదుట ఖడ్గముచేతను, ప్రాణమును తీయించి ఆకాశపక్షులకు భూజంతువులకు ఆహారముగా వారి కళేబరములను ఇచ్చి, యెరూషలేమువారి ఆలోచన వ్యర్థము చేసెదనన్నాడు. ఈ పట్టణమును పాడుగాను అపహాస్యాస్పదముగాను చేసెదను అన్నాడు. యూదా వారు తమ కుమారుల మాంసమును తమ కుమార్తెల మాంసమును తినునట్లు చేసెదను అన్నాడు.

**10-15వ. కూజాను పగులగొట్టి యూదా వారు పగులగొట్టబడుదురను సూచన:-**

10-13వ. తరువాత తనతో కూడ వచ్చిన మనుష్యులు చూచుచుండగా ఆ కూజాను పగులగొట్టి మరల బాగుచేయ నశక్యమైన కుమ్మరి పాత్రను ఒకడు పగులగొట్టునట్లు ఈ జనమును ఈ పట్టణమును యెహోవా పగులగొట్ట బోవుచున్నాడని పాతిపెట్టుటకు స్థలము లేకపోవునంతగా వారు అక్కడనే పాతిపెట్టబడుదురని చెప్పమన్నాడు. ఈ స్థలమునకును దాని నివాసులకును యెరూషలేము ఇండ్లును యూదారాజుల నగరులును అపవిత్రములగును; ఏ ఇండ్ల మీద జనులు ఆకాశ సమూహమును దేవతలకు ధూపము వేయుదురో, ఆ ఇండ్లన్నిటికి ఆలాగే జరుగును. 14-15వ. యిర్మీయా యెహోవా మందిరపు ఆవరణములో నిలిచి ఈ జనులు దేవుని మాటలు వినకుండ మొండికి తిరిగియున్నారు గనుక ఈ పట్టణమును గూర్చిన కీడంతయు దాని మీదికిని దానితో సంబంధించిన పట్టణములన్నిటి మీదికిని యెహోవా రప్పించును అని చెప్పాడు.

## 20వ. అధ్యాయము (6+7+5=18వ)

**అంశము:- యెహోవా మాట విననందున చెరకు పంపబడుట**

**1-6వ. పషూరును గూర్చిన దేవోక్తి:-** 1-2వ. యిర్మీయా ఆ ప్రవచనములను పలుకగా యెహోవా మందిరములో పెద్ద నాయకుడును ఇమ్మేరు కుమారుడునగు పషూరను యాజకుడు విని ప్రవక్తయైన యిర్మీయాను కొట్టి, యెహోవా మందిరమందున్న బెన్యామీను మీది గుమ్మమునొద్దనుండు బొండలో అతనిని వేయించెను. 3-4వ. మరునాడు పషూరు యిర్మీయాను బొండలో నుండి విడిపింపగా యిర్మీయా అతనితో ఇట్లనెను యెహోవా నీకు నీ స్నేహితులకందరికిని నీవే భయకారణముగా నుండునట్లు మాగోర్మిస్సాబీబ్ అని నీకు పేరు పెట్టును అన్నాడు. 5-6వ. పషూరు అతని స్నేహితులందరును బబులోనునకు వచ్చెదరు, అక్కడనే చనిపోయెదరు అక్కడనే పాతిపెట్టబడెదరు అన్నాడు.

**7-13వ. యిర్మీయా మొర:-** 7-8వ. యిర్మీయా యెహోవా, నీవు నన్ను ప్రేరేపింపగా నీ ప్రేరేపణకు లోబడితిని; నీవు బలవంతముచేసి నన్ను గెలిచితివి, నేను దినమెల్ల నవ్వుల

పాలైతిని, అందరు నన్ను ఎగతాళి చేయుదురు. దినమెల్ల యెహోవా మాట అవమానమునకును అపహాస్యమునకును హేతువాయెను అని ప్రార్థించాడు. 9-10వ. తన ప్రకటనను బట్టి యూదా వారిలో మార్పు రాలేదు అంతేకాక వారు యిర్మీయా దుర్మార్గుడని చాటించి చిక్కుపడునట్లు చేసి, అతనిమీద పగతీర్చు కొందమని చెప్పుకొనుచు, యిర్మీయా పడిపోగా చూడవలెనని కనిపెట్టుకొనియున్నారు. కనుక యిర్మీయా క్రుంగుదలతో ఆయన పేరు నేనెత్తను, ఆయన నామమునుబట్టి ప్రకటింపను, అని అనుకొనగా అది హృదయములో అగ్నివలెనుండుచు తన యెముకలలోనే మూయబడి యున్నట్లున్నందున తాను ఓర్చి యోర్చి విసికి యున్నానని, చెప్పక మానలేనని అన్నాడు. 11-13వ. కాని పరాక్రమముగల శూరుని వలె యెహోవా తోడైయున్నాడని; యెహోవా, నీతిమంతులను పరిశోధించువాడని; అంతరింద్రియములను హృదయమును చూచువాడని గుర్తించాడు; యెహోవాను కీర్తించుడి, యెహోవాను స్తుతించుడి, దుష్టుల చేతిలో నుండి దరిద్రుని ప్రాణమును ఆయనే విడిపించుచున్నాడని ప్రకటించాడు.

**14-18వ. యిర్మీయా పుట్టిన దినమును శపించుట:-** తాను కలిగిన కృంగుదలను బట్టి పుట్టినదినము శపింపబడును గాక అన్నాడు.

**చెరకాలమందు 20సం.లో యిర్మీయాకు ప్రత్యక్షమైన 23 యెహోవా వాక్కులు.**

**3. 21-23అ.** ప్రత్యక్షమైన 1 యెహోవా వాక్కు **(21:2వ.).**

## 21వ. అధ్యాయము (7+7=14వ)

**అంశము:- చెరను గూర్చిన వివరణ.**

**1-7వ. బబులోను రాజైన నెబుకద్రెజరు చేతికి అప్పగించబడుట:-** 1-2వ. రాజైన సిద్కియా యెహోవా తన అద్భుత కార్యములన్నిటిని చూపి మనకు తోడైయుండి నెబుకద్నేజరు చేతినుండి విడిపించునోలేదో దయచేసి మా నిమిత్తము యెహోవా చేత నీవు విచారించుమని చెప్పుటకు యిర్మీయా యొద్దకు మనుష్యులను పంపగా యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమైనది. 3-6వ. ఇశ్రాయేలు దేవుడైన బబులోను రాజుమీదను, ముట్టడివేయు కల్దీయులమీదను, వారుపయోగించుచున్న యుద్ధాయుధములను ప్రాకారముల బయటనుండి తీసికొని ఈ పట్టణము లోపలికి వాటిని పోగు చేయించుదును. కోపమును రౌద్రమును అత్యుగ్రతయు కలిగినవాడై, బాహు బలముతోను, చాచిన చేతితోను తానే వారితో యుద్ధము చేసి మనుష్యులనేమి పశువుల నేమి యీ పట్టణపు నివాసులనందరిని హతము చేసెదనని దేవుడు చెప్పాడు. 7వ. అటు తరువాత రాజైన సిద్కియాను, అతని ఉద్యోగస్థులను, తెగులును ఖడ్గమును క్షామమును తప్పించుకొని శేషించిన ప్రజలను, బబులోను రాజైన

నెబుకద్రెజరుచేతికి, అప్పగింపగా వారిని కరుణింపకయు, వారి యెడల జాలిపడకయు అతడు వారిని కత్తివాత హతము చేయును. **8-14వ. జీవమార్గమును మరణమార్గమును వారి యెదుట పెట్టబడుట:-** 8-9వ. ఈ పట్టణములో నిలుచువారు కత్తివలన గాని క్షామము వలనగాని తెగులు వలనగాని చచ్చెదరు, గనుక బయటకు వెళ్లి ముట్టడి వేయుచున్న కల్దీయులకు లోబడువారు బ్రదుకుదురు; దోపుడు సొమ్ము దక్కినట్లుగా వారి ప్రాణము వారికి దక్కునని దేవుడు సెలవిచ్చాడు. 10-11వ. ఈ పట్టణము బబులోను రాజుచేతికి అప్పగింపబడును, అతడు అగ్నిచేత దాని కాల్చివేయబడును. 12-14వ. అనుదినము న్యాయముగా తీర్పు తీర్చాలని, దోచుకొనబడిన వానిని బాధపెట్టువాని చేతిలోనుండి విడిపించాలని, లేనియెడల దేవుని క్రోధము అగ్నివలె బయలు వెడలి, యెవడును ఆర్పలేకుండ మిమ్మును దహించును అన్నాడు. క్రియల ఫలములనుబట్టి దండించెదను అన్నాడు.

## 22వ. అధ్యాయము (9+10+11=30వ)

అంశము:- యెహోయాకీముకు వర్తమానము

**1-9వ. రాజులకు వర్తమానము:-** నీతి న్యాయముల ననుసరించి నడుచుకొనాలని, పరదేశులను తండ్రిలేనివారిని, విధవరాండ్రను బాధింపక ఉపద్రవము కలుగజేయక, నిరపరాధుల రక్తము చిందింపక ఉండాలని చెప్పాడు. 4-6వ. ఈలాగున చేసిన యెడల దావీదు సింహాసనము మీద కూర్చుండు రాజులు రథములను ఎక్కి తిరుగుచు, ఉద్యోగులు, జనుల సమేతముగాను ఈ నగరు ద్వారములగుండ ప్రవేశింతురు. ఆలాగు చేయని యెడల గిలాదువలెను, లెబానోనువలెను ఉన్న ఈ నగరు పాడైపోవునని, యూదా రాజు వంశస్థులను గూర్చి యెహోవా సెలవిచ్చుచున్నాడు. 7-9వ. దేవుడే ప్రతిష్ఠించువాడగు నెబుకద్నెజరు దేవదారు చెట్లలో శ్రేష్ఠమైనవాటిని అనగా యూదా వారిని నరికి అగ్నిలో పడవేయగా యెహోవా నిబంధనను నిరాకరించి అన్యదేవతలకు నమస్కారము చేసినందున ఆయన ఈలాగున చేసియున్నాడని జనులు చెప్పుదురు.

**10-19వ. యెహోయాకీముకు వర్తమానము:-** 10-12వ. చనిపోయినవాని గూర్చి యేడవక వెళ్లిపోవుచున్న వాని గూర్చి బహురోదనము చేయుడి అన్నాడు. తన తండ్రియైన యోషీయాకు ప్రతిగా ఏలిన షల్లూమును అనగా యెహోయాహాజును గూర్చి యెహోవా అతడు ఇక్కడికి తిరిగి రాడు; ఈ దేశమునిక చూడక వారు అతని తీసికొని పోయిన స్థలమునందే అతడు చచ్చును అని చెప్పాడు.

13-16వ. నీతి తప్పి తన నగరును స్థాపించు వానికి శ్రమ; న్యాయము తప్పి తనమేడ గదులను కట్టించుకొనుచు, జీతమియ్యక తన పొరుగువానిచేత ఊరకయే కొలువు చేయించుకొను వానికి శ్రమ. 17-19వ. నీవు నిరపరాధుల రక్తము ఒలికించి జనులను

బాధించుచున్నావు. అందుకొరకే బలాత్కారము చేయుచున్నావు. కావున యోషీయా కుమారుడగు యెహోయాకీమను యూదారాజు యెరూషలేము గుమ్మముల ఆవలికి ఈడువబడి పారవేయబడి గాడిద పాతిపెట్టబడు రీతిగా పాతిపెట్టబడును.

**20-30వ. యెహోయాకీము కుమారుడగు యెకొన్యాకు వర్తమానము:-** 20-23వ. యూదా యొక్క విటకాండ్రు నాశనమైరి. కనుక యూదా లెబానోను పర్వతము ఎక్కి కేకలు వేయలని చెప్పుచున్నాడు. 24-26వ. యెహోయాకీము కుమారుడగు కొన్యా (యెకన్యా) శికా ఉంగరముగా అనగా రాజుగా ఉండినను ఊడదీసివేసెదనని చెప్పుచున్నాను. రాజైన నెబుకద్రెజరు చేతికిని కల్దీయుల చేతికిని అప్పగించగా యెకొన్యా అక్కడనే చచ్చునని చెప్పుచున్నాడు. 27-30వ. వారు తిరిగి రావలెనని బహుగా ఆశపడు దేశమునకు వారు తిరిగిరారు. యెకొన్యా అతని సంతానమును విసరివేయబడి, తామెరుగని దేశములోనికి త్రోయబడిరి. తన దినములలో వర్ధిల్లనివాడని, అతని సంతానములో ఎవడును వర్ధిల్లడని, వారిలో ఎవడును దావీదు సింహాసనమందు కూర్చుండడని ఇక మీదట ఎవడును యూదాలో రాజుగా నుండడని దేవుడు చెప్పుచున్నాడు.

## 23వ. అధ్యాయము (4+4+6+7+6+2+6+5=40వ)

**అంశము:- యూదా రాజులకు, ప్రవక్తలకు, యాజకులకు ప్రకటనలు.**

**1-4వ. కాపరులను గూర్చిన వర్తమానము:-** 1-2వ. దేవుని మందలో చేరిన గొఱ్ఱెలను నశింపజేయుచు చెదరగొట్టు కాపరులకు శ్రమ. ఇశ్రాయేలు దేవుడైన యెహోవా తన జనులను మేపు కాపరులను గూర్చి నేను మేపుచున్న గొర్రెలను చెదరగొట్టి పారదోలితిరి. కనుక మీ దుష్క్రియలనుబట్టి మిమ్మును శిక్షింపబోవుచున్నాను అని సెలవిచ్చాడు. 3-4వ. మరియు నేను వాటిని తోలివేసిన దేశములన్నిటిలో నుండి నా గొర్రెల శేషమును సమకూర్చి తమ దొడ్లకు వాటిని రప్పించెదనని; అవి అభివృద్ధిపొంది విస్తరించునని. నేను వాటి మీద కాపరులను నియమించెదనని; ఇకమీదట అవి భయపడకుండను బెదరిపోకుండను వాటిలో ఒకటైనను తప్పిపోకుండను వీరు నా గొఱ్ఱెలను మేపెదరని అన్నాడు.

**5-8వ. మెస్సియాను గూర్చిన వర్తమానము:-** 5-6వ. యెహోవా ఈలాగు ఆజ్ఞ ఇచ్చుచున్నాడు. రాబోవు దినములలో నేను దావీదునకు నీతి చిగురును (అనగా యేసు పుట్టుక) పుట్టించెదను; అతడు రాజై పరిపాలన చేయును, అతడు వివేకముగా నడుచుకొనుచు కార్యము జరిగించును, భూమిమీద నీతి న్యాయములను జరిగించును. అతని దినములలో యూదా రక్షణనొందును, ఇశ్రాయేలు నిర్భయముగా నివసించును, యెహోవా మనకు నీతియని అతనికి పేరు పెట్టుదురు. ఇది అంత్య కాలములో జరుగును. 7-8వ. కాబట్టి

రాబోవు దినములలో జనులు ఇశ్రాయేలీయులను ఐగుప్తు దేశములో నుండి రప్పించిన యెహోవా జీవము తోడని ఇక ప్రమాణముచేయక ఉత్తర దేశములో నుండియు, నేను వారిని చెదరగొట్టిన దేశములన్నిటిలో నుండియు వారిని రప్పించిన యెహోవానగు నాతోడని ప్రమాణము చేతురని యెహోవా సెలవిచ్చుచున్నాడు; మరియు వారు తమ దేశములో నివసింతురు.

**9-14వ. ప్రవక్తలు, యాజకుల ప్రవర్తన:-** ప్రవక్తలేమి, యాజకులేమి అందరును అపవిత్రులై దేవుని మందిరములో వారి చెడుతనము కనబడుచున్నది అని చెప్పుచున్నాడు. వారి దండన సంవత్సరమున వారి మీదికి కీడు రప్పించుదునని, గనుక గాఢాంధకారములో నడుచు వానికి జారుడు నేలవలె వారి మార్గముండునని, దానిలో వారు తరుమబడి పడిపోయెదరని చెప్పుచున్నాడు. షోమ్రోను ప్రవక్తలు బయలు పేరట ప్రవచనము చెప్పి ఇశ్రాయేలును త్రోవ తప్పించిరి. యెరూషలేము ప్రవక్తలు ఘోరమైన క్రియలు చేయుచు, వ్యభిచారులు అసత్యవర్తనులై, తమ దుర్మార్గతనుండి మరలక దుర్మార్గుల చేతులను బలపరచి, వారందరు దేవుని దృష్టికి సొదొమవలెనైరి, దాని నివాసులు గొమొఱ్ఱావలెనైరి. దేశము వ్యభిచారులతో నిండియున్నది, జనుల నడవడి చెడ్డదాయెను, వారి శౌర్యము అన్యాయమునకు ఉపయోగించుచున్నది గనుక శాపగ్రస్తమై దేశము దుఃఖపడుచున్నదని చెప్పుచున్నాడు.

**15-21వ. ప్రవక్తల పలుకును గూర్చినది:-** యెరూషలేము ప్రవక్తల అపవిత్రత దేశమంతట వ్యాపించెను గనుక తినుటకు మాచిపత్రియు త్రాగుటకు చేదు నీళ్లును దేవుడు వారికిచ్చుచున్నాను అన్నాడు. ప్రవచనములు ప్రకటించు ప్రవక్తల భ్రమ పెట్టు మాటలు చెప్పుచున్నారు. ఒకడు తన హృదయ మూర్ఖత చొప్పున నడవగా వానితో మీకు కీడురాదని చెప్పుచు, యెహోవా ఆజ్ఞను బట్టి మాటలాడక తమకు తోచిన దర్శనమునుబట్టి పలుకుచున్నారు. దేవుడు ఈ ప్రవక్తలను పంపకుండినను వారు పరుగెత్తి వచ్చి, దేవుడు వారితో మాటలాడకుండినను వారు ప్రకటించుచున్నారు.

**22-27వ. దేవునివారు కాని ప్రవక్తలు:-** వారు నా సభలో చేరిన వారైన యెడల వారు నా మాటలు నా ప్రజలకు తెలియజేతురు, దుష్క్రియలు చేయక వారు దుర్మార్గమును విడిచి పెట్టునట్లు దేవుని ప్రజలను త్రిప్పియుందురు అని దేవుడు చెప్పుచున్నాడు. కలకంటిని కలకంటిని అని ప్రవక్తలు అబద్ధములు ప్రకటించు ప్రవక్తలు పలికిన మాట నేను వినియున్నానని దేవుడు చెప్పుచున్నాడు. తమ హృదయ కాపట్యమునుబట్టి అబద్ధములు ప్రకటించు ప్రవక్తలు ఆలోచించాలని చెప్పుచున్నాడు. వీరందరు తమ పొరుగువారితో చెప్పు కలలచేత యూదా జనులు దేవుని నామమును మరచి బయలును పూజచేయవలెనని యోచించుచున్నారని చెప్పుచున్నాడు.

**28-29వ. కలలుకను ప్రవక్తలు:-** కలకనిన ప్రవక్త ఆ కలను చెప్పవలెను; నా వాక్కు ఎవనికుండునో వాడు సత్యమునుబట్టి నా మాట చెప్పవలెను; ధాన్యముతో చెత్తకు ఏమి సంబంధము? నా మాట అగ్నివంటిది కాదా? బండను బద్దలుచేయు సుత్తెవంటిది కాదా? అని దేవుడు చెప్పుచున్నాడు.

**30-35వ. జతవానియొద్దనుండి మాటలను దొంగిలించు ప్రవక్తలు:-** తమ జతవాని యొద్ద నుండి మాటలను దొంగిలించు ప్రవక్తలకు నేను విరోధిని అని యెహోవా చెప్పుచున్నాడు. నేను వారిని పంపలేదు, వారికి ఆజ్ఞ ఇయ్యలేదు అని చెప్పుచున్నాడు.

**36-40వ. ప్రవక్తలకు శిక్ష:-** నేను మిమ్మును ఎత్తివేయుచున్నాను, మీకును మీ పితరులకును నేనిచ్చిన పట్టణమును నా సన్నిధినుండి పారవేయుచున్నాను, ఎన్నడును మరువబడని నిత్య అవవాదమును, నిత్య అవమానమును మీమీదికి రప్పించెదను అని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**పెందలకడ లేచి మాటలాడు దేవుడు. (బైబిలు అంతటిలో 13 పర్యాయములు).**

1) యిర్మీ 7:13 నేను మీతో మాటలాడినను పెందలకడ లేచి మీతో మాటలాడినను మీరు వినకయు, మిమ్మును పిలిచినను మీరు ఉత్తరమియ్యకయు నున్నారు.

2) యిర్మీ 7:25 మీ పితరులు ఐగుప్తు దేశములోనుండి బయలుదేరి వచ్చిన దినము మొదలుకొని... నేను అనుదినము పెందలకడ లేచి ప్రవక్తలైన నా సేవకులనందరిని మీ యొద్దకు పంపుచు వచ్చితిని.

3) యిర్మీయా 11:7 ఐగుప్తులో నుండి మీ పితరులను రప్పించిన దినము మొదలు కొని నేటివరకు నా మాట వినుడి అని పెందలకడ లేచి చెప్పుచువచ్చితిని.

4) యిర్మీయా 25:3 యూదారాజునైన యోషీయా పదుమూడవ సంవత్సరము మొదలుకొని నేటివరకు ఈ యిరువది మూడు సంవత్సరములు నేను పెందలకడ లేచి మీకు ప్రకటించుచు వచ్చినను మీరు వినకపోతిరి.

5) యిర్మీయా 25:6 యెహోవా పెందలకడ లేచి ప్రవక్తలైన తన సేవకుల నందరిని మీ యొద్దకు పంపుచు వచ్చినను మీరు వినకపోతిరి.

6) యిర్మీయా 26:5 మీరు నా మాటలు విని ధర్మశాస్త్రము ననుసరించి నడుచుకొనుడనియు, నేను పెందలకడలేచి పంపుచున్న నా సేవకులగు ప్రవక్తల మాటలను అంగీకరించుడనియు నేను మీకు ఆజ్ఞ ఇయ్యగా మీరు వినకపోతిరి.

7) యిర్మీయా 29:18 నేను పెందలకడ లేచి ప్రవక్తలైన నా సేవకుల చేత వారి యొద్దకు పంపిన నా మాటలను ఆలకింపకపోయిరి.

8) యిర్మీయా 32:33 నేను పెందలకడ లేచి వారికి బోధించినను వారు నా బోధ నంగీకరింపకపోయిరి, వారు నా తట్టు ముఖము త్రిప్పుకొనక వీపునే త్రిప్పుకొనిరి.

9) యిర్మీయా 35:14 ద్రాక్షారసము త్రాగవద్దని రేకాబు కుమారుడైన యెహోనాదాబు తన కుమారుల కాజ్ఞాపించగా నేటివరకు తమ పితరుని ఆజ్ఞకు విధేయులై వారు ద్రాక్షారసము త్రాగకున్నారు; అయితే నేను పెందలకడ లేచి మీతో బహు శ్రద్ధగా మాటలాడినను మీరు నా మాట వినకున్నారు.

10) యిర్మీయా 35:15 మరియు పెందలకడ లేచి ప్రవక్తలైన నా సేవకులనందరిని మీ యొద్దకు పంపుచు ప్రతివాడును తన దుర్మార్గతను విడిచి మీ క్రియలను చక్కపరచుకొనిన యెడలను, నేను మీకును మీ పితరులకును ఇచ్చిన దేశములో మీరు నివసింతురని నేను ప్రకటించితిని గాని నా మాట వినకపోతిరి.

11) యిర్మీయా 44:4 మరియు నేను పెందలకడ లేచి ప్రవక్తలైన నా సేవకులందరిని మీ యొద్దకు పంపుచు, నాకసహ్యమైన యీ హేయకార్యమును మీరు చేయకుండుడి అని నేను చెప్పుచువచ్చితిని గాని...

12) 2 దిన 36:16 పెందలకడ లేచి పంపుచువచ్చినను వారు దేవుని దూతలను ఎగతాళి చేయుచు, ఆయన వాక్యములను తృణీకరించుచు ఆయన ప్రవక్తలను హింసించుచురాగా, యెహోవా కోపము జనుల మీదికి వచ్చెను.

13) మార్కు 1:35 ఆయన పెందలకడనే లేచి యింకను చాలా చీకటియుండగానే బయలుదేరి, అరణ్య ప్రదేశమునకు వెళ్లి, అక్కడ ప్రార్థన చేయుచుండెను.

**2) 24-26అ. చెరను గూర్చి ప్రత్యక్షమైన 3 వాక్కులు (అంజూరపు పండ్ల గంపల సూచన)**

## 24వ. అధ్యాయము (3+4+3=10వ)

**అంశము:- చెరను గూర్చిన వర్తమానము**

**1-3వ. రెండు గంపల అంజూరపు పండ్లను చూపుట:-** 1-2వ. యూదా రాజైన యెహోయాకీనును, దేశప్రధానులను శిల్పకారులను, నెబుకద్రెజరు రాజు క్రీ.పూ. 597లో యెరూషలేము నుండి చెరపట్టుకొని బబులోనునకు తీసికొనిపోయెను. తరువాత యెహోవా మందిరము ఎదుట ఉంచబడిన రెండు గంపల అంజూరపుపండ్లను యిర్మీయాకు కనపరచెను. ఒక గంపలో ముందుగా పక్వమైన అంజూరపు పండ్ల వంటి మిక్కిలి మంచి అంజురపు పండ్లు, రెండవ గంపలో మిక్కిలి జబ్బైన అంజూరపు పండ్లుండెను; అవి తినశక్యము కానంతగా జబ్బువి. 3వ. యెహోవా యిర్మీయా, నీకేమి కనబడుచున్నదని అడుగగా తాను చూచిన అంజూరపు పండ్లను గూర్చి చెప్పెను.

**4-7వ. మంచి అంజూరాలను గూర్చిన వివరణ:-** 4-5వ. దాని 4:22వ. ప్రకారము చెట్లు మానవులను సూచించును. చెట్లపండ్లు మానవులు జీవించు జీవిత ఫలములను సూచించును. యెహోవా ఆజ్ఞ ప్రకారము ఈ స్థలము నుండి కల్దీయుల దేశమునకు చెరగా వెళ్లు యూదులకు మేలు కలుగును. ఒకడు ఈ మంచి అంజూరపు పండ్లను లక్ష్యపెట్టునట్లు యెహోవా వారిని లక్ష్యపెట్టును అని చెప్పాడు. 6-7వ. వారికి మేలు కలుగునట్లు యెహోవా వారి మీద దృష్టియుంచి, ఈ దేశమునకు వారిని మరల తీసికొని వచ్చి, పడగొట్టక వారిని కట్టుదునని, పెల్లగింపక వారిని నాటుదునని దేవుడు చెప్పుచున్నాడు. వారు పూర్ణ హృదయముతో దేవుని యొద్దకు తిరిగిరాగా వారు దేవుని జనులగునట్లును, యెహోవా వారి దేవుడనగునట్లును యూదావారు యెహోవాను ఎరుగు హృదయమును వారికిచ్చెదనని దేవుడు చెప్పుచున్నాడు. 1 సమూ 16:7లో యెహోవా సమూయేలుతో మనుష్యులు లక్ష్యపెట్టు రూపమును యెత్తును యెహోవా లక్ష్యపెట్టడని, మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టునని చెప్పాడు. మత్తయి 22:37లో నీ పూర్ణ హృదయముతోను నీ పుర్ణాత్మతోను నీ పూర్ణమనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననుదియే ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ అని చెప్పాడు. కనుక పూర్ణ హృదయముతో దేవుని యొద్దకు తిరిగి వచ్చు వారికి దేవుడే ఆయనను ఎరుగు హృదయమును ఇచ్చి ఆశీర్వాదఫలమిచ్చునని నేర్చుకొందము.

**8-10వ. జబ్బు అంజూరాలను గూర్చిన వివరణ:-** మరియు దేవుని మాట విని బబులోనుకు వెళ్లక ఐగుప్తు దేశమున నివసించుటకు వెళ్లిన వారిని, దేవుని మాట వినని యూదా రాజైన సిద్కియాను దేశములో శేషించిన అతని ప్రధానులను మిక్కిలి జబ్బువైనందున తినశక్యముకాని ఆ జబ్బు అంజూరపు పండ్లవలె ఉండజేసెదనని యెహోవా సెలవిచ్చుచున్నాడు. వారు ఇటు అటు చెదరగొట్టబడి పాడైపోవు వరకు ఖడ్గమును క్షామమును తెగులును వారిలోనికి పంపి, వారికిని వారి పితరులకును ఇచ్చిన దేశములో ఉండకుండ చేతునన్నాడు. 1 సమూ 2:30లో నన్ను ఘనపరచువారిని నేను ఘనపరచుదునని నన్ను తృణీకరించువారు తృణీకారమొందుదురని సెలవిచ్చాడు. ఆ ప్రకారముగానే యూదా రాజైన సిద్కియా దేశములో శేషించిన అతని ప్రధానులను మిక్కిలి జబ్బువైనందున తినశక్యముకాని ఆ జబ్బు అంజూరపు పండ్లవలె దేవుని తృణీకరించినందున తృణీకరింపబడి నాశనమైరి.

## 25వ. అధ్యాయము (7+7+6+6+5+7=38వ)

**అంశము:- క్రియలను బట్టి దేవుని మాట వినని యూదావారు**

**1-7వ. క్రియలనుబట్టి దేవుని మాట వినకుండుట:-** 1-3వ. యెహోయాకీము రాజు నాలుగవ సం.(క్రీ.పూ. 604) అనగా బబులోను రాజైన నెబుకద్రెజరు మొదటి సం. యూదా

ప్రజలందరిని గూర్చి యిర్మీయాకు ప్రత్యక్షమైన వాక్కును యిర్మీయా యూదా ప్రజలందరికి ప్రకటించెను. యోషీయా పదుమూడవ సంవత్సరము మొదలుకొని నేటివరకు ఈ యిరువది మూడు సంవత్సరములు యెహోవా వాక్కు ప్రత్యక్షముకాగా యిర్మీయా పెందలకడ లేచి ఆ మాటలు ప్రకటించుచు వచ్చినను ప్రజలు వినలేదు. 4-7వ. వారి చేతిపనులవలన దేవునికి కోపము పుట్టించకుండునట్లును, అన్యదేవతలను అనుసరించుటయు, పూజించుటయు, నమస్కారము చేయుటమాని, చెడ్డమార్గమును దుష్ట క్రియలను విడిచిపెట్టి దేవుని వైపు తిరిగినయెడల, యెహోవా నిత్యనివాసముగా దయచేసిన దేశములో వారు నివసింతురని చెప్పుటకై యెహోవా పెందలకడలేచి ప్రవక్తలను వారి యొద్దకు పంపుచువచ్చినను వారి చేతుల పనులవలన దేవునికి కోపము పుట్టించి మాట ఆలకింపకపోయిరని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**8-14వ. శాపముగా మారిన డెబ్బది ఏండ్ల చెర:-** 8-9వ. దేవుని మాటలను ఆలకింపక పోయిరి గనుక దేవుడు ఉత్తరదేశములో నున్న సర్వజనములను, దేవుని సేవకుడైన నెబుకద్రెజరు రాజును ఈ దేశముమీదికిని దీని నివాసుల మీదికిని చుట్టు నున్న యీ జనులందరి మీదికిని రప్పించి జనులను శాపగ్రస్తులగాను పాడుగాను ఉండజేసెదనని చెప్పాడు. 10-12వ. సంతోషనాదమును ఉల్లాస శబ్దమును, పెండ్లికుమారుని స్వరమును పెండ్లి కుమార్తె స్వరమును తిరుగటిరాళ్ల ధ్వనిని దీపకాంతిని వారిలో ఉండకుండ చేసెదను. ఈ దేశమంతయు పాడుగాను నిర్జనముగాను ఉండి ఈ జనులు డెబ్బది సం.బబులోను రాజునకు దాసులుగా ఉందురని చెప్పాడు. డెబ్బది సం. గడచిన తరువాత వారి దోషములనుబట్టి దేవుడు బబులోను రాజును కల్దీయుల దేశమును శిక్షించి దేశము పాడుగనుండునట్లు నియమింతును అని చెప్పాడు. 13-14వ. ఆ దేశమునుగూర్చి దేవుడు సెలవిచ్చిన మాటలను యిర్మీయా ఈ జనములన్నిటిని ప్రకటింపగా, గ్రంథములో వ్రాయబడినది అంతయు ఆ దేశము మీదికి రప్పించెదనని దేవుడు చెప్పాడు.

**15-20, 21-26వ. దేవుని క్రోధపు పాత్ర త్రాగవలసిన యూదా వారు:-** 15 ఇశ్రాయేలు దేవుడైన యెహోవా సెలవిచ్చినట్లు క్రోధపు మద్యపాత్రను తీసికొని, యిర్మీయా జనములన్నిటికి దాని త్రాగించాడు. నేటివలెనే పాడుగాను నిర్జనముగాను అపహాస్యాస్పదముగాను శాపాస్పదముగాను చేయుటకు యెరూషలేము, యూదా పట్టణములు, దాని మహారాజులు, దాని సమీపమున, దూరమున ఉన్నవారు, ఉత్తరదేశముల రాజులందరును భూమిమీద నున్న రాజ్యములన్నియు దానిలోనిది త్రాగిరి.

**27-31వ. జనాంగములన్నిటికి దేవుని తీర్పు:-** 27-28వ. దేవుడు ప్రజల మీదికి పంపబోవు యుద్ధముచేత త్రాగి మత్తిల్లి కక్కుకొనినవారివలె మరల లేవకుండ పడుదురు. వారు ఆ పాత్రను తీసికొని ఆవశ్యముగా దాని త్రాగవలెనని యెహోవా సెలవిచ్చాడు.

29-31వ. ఉన్నత స్థలములోనుండి తన మంద మేయు స్థలమునకు విరోధముగా యెహోవా గర్జించుచు, తన పరిశుద్ధాలయములో నుండి తన స్వరమును వినిపించుచున్నాడు. ఆయన భూలోక నివాసులకందరికి తన పేరు పెట్టబడిన పట్టణమునకు కీడుచేయ విరోధముగా ఆర్భటించుచున్నాడు. యెహోవా జనములతో, శరీరులందరితో వ్యాజ్యెమాడుచు, దుష్టులను ఖడ్గమునకు అప్పగించుచున్నాడు.

**32-38వ. యూదాపై దేవుని తీర్పు - అంత్యకాలపు తీర్పు:-** 32-35వ. ఆ దినమున యెహోవాచేత హతులైనవారు ఈ దేశము యొక్క ఈ దిశనుండి ఆ దిశవరకు కనబడుదురు. ఎవరును వారిని గూర్చి అంగలార్చరు, వారిని సమకూర్చరు, పాతిపెట్టరు. మరణము నొందుటకై దినములు పూర్తియాయెను కనుక దేవుడు వారిని చెదరగొట్టగా, మందలోని ప్రధానుల గోలవినబడుచున్నది, యెహోవా వారి మేత భూమిని పాడు చేయగా నెమ్మది గల మేత స్థలములు యెహోవా కోపాగ్నిచేత పాడాయెను.

## 26వ. అధ్యాయము (3=3+3+6+4+5=24వ)

**అంశము:- చెరను గూర్చి అబద్ధ ప్రవక్తలకు ప్రకటన - వారికి శిక్ష**

**1-3వ. మందిరములో ప్రకటన:-** యెహోయాకీము ఏలుబడి ఆరంభములో యెహోవా వాక్కు ప్రత్యక్షమై యెహోవా మందిరావరణములో నిలిచి, దేవుడు ఆజ్ఞాపించు మాటలన్నిటిని వాటిలో ఒక మాటైనను విడవక యిర్మీయా ప్రకటించాలని చెప్పాడు. ప్రజలు ఆలకించి తమ దుర్మార్గము విడువగా దేవుడు సంతాపపడి చేయదలచిన కీడును చేయక మానుట జరుగాలని ఆశించాడు.

**4-6వ. మందిరము - పట్టణము శాపానికి లోనగునని దేవుడు సెలవిచ్చుట:-** దేవుడు నియమించిన ధర్మశాస్త్రమునను సరించి నడుచుకొనుడనియు, దేవుడు పెందలకడ లేచి పంపుచున్న ప్రవక్తల మాటలను అంగీకరించుడనియు ఆజ్ఞ ఇయ్యగా మీరు వినకపోయిరి. దేవుడు షిలోహునకు చేసినట్లు ఈ మందిరమునకు, ఈ పట్టణమును భూమి మీదనున్న సమస్త జనములకు శాపాస్పదముగా చేసెదను అన్నాడు.

**7-9వ. యిర్మీయాకు మరణ శిక్ష విధింపగోరిన ప్రజలు:-** యిర్మీయా యీ మాటలను యెహోవా మందిరములో పలుకుచుండగా యాజకులును ప్రవక్తలును జనులందరును విని అతని పట్టుకొని నీవు మరణశిక్ష నొందక తప్పదు అనిరి.

**10-15వ. యాజకులు, ప్రజలు యిర్మీయాను చంపకోరుట - యిర్మీయా వారిని మార్గము దిద్దుకొనుమని హెచ్చరించుట:-** 10-11వ. యూదా అధిపతులు యెహోవా మందిరమునకు వచ్చి, యాజకులును ప్రవక్తలును అధిపతులతోను సమస్త ప్రజలతోను

ఈ మనుష్యుడు ఈ పట్టణమునకు విరోధముగా ప్రవచించుచున్నాడు; గనుక మరణమునకు పాత్రుడు అనిరి. 12-13వ. అప్పుడు యిర్మీయా ఈ మందిరమునకు విరోధముగాను ఈ పట్టణమునకు విరోధముగా మీరు వినిన మాటలన్నిటిని ప్రకటించుటకు యెహోవాయే నన్ను పంపియున్నాడు. కాబట్టి యెహోవా మీకు చేసెదనని తాను చెప్పిన కీడును గూర్చి ఆయన సంతాపపడునట్లు మీరు మీ మార్గములను, మీ క్రియలను చక్కపరచుకొని మీ దేవుడైన యెహోవా మాట వినుడి అని చెప్పాడు.

14-15వ. యిర్మీయా నేను మీ వశములో నున్నాను, మీ దృష్టికేది మంచిదో, యేది యుక్తమైనదో అదే నాకు చేయుడి, అయితే మీరు నన్ను చంపిన యెడల మీరు మీమీదికిని ఈ పట్టణము మీదికిని దాని నివాసుల మీదికిని నిరపరాధి రక్తదోషము తెప్పించుదురని నిస్సందేహముగా తెలిసికొనుడి అని చెప్పాడు.

**16-19వ. యిర్మీయాను చంపకూడదన్న అధిపతులు, జనులు:-** కాగా అధిపతులును, జనులందరును, యాజకులతోను, ప్రవక్తలతోను ఇట్లనిరి. ఈ మనుష్యుడు మన దేవుడైన యెహోవా నామమునుబట్టి మనకు ఈ సమాచారము ప్రకటించుచున్నాడు గనుక ఇతడు మరణమునకు పాత్రుడు కాడు అనిరి. రాజైన హిజ్కియా దినములలో మీకా అను ప్రవక్త సీయోను దున్నబడును, యెరూషలేము రాళ్లకుప్పలగునని, పలికినందున యూదా రాజైన హిజ్కియాయైనను యూదా జనులందరిలో మరి ఎవడైనను అతని చంపలేదు. యెహోవా కీడును చేయక సంతాపపడునట్లు రాజు యెహోవాయందు భయభక్తులు కలిగి యెహోవా దయను వేడుకొనెను గదా? మనము ఈ కార్యము చేసినయెడల మన మీదకే గొప్ప కీడు తెచ్చుకొందుము అని చెప్పిరి.

**20-24వ. ఊరియా ప్రవక్త చంపబడుట - యిర్మీయా తప్పించబడుట:-** 20-21వ. కిర్యత్యారీమువాడైన ఊరియా యెహోవా నామమునుబట్టి ప్రవచించుచుండెను. అతడు యిర్మీయా చెప్పిన మాటల రీతిని యీ పట్టణమునకు విరోధముగాను ఈ దేశమునకు విరోధముగాను ప్రవచించెను. రాజైన యెహోయాకీమును అతని శూరులందరును ఆ మాటలు వినిన మీదట రాజు అతని చంపజూచుచుండగా, ఊరియా దాని తెలిసికొని భయపడి పారిపోయి ఐగుప్తు చేరెను. 22-24వ. అప్పుడు రాజు కొందరిని ఐగుప్తునకు పపంగా వారు ఐగుప్తులో నుండి ఊరియాను తీసికొనివచ్చి ఖడ్గముతో అతని చంపి సామాన్యజనుల సమాధిలో అతని కళేబరమును వేయించిరి. కాని షాఫాను కుమారుడైన అహీకాము యిర్మీయాకు తోడైయున్నందున అతని చంపుటకు వారు జనుల చేతికి అతనిని అప్పగింపలేదు.

**27-29అ. చెరను గూర్చి ప్రత్యక్షమైన 3 వాక్కులు (కాడి పలుపులు అను సూచన)**

## 27వ. అధ్యాయము (4+4+3+3+3+3+2=22వ)

**అంశము:- కాడిని గూర్చిన సూచన**

**1-4వ. కాడిని, పలుపులను అన్ని దేశములకు పంపుట:-** 1-2వ. యూదారాజైన యెహోయాకీము ఏలనారంభించినప్పుడు యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై నీవు కాడిని పలుపులను చేయించుకొని నీ మెడకు కట్టుకొనుమని సెలవిచ్చెను.

3-4వ. నీ యొద్దకు వచ్చిన దూతలచేత వాటిని యెరూషలేమునకు రాజైన సిద్కియాయొద్దకు, ఎదోము రాజునొద్దకును, మోయాబు రాజునొద్దకును, అమ్మోనీయుల రాజునొద్దకును, తూరు రాజునొద్దకును, సీదోను రాజునొద్దకును పంపుము. మరియు ఆ దూతలు తమ యజమానులకు చెప్పవలెనని దేవుడు సెలవిచ్చాడు.

**5-8వ. దేశములన్నిటిని దేవుడు నెబుకద్నెజరుకు అప్పగించుట:-** 5-6వ. ఈ సూచన భావము దేశములన్నిటిని, భూజంతువులను కూడ అతని సేవించుటకై అధిక బలముచేతను చాచిన బాహువుచేతను భూమిని భూమిమీదనున్న నరులను జంతువులను నేనే సృజించి, ఎవరికిచ్చుట న్యాయమని నాకు తోచునో వారికే యిచ్చుచున్నాను. 7-8వ. అతని స్వదేశమునకు కాలము వచ్చువరకు సమస్త జనులు అతనికిని అతని కుమారునికిని అతని కుమారుని కుమారునికిని దాసులైయుండాలని చెప్పుచున్నాడు. ఏ జనము ఏ రాజ్యము బబులోనురాజైన నెబుకద్రెజరునకు దాస్యము చేయనొల్లక బబులోను రాజుయొక్క కాడిని తన మీద పెట్టుకొనదో దానిని నాశనము చేయించువరకు ఆ జనమును ఖడ్గముచేతను క్షామముచేతను తెగులుచేతను శిక్షించెదనని దేవుడు చెప్పుచున్నాడు.

**9-11వ. లోబడని వారికి శ్రమ - లోబడిన వారికి నెమ్మది:-** కాబట్టి ప్రవక్తలేమి సోదెగాండ్రేమి, కలలు కనువారేమి, కాలజ్ఞానులు, మంత్రజ్ఞులు, బబులోను రాజునకు దాసులు కాకుందురని అబద్ధ ప్రవచనములు పలుకునప్పుడు వారిని లక్ష్యపెట్టకుడని చెప్పాడు. అయితే ఏ జనులు బబులోనురాజు కాడిక్రిందికి తమమెడను వంచి అతనికి దాస్యము చేయుదురో ఆ జనులు దేశములో కాపురముందురని, వారు తమ భూమిని సేద్యపరచుకొని, నెమ్మదిగా ఉందురని దేవుడు చెప్పాడు.

**12-14, 15-17వ. అబద్ధ ప్రవక్త మాట వినకూడదన్న హెచ్చరిక:-** బబులోను రాజు యొక్క కాడిని మెడ మీద పెట్టుకొని, అతనికిని దాసులైన యెడల మీరు బ్రదుకుదురని, బబులోను రాజునకు దాసులుకానొల్లని జనులు చత్తురని యిర్మీయా చెప్పాడు. ప్రవక్తలను దేవుడు పంపకపోయినను బబులోను రాజునకు యూదులు దాసులు కాకుందురని,

మందిరపు ఉపకరణములు ఇప్పుడే బబులోనునుండి మరల తేబడునని ప్రవచింపు ప్రవక్తలు అబద్ధమే ప్రకటించుచున్నందున, వారి మాటల నంగీకరింపవద్దని, దేవుడు చెప్పాడు.

**18-20, 21-22వ. యెరూషలేములోని ఉపకరణమును గూర్చి దేవుని సెలవు:-** బబులోను రాజైన నెబుకద్రెజరు యెరూషలేములోనుండి రాజైన యెకోన్యాను, యూదా ప్రధానులను బబులోనుకు చెరగా తీసికొనిపోయినప్పుడు అతడు యెరూషలేములో విడిచిపెట్టిన స్తంభములు, సముద్రము, మిగిలిన వాటిని గూర్చి, యెరూషలేములో శేషించియుండు ఉపకరణములు బబులోనుకు కొనిపోబడకుండునట్లు ప్రవక్తలైనవారు యెహోవాను బతిమాలుకొనుట మేలని చెప్పాడు. మందిరములోను యెరూషలేములోను శేషించిన ఉపకరణములు బబులోనునకు తేబడి దేవుడు దర్శించువరకు అక్కడనే నుండవలెనని యెహోవా చెప్పాడు.

## 28వ. అధ్యాయము (6+5+6=17వ)

అంశము:- కాడిని గూర్చిన సూచన

**1-6వ. అబద్ధ ప్రవక్త హనన్యా ప్రవచనమునకు యిర్మీయా జవాబు:-** 1-3వ. యూదారాజైన సిద్కియా యేలుబడి ఆరంభమున హనన్యా అను ప్రవక్త యాజకుల యెదుటను ప్రజలందరియెదుటను యెహోవా మందిరములో రెండు సంవత్సరములలోగా బబులోను రాజైన నెబుకద్రెజరు ఈ స్థలములోనుండి బబులోనునకు తీసికొనిపోయిన యెహోవా మందిరపు ఉపకరణములన్నిటిని ఇచ్చటికి మరల తేబడును అని ప్రవచించాడు. 4-6వ. బబులోను రాజు కాడి విరువబడి యూదారాజునైన యెకోన్యాను, బబులోనునకు చెరగొని పోయిన యూదులనందరిని, యీ స్థలమునకు తిరిగి యెహోవా రప్పించునని చెప్పాడు. అప్పుడు ప్రవక్తయైన యిర్మీయా యాజకులయెదుటను యెహోవా మందిరములో నిలుచుచున్న ప్రజలందరి ఎదుటను ప్రవక్తయైన హనన్యాతో ఆలాగున జరుగును గాక అన్నాడు.

**7-11వ. యిర్మీయా మాట లక్ష్యపెట్టని హనన్యా:-** 7-8వ. అయినను నేను నీ చెవులలోను ఈ ప్రజలందరి చెవులలోను చెప్పుచున్న మాటను వినుము. నాకును నీకును ముందుగానున్న ప్రవక్తలు, అనేక దేశములకు విరోధముగా యుద్ధములు జరుగుననియు, కీడు సంభవించుననియు, తెగులు కలుగుననియు పూర్వకాలమందు ప్రకటించుచు వచ్చిరి. 9-11వ. అయితే క్షేమము కలుగునని ప్రకటించు ప్రవక్తయున్నాడే, అతని మాట నెరవేరిన యెడల యెహోవా నిజముగా అతని పంపెనని ఒప్పుకొనదగునని ప్రవక్తయైన యిర్మీయా చెప్పగా ప్రవక్తయైన హనన్యా యిర్మీయా మెడ మీదనుండి ఆ కాడిని తీసి దాని విరిచి ప్రజలందరి యెదుట ఇట్లనెను, రెండు సంవత్సరములలోగా నేను బబులోను రాజైన

నెబుకద్రెజరు కాడిని సర్వజనముల మెడమీద నుండి తొలగించి దాని విరిచివేసెదనని యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు అని చెప్పెను. అంతట ప్రవక్తయైన యిర్మీయా వెళ్లిపోయెను.

**12-17వ. యిర్మీయా ఇనుపకాడిగలవాడై హనన్యా మరణమును గూర్చి ప్రవచించుట - హనన్యా మరణమగుట:-** 12-14వ. ప్రవక్తయైన యిర్మీయా మెడమీద నున్న కాడిని విరిచిన తరువాత యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై నీవు పోయి హనన్యాతో నీవు కొయ్యకాడిని విరిచితివే, దానికి ప్రతిగా ఇనుపకాడిని చేయించవలెనని యెహోవా సెలవిచ్చుచున్నాడని చెప్పాడు. ఈ జనులందరును బబులోను రాజైన నెబుకద్రెజరునకు దాసులు కావలెనని వారి మెడ మీద ఇనుపకాడి యుంచితిని గనుక వారు అతనికి దాసులగుదురు, భూజంతువులను కూడ నేను అతనికి అప్పగించి యున్నాను అని యెహోవా చెప్పాడు. 15-17వ. ప్రవక్తయైన యిర్మీయా ప్రవక్తయైన హనన్యాతో యెహోవా నిన్ను పంపలేదు, ఈ ప్రజలను అబద్ధమును ఆశ్రయింపజేయుచున్నావు. కనుక యెహోవా భూమిమీద నుండి నిన్ను కొట్టివేయుచున్నాడు, యెహోవా మీద తిరుగుబాటుచేయుటకై నీవు జనులను ప్రేరేపించితివి గనుక ఈ సంవత్సరము నీవు మరణమౌదువు అని చెప్పెను. ఆ సంవత్సరమే యేడవ నెలలో ప్రవక్తయైన హనన్యా మృతినొందెను.

## 29వ. అధ్యాయము (7+7+6+6+6=32వ)

**అంశము:- చెరలో నున్న వారికి చెరను గూర్చిన వర్తమానము**

**1-7వ. చెరలో నున్న వారు సంతోషముగా నుండవలెనన్న హెచ్చరిక:-** 1-3వ. రాజైన యెకోన్యా తల్లియగు రాణియు, రాజ పరివారమును, యెరూషలేమును విడిచి వెళ్లిన తరువాత ప్రవక్తయైన యిర్మీయా ఇండ్లు కట్టించుకొని వాటిలో నివసించుడి, తోటలు నాటి వాటి ఫలములను అనుభవించుడి. పెండ్లిండ్లు చేసికొని కుమారులను కుమార్తెలను కనుడి, అక్కడ ఏమియు మీకు తక్కువ లేకుండ అభివృద్ధి పొందుటకై వారు కుమారులను కుమార్తెలను కనునట్లు మీ కుమారులకు పెండ్లిండ్లు చేయుడి, మీ కుమార్తెలకు పురుషులను సంపాదించుడి. నేను మిమ్మును చెరగొనిపోయిన పట్టణముయొక్క క్షేమముకోరి దాని కొరకు యెహోవాను ప్రార్థన చేయుడి, దాని క్షేమము మీ క్షేమమునకు కారణమగును అని చెప్పాడు.

**8-14వ. చెరలో నున్నవారు దేవుని యొద్ద విచారణ చేయవలెనన్న హెచ్చరిక:-** 8-9వ. మీ మధ్యనున్న ప్రవక్తల చేతనైనను మంత్రజ్ఞులచేతనైనను మీరు మోసపోకుడి, మీలో కలలు కనువారి మాటలు వినకుడని వారు నా నామమునుబట్టి అబద్ధ ప్రవచనములను మీతో చెప్పుదురు, నేను వారిని పంపలేదని యెహోవా సెలవిచ్చుచున్నాడు. 10-11వ. బబులోను రాజ్యమునకు డెబ్బది సంవత్సరములు గతించిన తరువాతనే దేవుడు వారిని

నివసించుటకై ఇండ్లు కట్టించుకొనుడి, ఫలములు తినుటకై తోటలు నాటుడి, అని బబులోనులోనున్న వారికి వర్తమానము పంపగా, యాజకుడైన జెఫన్యా ప్రవక్తయైన యిర్మీయా వినుచుండగా ఆ పత్రికను చదివి వినిపించెను.

30-32వ. అంతట యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై నేను అతని పంపకపోయినను షెమయా మీకు ప్రవచింపుచు అబద్ధపు మాటలను నమ్మునట్లు చేసెను గనుక అతనిని అతని సంతానమును నేను శిక్షించుచున్నాను; ఈ జనులలో కాపురముండువాడొకడును అతనికి మిగిలియుండడు, నా ప్రజలకు నేను చేయు మేలును అతడు చూడడని యెహోవా చెప్పాడు.

**30-33అ. విడుదలను గూర్చి 8 యెహోవా వాక్కులు.**

30అ. విడుదల వర్తమానము (యిర్మీ 30:1). 31అ. విడుదల వాగ్దానము (యిర్మీ 31:3). 32అ. విడుదల విశ్వాసము (యిర్మీ 32:1,6,26). 33అ. విడుదల వివరము (యిర్మీ 33:1,19,23).

## 30వ. అధ్యాయము (7+4+6+7=24వ)

**అంశము:- విడుదల వర్తమానము.**

**1-7వ. ఆశీర్వాదము - వెనుకటి దినములు:-** 1-3వ. రాబోవు దినములలో నేను ఇశ్రాయేలు వారును యూదావారును నా ప్రజలను చెరలోనుండి విడిపించి, వారి పితరులకు నేనిచ్చిన దేశమును వారు స్వాధీనపరచుకొనునట్లు వారిని తిరిగి రప్పించెదనని యెహోవా సెలవిచ్చుచున్నాడు. కావున నేను నీతో చెప్పిన మాటలన్నిటిని ఒక పుస్తకములో వ్రాసియుంచుకొనుము. 4-7వ యెహోవా ఇశ్రాయేలు వారిని గూర్చియు యూదా వారిని గూర్చి సమాధానములోని కాలమున భీతిచేతను దిగులుచేతను జనులు కేకవేయుట వినబడుచున్నది. వీరు విచారించి తెలిసికొనుడని చెప్పుచున్నాడు. వారి ముఖములు తెల్లబారుచున్నవని, యాకోబు సంతతివారికి భయంకరమైన దినమని అయినను వారు రక్షింపబడుదురని చెప్పుచున్నాడు.

**8-11వ. ప్రభువు దినము:-** 8-10వ. ప్రభువు దినమున యూదా వారి కాడి మెడమీద నుండకుండ ఆ దినమున ప్రభువు దాని విరిచి కట్లను తెంపెదనని సెలవిచ్చుచున్నాడు, ఇకను అన్యులు యాకోబు సంతతి వారిచేత దాస్యము చేయించుకొనరనియు యెహోవా సెలవిచ్చుచున్నాడు. వారు తమ దేవుడైన యెహోవా వారి మీద రాజుగా నియమించు దావీదును అనగా క్రీస్తును సేవించుదురు. యాకోబూ, భయపడకుము; ఇశ్రాయేలూ, విస్మయమొందకుము, నిన్నును, చెరలోనికి పోయిన వారిని రక్షించుదునని బెదరించువాడు

లేకుండ యాకోబు తిరిగివచ్చి నెమ్మది పొందునని చెప్పుచున్నాడు. 11వ. యూదాను రక్షించుటకు తోడైయున్నానని, యూదాను చెదరగొట్టిన జనములన్నిటిని నాశనము చేసెదనని చెప్పాడు. యూదాను సమూల నాశనము చేయక, మితముగా శిక్షింతును అన్నాడు.

**12-17వ. గాయములు మానుట:-** 12-14వ. గొప్పదైన పాప దోషమునుబట్టి దేవుడు కఠినముగా శిక్షచేసి యూదాను గాయపరచగా వ్యాధి ఘోరమై, గాయములు బాధకరమైనవిగా యున్నవి. ఈ గాయములకు చికిత్స చేయదగినమందు లేదని చెప్పుచున్నాడు. 15-17వ. యూదాను బాధించువారందరిని చెరలోనికి పంపి, యూదాకు గాయములను మాన్పి ఆరోగ్యము కలుగజేసెదనని దేవుడు చెప్పాడు.

**18-24వ. యూదావారికి దేవునియందు ఆశీర్వాదము - దుష్టులపై మహోగ్రత:-** 18-20వ. యాకోబు నివాస స్థలములను కరుణించి వారిని చెరలోనుండి రప్పించి, పట్టణము దాని కొండమీదకట్టగా, నగరియు యథాప్రకారము నివాసులుగలదగును అని యెహోవా అన్నాడు. వాటిలో కృతజ్ఞతాస్తోత్రము వినబడును, జనులు తక్కువమంది కాకుండ నేను వారిని విస్తరింపజేసెదను, అల్పులు కాకుండ నేను వారిని ఘనులుగా జేసెదను అన్నాడు. 21-24వ. వారిలో పుట్టినవాడు ఉండును, వారి మధ్యను పుట్టిన వాడొకడు వారికి రాజుగా వారి నేలును అన్నాడు. మత్తయి 2:5, మీకా 5:2 దీనిని గూర్చిన ప్రవచనము చెప్పబడినది. 'బేత్లెహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో నీవు స్వల్పగ్రామమైనను ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలో నుండి వచ్చును. పురాతన కాలము మొదలుకొని శాశ్వతకాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను' హెబ్రీ 10:14లో మీరు నాకు ప్రజలై యుందురు నేను మీకు దేవుడనైయుందును అని చెప్పిన మాటలు దీనిని గూర్చియే. దేవుడు తన కార్యము ముగించి తన హృదయాలోచనలను నెరవేర్చువరకు యెహోవా కోపాగ్ని చల్లారదు అని సెలవిచ్చాడు.

## 31వ. అధ్యాయము (9+11+10+10=40వ)

**అంశము:- వాగ్దానము - నూతన నిబంధన.**

**1-9వ. ఇశ్రాయేలీయులపై ప్రేమ - సమకూర్పు:-** 1-3వ. చాలాకాలము క్రిందట యెహోవా ప్రత్యక్షమై శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నానని చెప్పాడు. విడువక నీ యెడల కృప చూపుచున్నాని అన్నాడు. కనుక తీతు 3:4-5వ. మన రక్షకుడైన దేవుని యొక్క దయయు, మానవులయెడల ఆయనకున్న ప్రేమయు ప్రత్యక్షమైనప్పుడు, అనగా క్రీస్తు ఈ లోకములో ప్రత్యక్షమై, ఎఫె.2:8వ. ప్రకారము కృపచేతనే పాపముల నుండి మనలను రక్షించాడు. ప్రేమించుట మాత్రమే కాక ఇశ్రాయేలు వంశస్థులకందరికి దేవుడనై యుందునని, వారు నాకు ప్రజలైయుందురని చెప్పాడు. 4-7వ. ఇశ్రాయేలుకు

విశ్రాంతి నిచ్చెదననుచున్నాడు. ఇశ్రాయేలు కన్యకను ఇకమీదట కట్టింతునని అన్నాడు. నీవు మరల తంబురలను వాయింతువు. యాకోబునుబట్టి సంతోషముగా పాడుడి, రాజ్యములకు శిరస్సగు జనమునుబట్టి ఉత్సాహధ్వని చేయుడి, ప్రకటించుడి, స్తుతిచేయుడి, ఇశ్రాయేలులో శేషించిన నీ ప్రజను రక్షింపుమీ అని ప్రార్థించమన్నాడు. నెహెమ్యా గ్రంథ మందు యెరూషలేము కట్టబడుటను చూడగలము.

**10-20వ. విమోచన గురించిన వాగ్ధానము - రాహేలు, ఎఫ్రాయాముల అంగలార్పు:-** 10-14వ. ఇశ్రాయేలును చెదరగొట్టినవాడు వాని సమకూర్చి గొఱ్ఱలకాపరి తన మందను కాపాడునట్లు కాపాడునని తెలియజేయుడి అన్నాడు. వారు వచ్చి సీయోను కొండ మీద ఉత్సాహ ధ్వని చేతురు; యెహోవా చేయు ఉపకారమునుబట్టియు గోధుమలను బట్టి ద్రాక్షారసమునుబట్టి, తైలమునుబట్టి, గొఱ్ఱెలకును, పశువులను, వాటికి పుట్టు పిల్లలను బట్టి సమూహములుగా వచ్చెదరు; వారికనెన్నటికిని కృశింపక నీళ్లుపారు తోటవలె నుందురని సెలవిచ్చుచున్నాడు. 15-17వ. ఆలకించుడి, రామాలో అంగలార్పు మహారోదన ధ్వని వినబడుచున్నవి. రాహేలు తన పిల్లలను గూర్చి యేడ్చుచున్నది; ఆమె పిల్లలు లేక పోయినందున ఆమె వారిని గూర్చి ఓదార్పు పొందనొల్లకున్నది. యేసు ప్రభువు పుట్టినప్పుడు ఈ ప్రవచనము నెరవేరినది. ఏడువక ఊరకొనుము కన్నీళ్లు విడుచుట మానుము; నీ క్రియ సఫలమై, జనులు శత్రువుని దేశములో నుండి తిరిగి వచ్చెదరు అని యెహోవా సెలవిచ్చుచున్నాడు. రాబోవు కాలమునందు నీకు మేలు కలుగునను నమ్మికయున్నది, నీ పిల్లలు తిరిగి తమ స్వదేశమునకు వచ్చెదరు అని యెహోవా చెప్పాడు. 18-20వ. కాడికి అలవాటుకాని కోడె దెబ్బలకు లోబడునట్లుగా నేను శిక్షకు లోబడుచున్నాను, నీవు నన్ను శిక్షించితివి. మనము సేవ అను కాడికి లోబడని యెడల దేవుని శిక్షను పొందాలి. శిక్ష కలిగినప్పుడు సేవలో వెనుక పడ్డామేమోనని పరీక్షించుకొనుట అవసరము. ఎఫ్రాయిము తన కిష్టమైన కుమారుడని, ముద్దు బిడ్డ అని ఎఫ్రాయిము అంగలార్చుచుండగా నేను ఇప్పుడే వినుచున్నాను, ప్రార్థించిన నేనతని కరుణింతును అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**21-30వ. విడుదల వివరము:-** 21-24వ. ఇశ్రాయేలు, సరిహద్దు రాళ్లను పాతించి, దోవచూపు స్తంభములను (sign boards) నిలువబెట్టుము అని చెప్పాడు. నీ పట్టణములకు తిరిగి రమ్ము. ఇక మీదట ఇటు అటు తిరుగులాడ అవసరము లేదని చెప్పుచున్నాడు. యెహోవా నీ దేశములో నూతనమైన కార్యము జరిగించుచున్నాడని చెప్పుచున్నాడు. 25-27వ. సేద్యము చేయువారు, మందలతో తిరుగులాడువారు, యూదా పట్టణస్థులందరు వారి దేశములో కాపురముండి సేద్యము చేయుదురని చెప్పుచున్నాడు. ఎద్దు కుంటుపడిన యజమానికే నష్టము కనుక సేవకులైనవారికి ఏ నష్టము కలుగకుండా ప్రభువు కాపాడును.

ఇశ్రాయేలు క్షేత్రములోను, యూదా క్షేత్రములోను నరబీజము మృగ బీజమును చల్లుట అనగా యూదావారి సంఖ్య రాబోవు దినములలో బహుగా విస్తరించునని భావము.

**31-40వ. దేవుని నూతన నిబంధన:-** 31-34వ. ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి. అది ఐగుప్తులో నుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున, వారి పితరులతో నేను చేసిన నిబంధనవంటిది కాదు; ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను చేయబోవు నిబంధన యిదే, వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయముమీద దాని వ్రాసెదను; అనగా పాతనిబంధన అక్షరార్థమైనదై రాతి పలకల మీద చెక్కబడినది, కాని నూతన నిబంధన ఆత్మసంబంధమైనదై హృదయము మీద చెక్కబడినది. 35-37వ. నేను వారికి దేవుడనై యుందును వారు నాకు జనులగుదురు. నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇకనెన్నడును జ్ఞాపకము చేసికొనని అన్నాడు. ఆయన పగటి వెలుగుకై సూర్యుని, రాత్రి వెలుగుకై చంద్ర, నక్షత్రములను నియమించువాడు కనుక, ఆ నియమములు తన సన్నిధినుండకుండ పోయిన యెడల ఇశ్రాయేలు సంతతివారు ఎన్నడును జనముగా ఉండకపోదురన్నాడు. 38-40వ. రాబోవు దినములలో యెరూషలేములో కొలనూలుసాగి యెహోవా పేరట కట్టబడును. పొలములు పెల్లగింపబడక, పడద్రోయబడక యెహోవాకు ప్రతిష్ఠితములగును అన్నాడు.

## 32వ. అధ్యాయము (5+10+10+10+9=44వ)

### అంశము:- విడుదలను గూర్చిన విశ్వాసము

**1-5వ. చెరసాలకు కారణము:-** 1-2వ. ఈ పట్టణమును బబులోనురాజు చేతికి అప్పగింతునని, బబులోను రాజు దండు యెరూషలేమునకు ముట్టడివేసి దాని పట్టుకొనునని దేవుడు చెప్పాడు. 3-4వ. యూదారాజైన సిద్కియా తప్పించుకొనక బబులోను రాజు చేతికి నిశ్చయముగా అప్పగింపబడును. సిద్కియా అతనితో ముఖాముఖిగా మాటలాడును, కన్నులార అతని చూచును, అతడు సిద్కియాను బబులోనునకు కొనిపోవును, నేను అతని దర్శించువరకు అతడక్కడనే యుండునని యెహోవా సెలవిచ్చుచున్నాడని యిర్మీయా చెప్పాడు. 5వ. మీరు కల్దీయులతో యుద్ధము చేసినను మీరు జయము నొందరు, అను మాటలు నీవేల ప్రకటించుచు ఉన్నావని యిర్మీయాతో చెప్పి అతనిని సిద్కియా రాజు రాజు మందిరములోనున్న చెరసాల ప్రాకారములో వేయించాడు.

**6-15వ. విడుదలకు సూచన:-** విడుదలకు సూచనగా షల్లూము కుమారుడగు హనమేలు వచ్చి అనాతోతులోనున్న నా భూమిని కొనమని చెప్పగా యిర్మీయా కొన్నాడు. 14-15వ. ఆ కొనుగోలు పత్రము బహుదినములు ఉండునట్లు దాచిపెట్టమన్నాడు. యూదావారు

చెరనుండి తిరిగివత్తురని బహుకాలము తరువాత భూములు కలిగి యుందురని దీని భావము. ఇండ్లును పొలములు ద్రాక్షతోటలు ఇంకక్ష ఈ దేశములో కొనబడును అని యెహోవా చెప్పాడు.

**16-25వ. యిర్మీయా ప్రార్థన:-** సైన్యములకధిపతియగు యెహోవా, శూరుడా, మహాదేవా, నీ యధికబలముచేతను చాచిన బాహువుచేతను భూమ్యాకాశములను సృజించితివి, నీకు అసాధ్యమైనదేదియులేదని ప్రార్థించాడు. 24-25వ. ముట్టడి దిబ్బలను చూడుము, పట్టణమును పట్టుకొనుటకు అవి దానికి సమీపించుచున్నవి, ఖడ్గము, క్షామము, తెగులు వచ్చుటవలన దానిమీద యుద్ధము చేయుచుండు కల్దీయులచేతికి ఈ పట్టణము అప్పగింపబడును; యెహోవా ప్రభువా ధనమిచ్చి యీ పొలమును కొనుక్కొని సాక్షులను పిలుచుకొనుమని నీవే నాతో సెలవిచ్చితివి, అయితే ఈ పట్టణము కల్దీయుల చేతికి అప్పగింపబడుచున్నదని ప్రార్థనలో సందేహించాడు.

**26-37వ. ప్రార్థన జవాబు- చెరకు కారణము:-** 26-27వ. నేను యెహోవాను, సర్వశరీరులకు దేవుడను, నాకు అసాధ్యమైనదేదైన నుండునా? కనుక యూదావారు తిరిగివచ్చుట నిశ్చయము అని యెహోవా సెలవిచ్చాడు. 28-33వ. ఏలయనగా ఇశ్రాయేలువారు, యూదావారు తమ బాల్యము నుండి చెడుతనమే చేయుచు తమ చేతుల క్రియల వలన వారు నాకు కోపమే పుట్టించువారు. 33-35వ. దేవుడు పెందలకడలేచి వారికి బోధించినను వారు బోధ నంగీకరింపకపోయిరి, వారు దేవునితట్టు ముఖము త్రిప్పుకొనక వీపునే త్రిప్పుకొనిరి. మందిరమును అపవిత్రపరచుటకు దానిలో హేయమైనవాటిని పెట్టిరి. వారు తమ కుమారులను, కుమార్తెలను ప్రతిష్ఠింపవలెనని బెన్‌హిన్నోము లోయలోనున్న బయలునకు బలిపీఠములను కట్టించిరి, ఆలాగు చేయుటకు నేను వారి కాజ్ఞాపింపలేదు, యూదావారు పాపములోపడి, ఇట్టి హేయక్రియలు చేయుదురన్నమాట దేవునికి ఎన్నడును తోచలేదని, కనుకనే వారు చెరకు వెళ్ళుచున్నారని యెహోవా చెప్పాడు.

**36-44వ. నిత్య నిబంధన:-** 37-39వ. ఇదిగో నాకు కలిగిన కోపోద్రేకముచేతను నేను వారిని వెళ్లగొట్టిన దేశములన్నిటిలో నుండి వారిని సమకూర్చి యీ స్థలమునకు తిరిగి రప్పించి వారిని నిర్భయముగా నివసింపజేసెదను అన్నాడు. వారు నాకు ప్రజలై యుందురు నేను వారికి దేవుడనై యుందును అనియు, మరియు వారికిని వారి కుమారులకును మేలుకలుగుటకై వారు నిత్యము దేవునికి భయపడునట్లు వారికి ఏక హృదయమును ఏక మార్గమును దయచేయుదును అన్నాడు. 40-41వ. నేను వారికి మేలుచేయుట మానకుండునట్లు నిత్యమైన నిబంధనను వారితో చేయుచున్నాను; వారు నన్ను విడువకుండునట్లు వారి హృదయములలో నాయెడల భయభక్తులు పుట్టించెదను. వారికి

మేలుచేయుటకు వారియందు ఆనందించుచున్నాను, నా పూర్ణ హృదయముతోను నా పూర్ణాత్మతోను ఈ దేశములో నిశ్చయముగా వారిని నాటెదను. 42-44వ. నేను వారిలో చెరపోయినవారిని రప్పించగా, వారు యెరూషలేము ప్రాంతములోను యూదా పట్టణములలోను మన్యములోని పట్టణములలోను దక్షిణ దేశపు పట్టణములలోను క్రయమిచ్చి పొలములు కొందరు, క్రయపత్రములు వ్రాయించుకొందురు, ముద్ర వేయుదురు, సాక్షులను పెట్టుదురు అని యెహోవా వాక్కు ద్వారా సెలవిచ్చాడు.

## 33వ. అధ్యాయము (13+13=26వ)

అంశము:- రాబోవు దావీదు రాజ్యమును గూర్చిన ప్రవచనము.

**1-13వ. యూదుల సమకూర్పు:-** 1-3వ. యిర్మీయా చెరసాల ప్రాకారములలో ఇంక ఉంచబడియుండగా యెహోవా వాక్కు ప్రత్యక్షమై తాను మాట నెరవేర్చు యెహోవానని, స్థిరపరచవలెనని దాని నిర్మించు యెహోవానని, సెలవిచ్చాడు. నాకు మొఱ్ఱపెట్టుము నేను నీకు ఉత్తరమిచ్చెదను, నీవు గ్రహింపలేని గొప్ప సంగతులను గూఢమైన సంగతులను నీకు తెలియజేతునని చెప్పాడు. కీర్త. 50:15లో ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొఱ్ఱపెట్టుము నేను నిన్ను విడిపించెదను నీవు నన్ను మహిమపరచెదవు అని అన్నాడు. కనుక మన శ్రమల అంతమున దేవుడు మహిమ పరచబడునని గుర్తింతము. 4-8వ. పట్టణము ముట్టడి వేయబడినది. చెరలో నుండిన యూదా వారిని ఇశ్రాయేలు వారిని నేను రప్పించుచున్నాను, మొదటనుండినట్లు వారిని స్థాపించుచున్నాను. వారు నాకు విరోధముగా చేసిన పాప దోషము నిలువకుండ వారిని పవిత్రపరతును, వారు నాకు విరోధముగా చేసిన దోషములన్నిటిని తిరుగుబాటులన్నిటిని క్షమించెదనని చెప్పుచున్నాడు. 9-10వ. యూదులను ఘనతాస్పదముగా చేతునన్నాడు. అలాగే యూదులు నేటికి ఘనత కలవారుగానున్నారు. 11-13వ. సంతోష స్వరమును ఆనంద శబ్దమును పెండ్లి కుమారుడు,పెండ్లి కుమార్తెల స్వరమును యెహోవా మంచివాడు, ఆయన కృప నిరంతరముండును, యెహోవాను స్తుతించుడి అని పలుకు వారి స్వరమును, మరల వినబడునని, యెహోవా మందిరములోనికి స్తుతి యాగములను తీసికొని వచ్చువారి స్వరమును మరల వినబడునని చెప్పాడు.

**14-26వ. యూదుల క్షేమమును గూర్చి వివరింపు:-** 14615వ. ఇశ్రాయేలు, యూదా వంశస్థులను గూర్చియు చెప్పిన మంచి మాట నెరవేర్చు దినములు వచ్చుచున్నవని ఆ దినములలో దావీదునకు నీతిచిగురును మొలిపించెదనని అతడు భూమిమీద నీతి న్యాయములను అనుసరించి జరిగించునని దేవుడు చెప్పాడు. 16-18వ. ఆ దినములలో యూదావారు రక్షింపబడుదురు. యెరూషలేము నివాసులు సురక్షితముగా నివసింతురు,

యెహోవాయే మనకు నీతియని యెరూషలేమునకు పేరుపెట్టబడును. ఇశ్రాయేలువారి సింహాసనము మీద కూర్చుండు వాడొకడు దావీదునకుండక మానడు. ఎడతెగక నైవేద్యము, బలులను అర్పించుటకు యాజకులైన లేవీయులలో ఒకడుండక మానడని చెప్పాడు. 19-21వ. మరియు యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై దివారాత్రములు వాటి సమయములలో ఉండకపోవునట్లు నేను పగటికి చేసిన నిబంధనను రాత్రికి చేసిన నిబంధనను మీరు భంగము చేయకలిగిన యెడల నా సేవకుడైన దావీదు సింహాసనము మీద కూర్చుండి రాజ్యపరిపాలన చేయు కుమారుడు అతనికి ఉండక మానడని అతనితో నేను చేసిన నిబంధన వ్యర్థమగునని చెప్పాడు. మరియు నా పరిచారకులైన లేవీయులగు యాజకులతోను నేను చేసిన నా నిబంధన వ్యర్థమగును. 22-26వ. నిశ్చయముగా నేను వారియెడల జాలిపడి చెరలో నుండి వారిని రప్పించెదనని చెప్పాడు.

**34-39(6అ.) యెహోయాకీము, సిద్కియా రాజుల పాపాలను గూర్చిన 8 ప్రత్యక్షతలు.**
**34-36 (3అ.) యెహోయాకీము, సిద్కియా రాజుల పాపాలను గూర్చిన 6 ప్రత్యక్షతలు.**

## 34వ. అధ్యాయము (7+4+5+6=22వ)

**అంశము:- యుద్ధకాలమున సిద్కియాకు వర్తమానము.**

**1-7వ. బబులోనులో సిద్కియా మరణమును గూర్చిన ప్రవచనము:-** 1-3వ. నెబుకద్రెజరు రాజు, అతని సమస్త సేనయు యెరూషలేము మీదను యుద్ధము చేయుచుండగా యిర్మీయాకు యెహోవా వాక్కు ప్రత్యక్షమై ఈ పట్టణమును బబులోను రాజు చేతికి అప్పగించబడి కాల్చివేయబడును. నీవు అతని చేతినుండి తప్పించుకొనజాలక. నిశ్చయముగా పట్టబడి బబులోనునకు పోవుదువు అని దేవుడు చెప్పాడు. 4-7వ. రాజవైన సిద్కియా నీవు యెహోవా మాట వినిన యెడల ఖడ్గము వలన మృతి బొందక నెమ్మదిగానే మృతి బొంది, నీకంటె ముందుగా నుండి రాజుల కొరకు ప్రజల ధూప ద్రవ్యములు కాల్చినట్లు నీ కొరకును ధూపద్రవ్యము కాల్చుదురు అని యెహోవా సెలవిచ్చాడు.

**8-11వ. హెబ్రీయులైన దాసుల విడుదలను గూర్చిన దేవుని సెలవు:-** 8వ. నీ యొద్ద నివసించు నీ సహోదరుడు బీదవాడై నీకు అమ్మబడిన యెడల వాని చేత బానిస సేవ చేయించుకొనకూడదు. వాడు జీతగానివలెను పరవాసి వలెను నీ యొద్ద నివసించు సునాద సంవత్సరము వరకు నీకు దాసుడుగా ఉండవలెను. అప్పుడతడు తన పితరుల స్వాస్థ్యమును మరల అనుభవించునట్లు తన పిల్లలతో కూడ నీ యొద్ద నుండి బయలుదేరి తన వంశస్థుల యొద్దకు తిరిగి వెళ్లవలెను (లేవీ 25:39-41వ.). ఈ వచన ప్రకారము యూదులచేత

యూదులు కొలువు చేయించుకొనక తమ దాస్యములో నున్న హెబ్రీయులకు గాని హెబ్రీయురాండ్రకు గాని అందరికి విడుదల చాటింపవలెనని సిద్కియా యెరూషలేములో నున్న సమస్త ప్రజలతో నిబంధన చేసాడు. 10-11వ. ఆ నిబంధననుబట్టి అందరును తమకు దాస దాసీ జనముగా నున్న వారిని విడిపించుదుమని, ఇకమీదట ఎవరును వారిచేత కొలువు చేయించుకొనమనియు, ఒప్పుకొని, ఆ నిబంధనలో చేరిన ప్రధానులందరును ప్రజలందరును విధేయులై వారిని విడిపించిరి. అయితే పిమ్మట వారు మనస్సు మార్చుకొని, తాము స్వతంత్రులుగా పోనిచ్చిన దాసదాసీ జనులను మరల దాసులుగాను దాసీలుగాను లోపరచుకొనిరి.

**12-16వ. దేవుని హెచ్చరికను వినిపించుకొనని యూదావారు:-** నీకు అమ్మబడి ఆరు సంవత్సరములు కొలువు చేసిన హెబ్రీయులను ఏడు సంవత్సరములు తీరిన తరువాత విడిపింపవలెను అని పితరులతో దేవుడు నిబంధన చేసాడు. అయితే పితరులు దేవుని మాట అంగీకరింపకపోయిరి. యూదావారైతే యొక్కొక్కడు తన పొరుగు వానికి విడుదల చాటింతమని చెప్పి, మందిరమందు దేవుని సన్నిధిని నిబంధన చేసిరి. వారి తమ దాసదాసీలను ఇచ్ఛానుసారముగా తిరుగునట్లు వారిని స్వతంత్రులుగా పోనిచ్చిన పిమ్మట వారు మనస్సు మార్చుకొని అందరును తమ దాసదాసీలను మరలపట్టుకొని తమకు దాసులుగాను దాసీలుగాను ఉండుటకై వారిని లోపరచుకొనిరి. 2 దిన 36:16వ. ప్రకారము పెందలకడలేచి దేవుడు దూతలను పంపుచు వచ్చినను వారు దేవుని దూతలను ఎగతాళి చేయుచు, ఆయన వాక్యములను తృణీకరించుచు, ఆయన ప్రవక్తలను హింసించుచు రాగా, నివారింప శక్యము కాకుండ యెహోవా కోపము ఆయన జనుల మీదికి వచ్చెను. 2 దిన 36:21వ. ప్రకారము యిర్మీయా ద్వారా పలుకబడిన యెహోవా మాట నెరవేరుటకై విశ్రాంతి దినములను దేశము అనుభవించు వరకు డెబ్బది సంవత్సరముల కాలము దేశము పాడుగా ఉండెను.

**17-22వ. యూదాకు శిక్ష - దాస్యమందున్న వారికి విడుదల:-** 17-19వ. ఒక్కొక్కడు తన సహోదరులకును తన పొరుగువారికిని విడుదల ప్రకటింపవలెనని దేవుడు చెప్పిన మాట వినక విడుదల చేయలేదని, అందునుబట్టి దాసదాసీలకు విడుదల కలిగించి, యూదా వారిని ఖడ్గ క్షామ సంకటముల పాలగుటకై భూరాజ్యములన్నిటిలోను ఇటు అటు చెదరగొట్టుటకు నెబుకద్నేజరుకు అప్పగించుచున్నాను అని దేవుడు చెప్పాడు. 20-22వ. వారి శత్రువుల చేతికి వారి ప్రాణము తీయజూచువారి చేతికిని వారినప్పగించుచున్నాను, వారి కళేబరములు ఆకాశ పక్షులకును భూమృగములకును ఆహారముగా నుండును.

యూదారాజైన సిద్కియాను అతని అధిపతులను బబులోను రాజు దండు చేతికిని అప్పగించుచున్నాను అని యెహోవా చెప్పాడు. ఈ పట్టణమునకు వారు మరల వచ్చి దానిమీద యుద్ధము చేసి దాని పట్టుకొని మంటపెట్టి కాల్చివేసి దానిని నిర్జనముగా చేయుదురని చెప్పుచున్నాడు.

## 35వ. అధ్యాయము (5+6+4+4=19వ)

అంశము:- రేకాబీయుల సూచన.

**1-5వ. రేకాబీయులను ద్రాక్షారసము త్రాగమని కోరుట:-** యెహోయాకీము దినములలో యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై నీవు రేకాబీయుల యొద్దకు పోయి వారితో మాటలాడి, యెహోవా మందిరములోని గదులలో ఒక దానిలోనికి వారిని తోడుకొని వచ్చి, త్రాగుటకు వారికి ద్రాక్షారసమిమ్మని సెలవియ్యగా ప్రవక్తయైన యిర్మీయా రేకాబీయుల కుటుంబికులనందరిని, తోడుకొనివచ్చి వారి యెదుట ద్రాక్షారసముతో నిండిన పాత్రలను పెట్టి ద్రాక్షారసము త్రాగుడని వారితో చెప్పాడు.

**6-11వ. పితరుల మాట మీరని రేకాబీయులు:-** 6-8వ. వారు మా పితరుడగు రేకాబు కుమారుడైన యెహోనాదాబు మీరైనను మీ సంతతివారైనను ఎప్పుడును ద్రాక్షారసము త్రాగకూడదని ఆజ్ఞాపించెను. మేము ద్రాక్షారసము త్రాగము. మీరు ఇల్లు కట్టుకొనవద్దు విత్తనములు విత్తవద్దు, ద్రాక్షతోట నాటవద్దు, అది మీకుండనే కూడదు; మీరు పరవాసము చేయు దేశములో దీర్ఘాయుష్మంతులగునట్లు మీ దినములన్నియు గుడారములలోనే మీరు నివసింపవలెనని అతడు మాకాజ్ఞాపించెను అనిరి. 9-10వ. మా తండ్రియైన యెహోనాదాబు ఆజ్ఞకు మేము విధేయులమై కాపురమునకు ఇండ్లు కట్టుకొనుట లేదు, ద్రాక్షావనములు గాని పొలములు గాని సంపాదించుట లేదు, విత్తనమైనను చల్లుటలేదు. గుడారములలోనే నివసించుచున్నాము అనిరి.

**12-15వ. దేవుని మాట మీరిన యూదావారు:-** ద్రాక్షారసము త్రాగవద్దని రేకాబు కుమారుడైన యెహోనాదాబు తన కుమారుల కాజ్ఞాపించిన ప్రకారము నేటివరకు తమ ఆజ్ఞకు విధేయులై వారు ద్రాక్షారసము త్రాగకున్నారు; అయితే దేవుడు పెందలకడ లేచి ప్రవక్తలైన సేవకులందరిని వారియొద్దకు పంపుచు బహు శ్రద్ధగా మాటలాడినను యూదా వారు దేవుని మాట వినక, అన్యదేవతలను అనుసరించుచు, వాటిని పూజించిరి.

**16-19వ. యూదావారు రేకాబీయులతో పోల్చబడుట:-** 16-17వ. రేకాబు కుమారుడైన యెహోనాదాబు కుమారులు తమ తండ్రి తమకిచ్చిన ఆజ్ఞను నెరవేర్చిరి గాని ప్రజలు

దేవుని మాట వినసందున యూదావారి మీదికి యెరూషలేము నివాసులందరి మీదికి కీడంతయు రప్పించుచున్నానని దేవుడు చెప్పాడు. 18-19వ. కాబట్టి యెహోవా తన సన్నిధిలో నిలుచుటకు రేకాబు కుమారుడైన యెహోనాదాబు సంతతివాడు ఎన్నడునుండక మానడు అని సెలవిచ్చాడు. దేవుని మాట ప్రకారము నేటికిని ఈ సంతతి వారు ఇశ్రాయేలు దేశములో నివసించుచున్నారు.

## 36వ. అధ్యాయము (8+8+5+5+6=32వ)

అంశము:- యెహోయాకీము రాజు గ్రంథమును కాల్చుట.

**1-8వ. యిర్మీయా మందిరమునకు రాకుండా నిర్భందించబడుట - బారూకు దేవుని మాటనుబట్టి గ్రంథమును లిఖించి మందిరములో చదివి వినిపించుట:-** 1-2వ. యెహోయాకీము కాలమున యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై నీవు పుస్తకపు చుట్ట తీసికొని నేను నీతో మాటలాడిన దినము మొదలుకొని, అనగా యోషీయా కాలము మొదలుకొని నేటివరకు ఇశ్రాయేలు వారిని గూర్చియు, యూదావారిని గూర్చియు, సమస్త జనములను గూర్చియు పలికిన మాటలన్నిటిని దానిలో వ్రాయుము అన్నాడు. 3-4వ. యూదా వారికి దేవుడు చేయనుద్దేశించు కీడంతటిని గూర్చి వారు విని వారి దోషము, వారి పాపము క్షమించబడునట్లు తమ దుర్మార్గతను విడిచి పశ్చాత్తాప పడుదురేమో అని దేవుడు అన్నాడు. యిర్మీయా నేరీయా కుమారుడైన బారూకును పిలువనంపగా అతడు యెహోవా యిర్మీయాతో చెప్పిన మాటలన్నిటిని యిర్మీయా నోటిమాటలనుబట్టి ఆ పుస్తకములో వ్రాసెను. 5-6వ. యిర్మీయా బారూకునకు ఈలాగు ఆజ్ఞ ఇచ్చెను నేను యెహోవా మందిరములోనికి రాకుండ నిర్భంధింపబడితిని. నీవు వెళ్లి ఉపవాస దినమున యెహోవా మందిరములో ప్రజలకు వినబడునట్లు నేను చెప్పగా నీవు పుస్తకములో వ్రాసిన మాటలను చదివి వినిపించుము తమ పట్టణములనుండి వచ్చు యూదా జనులందరికిని వినబడునట్లుగా వాటిని చదివి వినిపింపవలెను అని చెప్పాడు. 7-8వ. ఒకవేళ వారి విన్నపములు యెహోవా దృష్టికి అనుకూల మగునేమో, ఒకవేళ వారు తమ చెడు మార్గము విడుతురేమో, నిజముగా ఈ ప్రజలమీదికి ఉగ్రతయు మహా కోపమును వచ్చునని యెహోవా ప్రకటించియున్నాడు. ప్రవక్తయైన యిర్మీయా తనకు ఆజ్ఞ ఇచ్చినట్టు నేరీయా కుమారుడైన బారూకు గ్రంథము చేతపట్టుకొని యెహోవా మాటలన్ని యెహోవా మందిరములో చదివి వినిపించెను.

**9-16వ. గ్రంథపు మాటలువిని భయపడిన పెద్దలు:-** 9-12వ. బారూకు యెహోవా మందిరములో లేఖికుడైన షాఫాను కుమారుడైన గెమర్యా గదికి పైగానున్న శాలలో

యెహోవా మందిరపు క్రొత్త ద్వారపు ప్రవేశమున ప్రజలందరు వినునట్లు యిర్మీయా చెప్పిన మాటలను గ్రంథములోనుండి చదివి వినిపించెను. 13-16వ. ప్రధానుల కోరికపై బారూకు ప్రజల వినికిడిలో చదివిన పుస్తకమును చేతపట్టుకొని రాగా వారు నీవు కూర్చుండి మాకు వినిపింపుమనగా బారూకు దాని చదివి వినిపించెను. వారు ఆ మాటలన్నిటిని విన్నప్పుడు భయపడి యొకరి నొకరు చూచుకొని మేము నిశ్చయముగా ఈ మాటలన్నిటిని రాజునకు తెలియజెప్పెదమని బారూకుతోననిరి.

**17-21వ. రాజు వినికిడిలో గ్రంథములోని మాటలు చదివి వినిపించబడుట:-** 17-20వ. నీవును యిర్మీయాయును పోయి దాగియుండుడి, మీరున్న చోటు ఎవరికిని తెలియ చేయవద్దని ఆ ప్రధానులు చెప్పి శాలలో నున్న రాజునొద్దకు తామే వెళ్లి ఆ మాటలన్ని రాజు చెవులలో వినిపించిరి గాని ఆ పుస్తకపు చుట్టను లేఖికుడైన ఏలీషాను గదిలో దాచి పెట్టిరి. 21వ. ఆ గ్రంథమును తెచ్చుటకు రాజు యెహూదిని పంపగా లేఖికుడైన ఎలీషామా గదిలో నుండి దాని తీసికొని వచ్చి రాజు వినికిడిలో రాజునొద్దకు నిలిచియున్న అధిపతులందరి వినికిడిలో దాని చదివెను.

**22-26వ. రాజు దేవుని మాటలకు భయపడక గ్రంథమును కాల్చివేయుట:-** 22-24వ. యెహూది మూడు, నాలుగు పుటలు చదివిన తరువాత రాజు చాకుతో దాని కోసి కుంపటిలో వేయగా అగ్నిచేత బొత్తిగా కాలిపోయెను. రాజైనను ఈ మాటలన్నిటిని వినిన అతని సేవకులలో ఎవరైనను భయపడలేదు, తమ బట్టలు చింపుకొనలేదు. 25-26వ. లేఖికుడైన బారూకును ప్రవక్తయైన యిర్మీయాను పట్టుకొనవలెనని రాజు ఆజ్ఞాపించెను గాని యెహోవా వారిని దాచెను కనుక వారు దొరుకలేదు.

**27-32వ. బబులోనురాజు దేశమును నివాసులను శిక్షించునని దేవుడు సెలవిచ్చుట- యిర్మీయా, బారూకులు దేవుని మాటను బట్టి వేరొక గ్రంథమును వివరముగా లిఖించుట:-** 27-30వ. యిర్మీయా నోటి మాటను బట్టి బారూకు వ్రాసిన గ్రంథమును రాజు కాల్చిన తరువాత యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమై నీవు మరియొక గ్రంథము తీసికొని యూదా రాజైన యెహోయాకీము కాల్చిన మొదటి గ్రంథములో వ్రాయబడిన మాటలన్నిటిని దానిలో వ్రాయుము అన్నాడు. మరియు యూదా రాజైన యెహోయాకీమును గూర్చి బబులోను రాజు నిశ్చయముగా వచ్చి ఈ దేశమును పాడుచేసి అందులో మనుష్యులైనను, జంతువులైనను ఉండకుండ చేయునని ఇందులో వ్రాసితివని చెప్పి నీవు ఈ గ్రంథమును కాల్చివేసితివే; అందుచేత యూదా రాజైన యెహోయాకీమును గూర్చి దావీదు యొక్క సింహాసనము మీద ఆసీనుడగుటకు అతనికి ఎవడును లేకపోవును అని దేవుడు వ్రాయించాడు.

31-32వ. నేను వారి దోషమునుబట్టి అతనిని, అతని సంతతిని, అతని సేవకులను శిక్షించుచున్నాను. నేను వారిని గూర్చి చెప్పిన కీడంతయు వారిమీదికి యెరూషలేము నివాసుల మీదికిని యూదా జనుల మీదికిని రప్పించుచున్నాను; అయినను వారు వినినవారు కారు అని చెప్పాడు. యిర్మీయా ఇంకొక గ్రంథమును తీసికొని లేఖికుడగు నేరియా కుమారుడైన బారూకు చేతికి అప్పగింపగా అతడు యిర్మీయా నోటిమాటలనుబట్టి యూదా రాజైన యెహోయాకీము అగ్నిలో కాల్చిన గ్రంథపు మాటలన్నిటిని వ్రాసెను; మరియు ఆ మాటలుగాక అట్టివి అనేకములు అతడు వాటితో కూర్చి వ్రాసెను. దేవుని ప్రేమించు వారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము అని రోమా 8:28వ. వ్రాయబడిన ప్రకారము గ్రంథము కాల్చబడుట ద్వారా మనకు వివరమైన యిర్మీయా గ్రంథము లభించినది.

## యిర్మీయా 37-39అ. సిద్కియా రాజు పాపములు

(యిర్మీయా చెరలో నుండుట. యెరూషలేము ముట్టడివేయబడిన కాలము)

37:15వ. అధిపతులు యిర్మీయా మీద కోపపడి అతని కొట్టి, తాము బందీగృహముగా చేసియున్న లేఖికుడైన యోనాతాను ఇంటిలో అతని వేయించిరి.

38:28వ. యెరూషలేము పట్టబడువరకు యిర్మీయా బందీగృహశాలలో ఉండెను.

39:14వ. బందీ గృహశాలలోనుండి యిర్మీయాను తెప్పించి, అతనిని యింటికి తోడుకొని పోవుటకు షాఫాను కుమారుడైన అహీకాము కుమారుడగు గెదల్యాకు అతని అప్పగించిరి, అప్పుడతడు ప్రజల మధ్య నివాసము చేసెను.

**37-39(6అ.) యెరూషలేము ముట్టడి వేయబడిన దినములలో సిద్కియా రాజు పాపాలను గూర్చిన 2 ప్రత్యక్షతలు.**

## 37వ. అధ్యాయము (4+5+5+7=21వ)

**అంశము:- ఐగుప్తును ఆశ్రయించుట వ్యర్థము - కల్దీయులు చెరగొనుట ఖాయము.**

**1-4వ. యెరూషలేమును ముట్టడి వేసిన కల్దీయులు ఐగుప్తీయుల మీదికి వెళ్ళుట:-** యెరూషలేము కల్దీయులచే ముట్టడి వేయబడినది, కాని యిర్మీయా చెరసాలలో ఇంకను వేయబడక ప్రజల మధ్య సంచరించుచుండెను. కాని రాజైన సిద్కియా అయినను అతని సేవకులైనను దేశప్రజలైనను ప్రవక్తయైన యిర్మీయాచేత యెహోవా సెలవిచ్చిన మాటలను

లక్ష్యపెట్టలేదు. రాజైన సిద్కియా తన ప్రధానులను యిర్మీయా యొద్దకు పంపి దయచేసి మన దేవుడైన యెహోవాకు ప్రార్థన చేయుమని మనవి చేసెను.

**5-9వ. కల్దీయులు యెరూషలేమును ఓడింతురని యిర్మీయా సెలవిచ్చుట:-** 5-6వ. యూదావారు ఐగుప్తు రాజైన ఫరోను తమ పక్షముగా కల్దీయ దేశమునకు వెళ్లి బబులోను రాజుతో యుద్ధము చేయుమని కోరినట్టు తలంచగలము. ఫరో దండు ఐగుప్తులోనుండి బయలుదేరగా యెరూషలేమును ముట్టడి వేయుచున్న కల్దీయులు సమాచారము విని యెరూషలేము దగ్గర నుండి కల్దీయ దేశమునకు బయలుదేరిరి. యెహోవా యిర్మీయాతో నాయొద్ద విచారించుడని మిమ్మును పంపిన యూదారాజుతో మీకు సహాయము చేయుటకై వచ్చుచున్న ఫరోదండు తమ స్వదేశమైన ఐగుప్తులోనికి తిరిగి వెళ్లునని సెలవిచ్చెను. 8-9వ. అలాగే ఫరోదండు తమ స్వదేశమైన ఐగుప్తులోనికి తిరిగి వెళ్లిన తరువాత కల్దీయులు తిరిగివచ్చి యుద్ధము చేసి యెరూషలేము పట్టణము పట్టుకొని అగ్నిచేత కాల్చివేయుదురని, కల్దీయులు మాయొద్ద నుండి వెళ్లెదరనుకొని మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుడని, వారు వెళ్లనే వెళ్లరని యిర్మీయా చెప్పాడు.

**10-14వ. యిర్మీయాను బందీ గృహములో వేయుట:-** ఫరో దండునకు భయపడి కల్దీయులదండు యెరూషలేము ఎదుటనుండి వెళ్లిపోగా యిర్మీయా బెన్యామీను దేశములో తన వారి యొద్ద భాగము తీసికొనుటకై యెరూషలేము నుండి బయలుదేరి అక్కడికి పోయెను. అతడు బెన్యామీను గుమ్మమునొద్దకు రాగా ఇరీయా అను కావలివారి అధిపతి ప్రవక్తయైన యిర్మీయాను పట్టుకొని నీవు కల్దీయులలో చేరబోవుచున్నావని చెప్పగా యిర్మీయా అది అబద్ధము, నేను కల్దీయులలో చేరుటలేదనెను. కాని వారు యిర్మీయా మాట నమ్మక యిర్మీయాను పట్టుకొని అధిపతులయొద్దకు తీసికొని వచ్చిరి.

**15-21వ. యిర్మీయా బందీ గృహశాలలో నివసించుట:-** 15-17వ. అధిపతులు యిర్మీయా మీద కోపపడి అతని కొట్టి, తాము బందీగృహముగా చేసియున్న లేఖికుడైన యోనాతాను ఇంటిలో అతని వేయించిరి. యిర్మీయా చెరసాల గోతిలో వేయబడి అక్కడ అనేక దినములు ఉండెను; పిమ్మట రాజైన సిద్కియా అతని రప్పించుటకు వర్తమానము పంపి, అతని తన యింటికి పిలిపించి యెహోవా యొద్దనుండి ఏ మాటైనను వచ్చెనా అని అడుగగా యిర్మీయా - నీవు బబులోను రాజు చేతికి అప్పగింపబడెదవను మాటవచ్చెను అనెను. 18-19వ. యిర్మీయా రాజైన సిద్కియాతో నేను నీకైనను నీ సేవకులకైనను ఈ ప్రజలకైనను ఏ పాపము చేసినందున నన్ను చెరసాలలో వేసితివి? బబులోను రాజు ఈ దేశము మీదికిరాడని ప్రకటించిన ప్రవక్తలు ఎక్కడనున్నారు? అనెను. 20-21వ. నా యేలినవాడా, చిత్తగించి

నా మనవి నీ సన్నిధికి రానిమ్ము. నేను అక్కడ చనిపోకుండునట్లు యోనాతాను ఇంటికి నన్ను మరల పంపకుము అని యిర్మీయా రాజు వేడుకొనగా రాజైన సిద్కియా సెలవియ్యగా బంటులు బందీ గృహశాలలో యిర్మీయాను వేసి, పట్టణములో రొట్టెలున్నంత వరకు రొట్టెలు అనుదినము ఒకరొట్టె అతనికిచ్చుచు వచ్చిరి. ఇట్లు జరుగగా యిర్మీయా బందీగృహశాలలో దేవుని చిత్త ప్రకారము నివసించెను.

## 38వ. అధ్యాయము (6+7+5+5+5=28వ)

అంశము:- చెర తప్పదు.

**1-6వ. యిర్మీయాను నీళ్ళు లేని బురద గోతిలో ఉంచుట:-** 1-2వ. ఈ పట్టణములో నిలిచియున్నవారు ఖడ్గముచేతనైనను క్షామము చేతనైనను తెగులు చేతనైనను చత్తురు గాని కల్దీయుల యొద్దకు బయలు వెళ్లువారు బ్రదుకుదురు, దోపుడు సొమ్ము దక్కించుకొనునట్లు తమ ప్రాణము దక్కించుకొని వారు బ్రదుకుదురు. ఈ పట్టణము నిశ్చయముగా బబులోను రాజు దండు చేతికి అప్పగింపబడును, అతడు దాని పట్టుకొనును అని యిర్మీయా ప్రజలకందరికి ప్రకటించాడు. 3-4వ. ప్రధానులు ఈ మాటలు విని రాజుతో - ఈ మనుష్యుడు ఈ ప్రజలకు నష్టము కోరువాడే గాని క్షేమము కోరువాడు కాదు, ఇతడు ఇట్టి సమాచారము వారికి ప్రకటన చేయుటవలన ఈ పట్టణములో నిలిచియున్న యోధుల చేతులను ప్రజలందరి చేతులను బలహీనము చేయుచున్నాడు; చిత్తగించి వానికి మరణశిక్ష విధింపుము అనిరి. 5-6వ. అందుకు రాజైన సిద్కియా అతడు మీవశమున ఉన్నాడు, రాజు మీకు అడ్డము రాజాలడనగా వారు యిర్మీయాను పట్టుకొని కారాగృహములో నున్న రాజకుమారుడగు మల్కీయా గోతి లోనికి దింపిరి. అందులోనికి యిర్మీయాను త్రాళ్లతో దింపినప్పుడు ఆ గోతిలో నీళ్లు లేవు, బురద మాత్రమే యుండెను, ఆ బురదలో యిర్మీయా దిగబడెను.

**7-13వ. కూషీయుడగు ఎబెద్మెలెకుద్వారా గోతినుండి తప్పించబడి బందీ గృహములో నుండుట:-** 7-9వ. రాజు బెన్యామీను ద్వారమున కూర్చునియుండగా రాజు ఇంటిలోని కూషీయుడగు ఎబెద్మెలెకను షండుడు, వారు యిర్మీయాను గోతిలో వేసిరను సంగతి విని, రాజు నగరులో నుండి బయలువెళ్లి రాజుతో ఈలాగు మనవి చేసెను. రాజా, నా యేలినవాడా, ఆ గోతిలో వేయబడిన యిర్మీయా అను ప్రవక్త యెడల ఈ మనుష్యులు చేసినది యావత్తును అన్యాయము; అతడున్న చోటను అతడు ఆకలిచేత చచ్చును, పట్టణములోనైనను ఇంకను రొట్టెలేమియు లేవు అని చెప్పాడు. 10-13వ. అందుకు

**24-28వ. పట్టణము పట్టబడువరకు యిర్మీయా బందీగృహశాలలో నుండుట:-** 24-26వ. సిద్కియా యిర్మీయాతో ఇట్లనెను - నీవు మరణశిక్ష నొందకుండునట్లు ఈ సంగతులను ఎవనికిని తెలియనియ్యకుము. నేను నీతో మాటలాడినసంగతి అధిపతులు వినిన యెడలవారు నీ యొద్దకు వచ్చి మేము నిన్ను చంపకుండునట్లు రాజుతో నీవు చెప్పిన సంగతిని, రాజు నీతో చెప్పిన సంగతిని మరుగుచేయక మాకిప్పుడే తెలియజెప్పుమనగా నీవు యోనాతాను ఇంటిలో నేను చనిపోకుండ అక్కడికి నన్ను తిరిగి వెళ్లనంప వద్దని రాజు ఎదుట నేను మనవి చేసికొనబోతినని వారితో చెప్పుమని రాజు యిర్మీయాతో అనెను. 27-28వ. అంతట అధిపతులందరు యిర్మీయా యొద్దకు వచ్చియడుగగా అతడు రాజు సెలవిచ్చిన మాటల ప్రకారముగా వారికుత్తరమిచ్చి ఆ సంగతి వారికి తెలియజేయనందునవారు అతనితో మాటలాడుట మానిరి. యెరూషలేము పట్టబడు వరకు యిర్మీయా బందీగృహశాలలో ఉండెను.

## 39వ. అధ్యాయము (5+4+5+4=18వ)

**అంశము:- రాజు, ప్రజలు చెరకు వెళ్ళుట - ప్రవక్తయైన యిర్మీయా విడిపించబడుట.**

**1-5వ. సిద్కియా బంధింపబడి నెబుకద్నెజరుకు అప్పగించబడుట:-** 1-3వ. యూదా రాజైన సిద్కియా యేలుబడియందు తొమ్మిదవ సంవత్సరము పదియవనెలలో బబులోను రాజైన నెబుకద్రెజరు తన సమస్త సైన్యముతో యెరూషలేము మీదికి వచ్చి దాని ముట్టడి వేయగా సిద్కియా యేలుబడియందు పదకొండవ సంవత్సరము నాలుగవ నెల తొమ్మిదవ దినమున (క్రీ.పూ. 586) పట్టణ ప్రాకారములు పడగొట్టబడెను. 4-5వ. రాజైన సిద్కియాయు అతని యోధులందరును పారిపోయి, రాజు తోట గుమ్మపు మార్గమున పోయిరిగాని, రాజు మైదానపు మార్గమున వెళ్లి పోయెను. అయితే కల్దీయుల సేన వారిని తరిమి యెరికో దగ్గర మైదానములలో సిద్కియాను కలిసికొని పట్టుకొని, రాజు అతనికి శిక్ష విధింపవలెనని హమాతు దేశములో రిబ్లా పట్టణము దగ్గరనున్న బబులోను రాజైన నెబుకద్రెజరు నొద్దకు వారు సిద్కియాను తీసికొని పోయిరి.

**6-9వ. ప్రజలందరు బబులోనుకు కొనిపోబడుట:-** 6-7వ. బబులోను రాజు రిబ్లా పట్టణములో సిద్కియా కుమారులను అతని కన్నుల యెదుట చంపించెను, బబులోనురాజు యూదా ప్రధానులందరిని చంపించెను. అతడు సిద్కియా కన్నులు ఊడదీయించి అతని బబులోనుకు తీసికొనిపోవుటకై సంకెళ్లతో బంధించెను. 8-9వ. కల్దీయులు రాజు నగరును ప్రజల యిండ్లను అగ్నిచేత కాల్చివేసి యెరూషలేము ప్రాకారములను పడగొట్టిరి. అప్పుడు రాజదేహసంరక్షకుల కధిపతియగు నెబూజరదాను శేషించి పట్టణములో నిలిచియున్న

ప్రజలను, ద్రోహులై తమ రాజును విడిచి తనతో చేరినవారిని, శేషించిన ప్రజలనందరిని బబులోనుకు కొనిపోయెను. పదకొండు సంవత్సరములుగా యిర్మీయా హెచ్చరించినను సిద్కియా రాజు దిద్దుకొనకపోగా రాజు యిర్మీయాను బాధించాడు.

**10-14వ. యిర్మీయా విడిపించబడి ప్రజల మధ్య నివసించుట:-** రాజదేహ సంరక్షకుల కధిపతియైన నెబూజరదాను లేమిగల దరిద్రులను యూదా దేశములో నుండనిచ్చి, వారికి ద్రాక్షతోటలను పొలములను నియమించెను. యిర్మీయాను గూర్చి బబులోను రాజైన నెబుకద్రెజరు అధిపతియగు నెబూజరదానునకు ఈ ఆజ్ఞ ఇచ్చెను - నీవు ఇతనికి హాని చేయక దగ్గరనుంచుకొని పరామర్శించి, ఇతడు నీతో చెప్పునట్లు చేయవలెను. వారు యిర్మీయాను త్రాళ్లతో చేదుకొని ఆ గోతిలో నుండి వెలుపలికి తీసిరి.

**15-18వ. చెర నుండి తప్పించబడిన కూషీయుడగు ఎబెద్మెలెకు:-** 15-16వ. యిర్మీయా బందీగృహశాలలో నుండగా యెహోవా మాట అతనికి ప్రత్యక్షమై కూషీయుడగు ఎబెద్మెలెకుతో మేలు చేయుటకైకాక కీడుచేయుటకై ఈ పట్టణమును గూర్చి చెప్పిన మాటలు నెరవేర్చుచున్నాను, నీవు చూచుచుండగా ఆ మాటలు నెరవేరును అని చెప్పమన్నాడు. 17-18వ. ఆ దినమున నేను నిన్ను విడిపించెదను, నీవు నన్ను నమ్ముకొంటివి గనుక నిశ్చయముగా నేను నిన్ను తప్పించెదను, నీవు ఖడ్గముచేత పడవు, దోపుడు సొమ్ము దక్కించు కొనునట్లు నీ ప్రాణమును నీవు దక్కించుకొందువు అని యిర్మీయా ద్వారా దేవుడు సెలవిచ్చినట్లు ఎబెద్మెలెకును తప్పించాడు.

**40-44అ. ఐగుప్తుకు వెళ్లక ముందు, వెళ్లిన తరువాత ప్రత్యక్షమైన నాలుగు వాక్కులు.**

## 40వ. అధ్యాయము (6+6+4=16వ)

**అంశము:- గెదల్యా అధిపతిగా నియమించబడుట - యిర్మీయాను విడిపించుట**

**1-6వ. యిర్మీయాను విడిపించుట - బత్తెము బహుమానము ఇచ్చుట:-** 1-3వ. రాజ దేహ సంరక్షకులకధిపతియైన నెబూజరదాను యెరూషలేములో నుండి యూదాలో నుండి బబులోనునకు చెరగాకొనిపోబడిన బందీజనులందలో నుండి, సంకెళ్లచేత కట్టబడి యున్న యిర్మీయాను సంకెళ్ల నుండి విడిపించి రామాలోనుండి పంపివేసాడు. ఈ స్థలమునకు ఈ కీడు చేసెదనని నీ దేవుడగు యెహోవా ప్రకటించెను గదా. తాను చెప్పిన ప్రకారము యెహోవా దాని రప్పించి చేయించెను, మీరు యెహోవాకు విరోధముగా పాపముచేసి ఆయన మాటలు విననందున మీకిగతి పట్టినదని నెబూజరదాను అన్నాడు.

4-6వ. నెబూజరదాను యిర్మీయాను విడిపించి బబులోనుకు నాతో కూడ వచ్చుట

మంచిదికాదని నీకు తోచినయెడల రావద్దు, దేశమంతట నీకేమియు అడ్డములేదు, ఎక్కడికి వెళ్లుట నీ దృష్టికి అనుకూలమో, యెక్కడికి వెళ్లుట మంచిదని నీకు తోచునో అక్కడికి వెళ్లుము అన్నాడు. యిర్మీయా తిరిగివెళ్లక తడవుచేయగా రాజదేహ సంరక్షకుల కధిపతి బబులోను రాజు గెదల్యాను యూదా పట్టణముల మీద నియమించియున్నాడు, అతని యొద్దకు వెళ్లి ప్రజలమధ్యను కాపురముండుమని చెప్పాడు.

**7-12వ. యెరూషలేములో శేషించిన ప్రజలు గెదల్యా యొద్దకు వెళ్ళుట:-** 7-9వ. సేనల యధిపతులందరును బబులోను రాజు గెదల్యాను దేశము మీద అధికారిగా నియమించి, బబులోనునకు చెరగొనిపోబడక నిలిచిన వారిలో స్త్రీలను పురుషులను పిల్లలను, దేశములోని అతినీరసులైన దరిద్రులను అతనికి అప్పగించెనని విని గెదల్యా యొద్దకు వచ్చిరి. అప్పుడు గెదల్యా మీరు కల్దీయులను సేవించుటకు భయపడకుడి. దేశములో కాపురముండి బబులోనురాజును సేవించిన యెడల మీకు మేలు కలుగునని చెప్పాడు. 10-12వ. మోయాబు, అమ్మోను, ఎదోము, ప్రదేశములలోనేమి ఉన్న యూదులందరు బబులోను రాజు గెదల్యాను శేషించిన వారి మీద నియమించెననియు వినినప్పుడు అందరు తాము తోలివేయబడిన స్థలములన్ని విడిచి మిస్పాకు గెదల్యా యొద్దకు వచ్చి బహు విస్తారముగా ద్రాక్షారసమును వేసవి కాలపు పండ్లను సమకూర్చుకొనిరి.

**13-16వ. ఇష్మాయేలు గెదల్యాను చంపునను వార్త గెదల్యా నమ్మకపోవుట:-** కారేహ కుమారుడగు యోహానును మిస్పాలో గెదల్యాతో రహస్యముగా ఇట్లనెను. నీ యొద్దకు కూడి వచ్చిన యూదులందరు చెదరిపోవునట్లును, యూదా జనశేషము నశించునట్లు నెతన్యా కుమారుడైన ఇష్మాయేలు నిన్ను చంపనేల? దయచేసి నన్ను వెళ్లనిమ్ము, ఎవనికి తెలియకుండ నేను వానిని చంపెదను. అహీకాము కుమారుడైన గెదల్యా కారేహ కుమారుడైన యోహానానుతో ఇష్మాయేలును గూర్చి నీవు అబద్ధమాడుచున్నావు. నీవాకార్యము చేయకూడదనెను.

## 41వ. అధ్యాయము (9+9=18వ)

**అంశము:- గెదల్యా మరణము - ఐగుప్తు వెళ్ల తలచిన యూదావారు.**

**1-9వ. ఇష్మాయేలు గెదల్యాను చంపుట:-** 1-3వ. ఏడవ మాసమున ఇష్మాయేలును, అతనితో పదిమంది మనుష్యులును, మిస్పాలోనున్న గెదల్యా యొద్దకు వచ్చి అక్కడ అతనితో కూడ మిస్పాలో భోజనము చేసిరి. అప్పుడు ఇష్మాయేలు అతనితో కూడనున్న ఆ పదిమంది మనుష్యులునులేచి బబులోను రాజు గెదల్యా అధికారిగా నియమించినందున గెదల్యాను, అతని యొద్ద ఉండినవారినందరిని, ఇష్మాయేలు చంపెను.

**14-22వ. ఐగుప్తుకు వెళ్లిన యెడల సంహరించబడుదురన్న దేవుని వాక్కు:-** 14-19వ. అక్కడ యుద్ధము చూడకయు బూరధ్వని వినకయు ఆహారపు లేమిచేత ఆకలిగొనకయు నుందుము గనుక అక్కడనే కాపురముందమని మీరనుకొని ఐగుప్తుకు వెళ్లిన యెడల అక్కడనే మీరు చత్తురు అని దేవుడు సెలవిచ్చుచున్నాడని చెప్పెను. 20-22వ. మీ దేవుడైన యెహోవా మీయొద్దకు నా చేత పంపిన వర్తమానమును మీరు ఆలకింపక పోతిరి. కాబట్టి కాపురముండవలెనని మీరు కోరు స్థలములోనే మీరు ఖడ్గముచేతను క్షామము చేతను తెగులుచేతను చత్తురని నిశ్చయముగా తెలిసికొనుడి అని చెప్పెను.

## 43వ. అధ్యాయము (7+6=13వ.)

**అంశము:- యిర్మీయాతోకూడా దేవుని సెలవుకు వ్యతిరేకముగా యూదులు ఐగుప్తుకు వెళ్ళుట.**

**1-7వ. ప్రజలు దేవుని మాట వినక యిర్మీయాతో ఐగుప్తుకు వెళ్ళుట:-** 1-3వ. యిర్మీయా ప్రజలందరికి దేవుడైన యెహోవా సెలవిచ్చిన మాటలన్నిటిని వారికి ప్రకటించి చాలింపగా యోహానానును గర్విష్ఠులందరును యిర్మీయాతో నీవు అబద్ధము పలుకుచున్నావు, ఐగుప్తులో కాపురముండుటకు మీరు అక్కడికి వెళ్లకూడదని ప్రకటించుటకై మన దేవుడైన యెహోవా నిన్ను పంపలేదు అనిరి. మమ్మును చంపుటకు, బబులోనునకు చెరపట్టుకొనిపోవుటకును, కల్దీయులచేతికి మమ్మును అప్పగింపవలెనని నేరీయా కుమారుడైన బారూకు మాకు విరోధముగా రేపుచున్నాడు అని చెప్పిరి. 4-7వ. యెహోవా మాట వినక యోహానానును సేనల యధిపతులందరును యూదా దేశములో నివసించుటకు తాము తరిమి వేయబడిన ఆయా ప్రదేశములనుండి తిరిగి వచ్చిన యూదుల శేషమును పురుషులను స్త్రీలను పిల్లలను రాజకుమార్తెలను ప్రవక్తయగు యిర్మీయాను నేరీయా కుమారుడగు బారూకును తోడుకొనిపోయి ఐగుప్తు దేశములో ప్రవేశించిరి.

**8-13వ. యూదావారు ఐగుప్తులో నుండగా చెరను గూర్చియు, ఐగుప్తు నాశనమును గూర్చి యిర్మీయా ద్వారా దేవుని సెలవు:-** 8-11వ. నీవు పెద్ద రాళ్ళను చేతపట్టుకొని, పాతిపెట్టి యీ రాళ్లమీద నెబుకద్రెజరు సింహాసనము ఉంచెదను, అతడు వచ్చి తెగులునకు నిర్ణయమైన వారిని తెగులునకును, చెరకు నిర్ణయమైనవారిని చెరకును, ఖడ్గమునకు నిర్ణయమైనవారిని ఖడ్గమునకును అప్పగించుచు, ఐగుప్తీయులను హతము చేయును. 12-13వ. నెబుకద్రెజరు ఐగుప్తులో నున్న సూర్యదేవతా పట్టణములోని ప్రతిమలను విరుగగొట్టి ఐగుప్తు దేవతల గుళ్లను అగ్నిచేత కాల్చివేయును అని యెహోవా సెలవిచ్చుచున్నాడని యిర్మీయా చెప్పెను.

# 44వ. అధ్యాయము (6+4+4+5+6+5=30వ)

**అంశము:- ఐగుప్తులో యూదావారి విగ్రహారాధన - రాబోవు శిక్షల వివరాలు.**

**1-6వ. యూదాలో పాపమునుబట్టి శిక్ష:-** 1-3వ. మీరైనను మీ పితరులైనను ఎరుగని అన్యదేవతలను అనుసరించుచు పూజించుచు వాటికి ధూపమువేసి దేవునికి కోపము పుట్టించుటవలన యెరూషలేము మీదికిని యూదా పట్టణములన్నిటి మీదికిని దేవుడు రప్పించిన కీడంతయు మీరు చూచుచునే యున్నారు. 4-6వ. దేవుడు పెందలకడ లేచి ప్రవక్తలైన సేవకులందరిని పంపుచు, తనకసహ్యమైన హేయకార్యమును మీరు చేయకుడి అని చెప్పుచువచ్చినను వారు ఆలకింపకపోయిరి, అన్యదేవతలకు ధూపార్పణముచేయుట మానకపోయిరి, తమ దుర్మార్గతను విడువక పోయిరి చెవియొగ్గకపోయిరి. కావున దేవుని కోపము కుమ్మరింపబడి, యూదా పట్టణములలోను యెరూషలేము వీధులలోను రగులుకొనెను, గనుక నేడున్నట్లుగా అది పాడై యెడారి ఆయెను అని యిర్మీయా చెప్పెను.

**7-10వ. ఐగుప్తులో పాపము:-** 7-8వ. మీకు మీరే సమూల నాశనము తెచ్చుకొనునట్లు మీరు కాపురముండుటకు పోయిన ఐగుప్తులో అన్యదేవతలకు మీరేల ధూపార్పణము చేయుదురు. 9-10వ. వారు యూదా దేశములోను యెరూషలేము వీధులలోను జరిగించిన క్రియలను అనగా మీ పితరులు చేసిన చెడుతనమును యూదా రాజులు చేసిన చెడుతనమును వారి భార్యలు చేసిన చెడుతనమును, మీమట్టుకు మీరు చేసిన చెడుతనమును మీ భార్యలు చేసిన చెడుతనమును మరచిపోతిరా? నేటివరకు వారు దీనమనస్సు ధరింపకున్నారు, భయము నొందకున్నారు, నేను మీకును మీ పితరులకును నియమించిన ధర్మశాస్త్రమునైనను కట్టడలనైనను అనుసరింపకయే యున్నారని యిర్మీయా చెప్పాడు.

**11-14వ. పాపమునుబట్టి కలుగబోవు శిక్ష:-** 11-12వ. కాబట్టి యూదావారినందరిని నిర్మూలము చేయునట్లు, దేవుడు మీకు అభిముఖుడై ఐగుప్తు దేశములో కాపురముండుమని అచ్చటికి వెళ్లిన వారందరు ఐగుప్తు దేశములోనే నశించెదరు; అల్పులేమి ఘనులేమి, ఖడ్గముచేతనైనను క్షామముచేతనైనను నశింతురు, శాపాస్పదమును భీతి పుట్టించు వారుగాను దూషణపాలుగాను తిరస్కారము నొందినవారుగాను ఉందురు. 13-14వ. యెరూషలేము నివాసులను నేనేలాగు శిక్షించితినో ఆలాగే ఐగుప్తు దేశములో నివసించు వీరిని ఖడ్గముచేతగాని క్షామముచేతగాని తెగులుచేతగాని శిక్షించెదను. కావున తాము మరలి వచ్చి యూదాదేశములో కాపురముండవలెనన్న మక్కువచేత ఐగుప్తులో ఆగుటకై అక్కడికి వెళ్ల యూదా వారిలోని శేషము ఎవరును తప్పించుకొనరు, శేషమేమియు ఉండదు, పారిపోవువారు గాక మరి ఎవరును తిరిగిరారు.

**15-19వ. దేవుని మాట వినము అనిన యూదావారు, వారి భార్యలు:- 15-16వ.** అప్పుడు తమ భార్యలు అన్యదేవతలకు ధూపము వేయుదురని యెరిగియున్న పురుషులందరును, అక్కడ నిలిచియున్న స్త్రీలును, మహా సమాజముగా కూడిన వారును ఐగుప్తు దేశమందలి పత్రోసులో కాపురముండు జనులందరును యిర్మీయాకు ఈలాగు ప్రత్యుత్తరమిచ్చిరి యెహోవా నామమునుబట్టి నీవు మాకు ప్రకటించు ఈ మాటను మేమంగీకరింపము. 17-19వ. మేము నీతో చెప్పిన సంగతులన్నిటిని నిశ్చయముగా నెరవేర్చబోవుచున్నాము; మేమును మా పితరులును మా రాజులును మాయధిపతులును యూదా పట్టణములలోను యెరూషలేము వీధులలోను చేసినట్లే ఆకాశరాణికి ధూపము వేయుదుము; ఆమెకు పానార్పణములు అర్పింతుము; ఏలయనగా మేము అలాగు చేసినప్పుడు మాకు ఆహారము సమృద్ధిగా దొరికెను, మేము క్షేమముగానే యుంటిమి, యే కీడును మాకు కలుగలేదు. మేము ఆకాశరాణికి ధూపము వేయకయు ఆమెకు పానార్పణములు అర్పింపకయు మానినప్పటినుండి సమస్తము మాకు తక్కువైనది, మేము ఖడ్గముచేతను క్షామముచేతను క్షీణించుచున్నాము. మేము ఆకాశ రాణికి ధూపము వేయగాను, ఆమెకు పానార్పణములు అర్పింపగాను, మా పురుషుల సెలవులేకుండ ఆమెకు పిండి వంటలు చేయుచున్నామా? ఆమెకు పానార్పణములు పోయుచున్నామా? అని వారు చెప్పిరి.

**20-25వ. యూదయలో విగ్రహారాధననుబట్టి కలిగిన కీడును జ్ఞాపకము చేసిన యిర్మీయా:-** 20-22వ. యిర్మీయా ఆ స్త్రీ పురుషులందరితో, అనగా తనకు అట్లు ప్రత్యుత్తరమిచ్చిన ప్రజలందరితో ఇట్లనెను, యూదా పట్టణములలోను యెరూషలేము వీధులలోను మీరును మీ పితరులును మీ రాజులును మీ యధిపతులును దేశప్రజలును ధూపము వేసిన సంగతి యెహోవా జ్ఞాపకము చేసికొనలేదా? అదే గదా ఆయన మనస్సునకు వచ్చెను. యెహోవా మీ దుష్టక్రియలను చూచి మీరు చేయు హేయకృత్యములను ఎంచి యికను సహింపలేక పోయెను గనుక నేడున్నట్లుగా మీ దేశము పాడుగాను ఎడారిగాను శాపాస్పదముగాను నిర్జనముగాను ఆయన చేసెను.

23-25వ. యెహోవా మాట వినక, ఆయన ధర్మశాస్త్రమునుబట్టి, కట్టడలనుబట్టియు ఆయన తనకు సాక్ష్యార్థముగా ఇచ్చిన ఆజ్ఞనుబట్టియు నడవక, మీరు ధూపము వేయుచు యెహోవాకు విరోధముగా పాపము చేసితిరి గనుకనే నేడున్నట్లుగా ఈ కీడు మీకు సంభవించెను. మరియు యిర్మీయా ప్రజలనందరిని స్త్రీలనందరిని చూచి వారితో ఇట్లనెను ఐగుప్తులో నున్న సమస్తమైన యూదులారా, యెహోవా మాట వినుడి. ఇశ్రాయేలు దేవుడును, సైన్యములకధిపతియునగు యెహోవా ఈమాట సెలవిచ్చుచున్నాడు ఆకాశరాణికి ధూపము వేయుదుమనియు, ఆమెకు పానార్పణములు అర్పింతుమనియు, మేము మ్రొక్కుకొనిన

మ్రొక్కుబళ్లను నిశ్చయముగా నెరవేర్చుదుమనియు మీరును మీ భార్యలును మీ నోటితో పలికి మీ చేతులతో నెరవేర్చుచున్నారే; నిజముగానే మీ మ్రొక్కుబళ్లను మీరు మ్రొక్కుదురు, మీ మ్రొక్కులను మీరు నెరవేర్తురు.

**26-30వ. రాబోవు శిక్ష - వివరములు:-** 26-27వ. యెహోవా ప్రమాణము చేయుచు, ఐగుప్తులో నివసించు యూదులలో ఎవరును ఇకమీదట తన నామము నోటపలకరని ప్రమాణము చేయుచు, మేలుచేయుటకుకాక కీడుచేయుటకే వారిని కనిపెట్టుచున్నాను అని చెప్పుచున్నాడు. వారు ఖడ్గము చేతనైనను క్షామముచేతనైనను క్షీణించిపోవుచు, ఐగుప్తు దేశములో నున్న యూదావారందరు శేషములేకుండ చత్తురు అని దేవుడు చెప్పాడు. 28-30వ. ఖడ్గము తప్పించుకొనువారు కొద్దిమందియై ఐగుప్తుదేశములో నుండి యూదా దేశమునకు తిరిగివచ్చెదరు, అప్పుడు ఐగుప్తు దేశములో కాపురముండుటకు వెళ్లిన యూదా వారిలో శేషము ఎవరి మాట నిలకడగా నుండునో, నాదో తమదో అది తెలిసికొందురు అని చెప్పాడు. యూదులకు కీడు సంభవించునట్లుగా దేవుని మాటలు నిశ్చయముగా నిలుచునని తెలియబడుటకు, నెబుకద్రెజరును బబులోను రాజుచేతికి యూదారాజైన సిద్కియాను అప్పగించినట్లు ఐగుప్తు రాజైన ఫరోహొఫ్రను అతని శత్రువులై అతని ప్రాణమును తీయజూచు వారి చేతికి అప్పగించెదనని యెహోవా చెప్పాడు.

## 45వ. అధ్యాయము (3+2=5వ)

**అంశము:- బారుకుకు వర్తమానము (పేరుల అర్థములు: యిర్మీయా - యెహోవా నియమించును, నేరీయా - యెహోవా నా దీపము. బారూకు - ధన్యుడు.)**

**1-3వ యెహోయాకీము రాజు ప్రవక్తయైన యిర్మీయాను మందిరములోనికి రాకుండా నిర్బంధించగా, బారుకు యిర్మీయాకు లేఖికుడుగా నియమించబడుట:-** యిర్మీ 36:1-8వ.లో యెహోయాకీము రాజు తన ఏలుబడిలో నాలుగవ సంవత్సరమున ప్రవక్తయైన యిర్మీయాను మందిరములోనికి రాకుండా నిర్బంధించాడు. యిర్మీయా బారూకును పిలువనంపి తన నోటిమాటనుబట్టి యెహోవా వాక్కును పుస్తకములో వ్రాయవలెనని చెప్పగా బారుకు తన ప్రాణమునకు రాజుచే అపాయము కలుగునేమో అని భయపడ్డాడు. 2-3వ. బారూకూ, కటకటా, నాకు శ్రమ, యెహోవా నాకు పుట్టించిన నొప్పికి తోడు ఆయన నాకు దుఃఖమును కలుగజేయుచున్నాడు, మూలుగు చేత అలసియున్నాను, నాకు నెమ్మది దొరకదాయెను అని అనుకొన్నాడు. నీ నిమిత్తము నీవు గొప్ప వాటిని వెదకుచున్నావా? వెదకవద్దు. నీవు వెళ్లు స్థలములన్నిటిలో దోపుడు సొమ్ము దొరికినట్లుగా నీ ప్రాణమును నీకిచ్చుచున్నాను అని దేవుడు చెప్పాడు. సేవా జీవితములో శ్రమ, నొప్పి, దుఃఖము, మూలుగు, నెమ్మది దొరకకపోవుట ఉండునని గుర్తింతము. మనము వీటిని అనుభవించుటకు ఒప్పుకొందుమా?

బారూకు వీటికి ఇష్టపడ్డాడు. అప్పుడు అతడు యిర్మీయా తనకు ఆజ్ఞ ఇచ్చినట్టు యిర్మీయా నోటిమాటనుబట్టి పుస్తకములో వ్రాసెను. బారూకు గ్రంథము చేతపట్టుకొని మందిరములో క్రొత్త ద్వారపు ప్రవేశమున ప్రజలందరు వినునట్లు చదివి వినిపించెను.

**4-5వ. బారూకు యిర్మీయాకు లేఖికుడుగా కొనసాగవలెనని దేవుడు ఆజ్ఞాపించుట:-** బారూకు ప్రాణమును దోపుడుగా భద్రపరతునని దేవుడు సెలవిచ్చుట:- దేవుడు యిర్మీయా ద్వారా బారుకుకు చెప్పిన వర్తమానము ఏదనగా 1) నేను కట్టినదానినే పడగొట్టుచున్నాను, 2) నేను నాటిన దానినే పెల్లగించుచున్నాను, 3) సర్వభూమిని గూర్చియు ఈ మాట చెప్పుచున్నాను, 4) నేను సర్వశరీరులమీదికి కీడు రప్పించుచున్నాను, 5) నీ నిమిత్తము నీవు గొప్ప వాటిని వెదకుచున్నావా? వెదకవద్దు అని చెప్పాడు. అయితే నీవు వెళ్లు స్థలములన్నిటిలో దోపుడు సొమ్ము దొరికినట్టుగా నీ ప్రాణమును నీకిచ్చుచున్నాను అని యెహోవా చెప్పాడు. ఇదియే నేటి దినములలో సేవకులందరికి దేవుడు ఇచ్చు అభయ వర్తమానము.

**46-51ల. యూదా యొక్క పది పొరుగు శత్రు దేశాలకు తీర్పులు. ప్రత్యక్షమైన 4 వాక్కులు.**

## 46వ. అధ్యాయము (6+6+6+6+4=28వ)

### అంశము:- ఐగుప్తు పతనమును గూర్చిన ప్రకటన

**1-6, 7-12వ. ఐగుప్తు మీదకు శత్రువులు వచ్చు విధము:-** 1-6వ. అన్యజనులగు ఐగుప్తును గూర్చి వారు ఓడిపోవుచున్నారు వెనుకతీయుచున్నారు వారి బలాఢ్యులు అపజయము నొందుచున్నారు అని దేవుడు సెలవిచ్చుచున్నాడు. తిరిగి చూడక వేగిరముగా పారిపోవుచున్నారు, త్వరగా పరుగెత్తువారు పారిపోజాలకున్నారు బలాఢ్యులు తప్పించుకొనజాలకున్నారు. ఉత్తరదిక్కున యూఫ్రటీసు నదీతీరమందు వారు తొట్రిల్లి పడుచున్నారు అని దేవుడు సెలవిచ్చుచున్నాడు. 7-12వ. ఉత్తరదేశములో యూఫ్రటీసునది యొద్ద సైన్యములకధిపతియునగు యెహోవా బలి జరిగింపబోవుచున్నాడు. నైలునదీ ప్రవాహమువలె ఐగుప్తీయులదండు ప్రవహించుచు వచ్చినను, గిలాదునకు వెళ్లి విస్తారమైన ఔషధములు తెచ్చుకొనినను నీకు చికిత్స కలుగదు అని దేవుడు చెప్పుచున్నాడు. నీ రోదన ధ్వని దేశమంతట వినబడుచున్నది బలాఢ్యులు ఒకనిమీద ఒకడుపడి అందరు కూలుదురు అని దేవుడు చెప్పుచున్నాడు.

**13-18వ. నాశనమునకై సిద్ధపడవలెనన్న హెచ్చరిక:-** ఐగుప్తీయులను హతము చేయుటకు

రాజైన నెబుకద్రెజరు ఖడ్గము బయలుదేరి వచ్చి చుట్టునున్న ప్రదేశములను మింగి వేయునని బలవంతులైనవారు తుడుపు పెట్టబడుదురని యెహోవా చెప్పుచున్నాడు.

**19-24వ. ఐగుప్తు పతనమును గూర్చిన ఉపమానము:-** 19-21వ. ఐగుప్తు అందమైన పెయ్య. ఉత్తర దిక్కుననుండి వచ్చు ఆమె కూలి సిఫాయిలు పెంపుడు దూడలవలె ఉన్నారు. వారు వెనుకతట్టు తిరిగి యొకడును నిలువకుండ ఆపద్దినమున పారిపోయిరి. 22-24వ. వారిపైకి శత్రువులు దండెత్తిరాగా ఐగుప్తు కుమారి అవమానపరచబడి, ఉత్తరదేశస్థులకు ఆమె అప్పగింపబడును అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**25-28వ. ఐగుప్తు దేవతలకు రాజులకు దేవుని తీర్పు - ఇశ్రాయేలుకు విమోచన:-** 25-26వ. ఫరోను, ఐగుప్తును, దాని దేవతలను, ఆమోను దేవతను, దాని రాజులను, ఫరోను ఆశ్రయించువారిని వారి ప్రాణము తీయజూచు బబులోనురాజైన నెబుకద్రెజరు చేతికి అప్పగించుచున్నాను అని యెహోవా సెలవిచ్చుచున్నాడు. 27-28వ. నా సేవకుడవైన యాకోబూ, భయపడకుము ఇశ్రాయేలూ, జడియకుము దూరములోనుండి నిన్ను చెరలోనుండి నీ సంతతివారిని రక్షించుచున్నాను. నా సేవకుడవైన యాకోబు, నేను నీకు తోడైయున్నాను భయపడకుము అని యెహోవా చెప్పుచున్నాడు. యూదా తోలివేయబడిన సమస్త దేశప్రజలను సమూల నాశనము చేయుదునని, యూదాను న్యాయమును బట్టి శిక్షించెదను కాని యూదాను సమూల నాశనము చేయను అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

## 47వ. అధ్యాయము (7వ.)

### అంశము:- ఫిలిష్తీయులు లయపరచబడుట

**1-7వ. ఫిలిష్తీయులు లయపరచబడుట:-** 1-3వ. ఫరో గాజాను కొట్టకమునుపు ఫిలిష్తీయులను గూర్చి యిర్మీయాకు యెహోవా వాక్కు ప్రత్యక్షమై జలములు ఉత్తరదిక్కునుండి పొర్లి వరదలై మనుష్యులు మొఱ్ఱపెట్టునట్లు, ఐగుప్తు దేశము మీదను అందున్న సమస్త పట్టణముల మీదను శత్రువులు వరదవలె ప్రవహించుదురు. వారి ఉరుము వంటి ధ్వనికిని తండ్రులు భయపడి బలహీనులై తమ పిల్లల తట్టు తిరిగిచూడరు. 4-7వ. ఫిలిష్తీయులనందరిని లయపరచుటకును, తూరు సీదోనులకు సహాయకుడొకడైనను నిలువకుండ అందరిని నిర్మూలము చేయు దినము వచ్చుచున్నది. గాజా బోడియగునట్లు, ఆయన ఖడ్గమునకు ఆజ్ఞ ఇచ్చియున్నాడు. యెహోవా ఫిలిష్తీయులను నాశనము చేయును అని దేవుడు చెప్పుచున్నాడు.

# 48వ. అధ్యాయము (11+13+11+12=47వ)

**అంశము:- మోయాబీయుల పతనము.**

**1-11వ. మోయాబు పతనమునకు కారణములు:-** 1-6వ. మోయాబును గూర్చి ఇశ్రాయేలు దేవుడగు యెహోవా ముఖ్య పట్టణమగు నెబో మొదలు పట్టణములన్ని పాడైపోవునని మోయాబునకు పారిపోవుడి మీ ప్రాణములను దక్కించుకొనుడి అని సెలవిచ్చుచున్నాడు. 7-11వ. మోయాబు తన బాల్యమునుండి నెమ్మది నొందెను. అదెన్నడును చెరలోనికి పోయినది కాదు. తన క్రియలను ఆశ్రయించి తన నిధులను నమ్ముకొనినందున పట్టబడి, చెరలోనికి పోవునని, ఒకడు తప్పకుండ వాని యాజకులును అధిపతులును చెరలోనికి పోవుదురు అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**12-24వ. మోయాబు పట్టణములన్నిటికి శిక్ష:-** 12-16వ. మోయాబు పాడైపోవుచున్నది శత్రువులు దాని పట్టణములలో చొరబడుచున్నారు. వారి యౌవనులలో శ్రేష్ఠులు వధకు పోవుచున్నారు అని యెహోవా సెలవిచ్చుచున్నాడు. మోయాబునకు సమూల నాశనము సమీపించుచున్నది. దానిని గూర్చి అంగలార్చుడియని యెహోవా చెప్పుచున్నాడు. 17-24వ. మోయాబు పడగొట్టబడినదై అవమానము నొంది అపజయము నొందెను. మైదానములోని మోయాబు దేశమునకు, మోయాబు దేశపురములన్నిటికిని శిక్ష విధింపబడియున్నది.

**25-35వ. గర్వించిన మోయాబీయుల సంతోషము నిస్సంతోషముగా చేయబడుట:-**

25-30వ. మోయాబు యెహోవాకు విరోధముగా తన్నుతాను గొప్పచేసికొనెను. మోయాబీయులు బహు గర్వపోతులు. వారి అతిశయమును గూర్చి, గర్వమును గూర్చి, అహంకారమును గూర్చి, పొగరును గూర్చి వారి ప్రగల్భములను గూర్చి దేవునికి తెలిసేయున్నవి. చేయదగని క్రియలు వారు బహుగా చేయుచున్నారు అని యెహోవా సెలవిచ్చుచున్నాడు. 31-33వ. కాబట్టి మోయాబు నిమిత్తము దేవుడు అంగలార్చుచున్నానని, ఉన్నత స్థలమున బలులు అర్పించువారిని దేవతలకు ధూపము వేయువారిని మోయాబులో లేకుండ జేసెను అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**36-47వ. చెరనుబట్టి మోయాబీయులకు శ్రమ - అంత్యకాలమున సమకూర్చబడుట:-** 36-42వ. మోయాబు వారు సంపాదించిన దానిలో శేషించినది నశించి పోయెను గనుక మోయాబును గూర్చి నా గుండె పిల్లనగ్రోవివలె నాదము చేయుచున్నదని యెహోవా సెలవిచ్చుచున్నాడు. మోయాబు ఇంటి పైకప్పులన్నిటిమీదను దాని వీధులలోను అంగలార్పు

వినబడుచున్నది. మోయాబు యెహోవాకంటే గొప్పవాడనని అతిశయపడగా అది జనము కాకుండ నిర్మూలమాయెను అని దేవుడు చెప్పాడు. 43-47వ. అయితే అంత్యదినములలో చెరపట్టబడిన మోయాబు వారిని తిరిగి రప్పించెదనని యెహోవా సెలవిచ్చాడు.

## 49వ. అధ్యాయము (6+16+5+5+6=39వ)

**అంశము:- అమ్మోను, ఎదోము, దమస్కు, కేదారు, ఏలామును గూర్చిన ప్రకటన.**

**1-6వ. అమ్మోనీయులను గూర్చిన ప్రకటన:-** 1-3వ. అమ్మోనీయులను గూర్చి యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. ఇశ్రాయేలునకు కుమారులు వారసుడు వున్నను, ఎదోమీయులగు మల్కోమువారు, ఇశ్రాయేలు దేశములోని గాదును స్వతంత్రించుకొనిరి. అందులకై, రాగల దినములలో అమ్మోనీయుల పట్టణమగు రబ్బా మీదికి యుద్ధము యొక్క ధ్వని వినబడజేసెదనని అది పాడు దిబ్బయై దాని ఉప పురములు అగ్నిచేత కాల్చబడునని, దాని వారసులకు ఇశ్రాయేలీయులు వారసులగుదురని యెహోవా సెలవిచ్చుచున్నాడు. 4-6వ. నాయొద్దకు ఎవడును రాలేడని ధనమునే ఆశ్రయముగా చేసికొని యతిశయించుచున్నందున, నీ చుట్టునున్న వారందరి వలన నీకు భయము పుట్టింతునని, మీరందరు శత్రువుని కెదురుగా తరుమబడుదురని చెప్పుచున్నాడు. అటుతరువాత అంత్యకాలమున కరుణించి చెరలోనున్న అమ్మోనీయులను నేను రప్పించెదను అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**7-22వ. ఎదోమీయులను గూర్చిన ప్రకటన:-** 7-10వ. నేను ఏశావును దిగంబరినిగా చేయుచున్నాను, అతడు దాగియుండకుండునట్లు నేనతని మరుగు స్థలమును బయలుపరచుచున్నాను, అతని సంతానమును అతని స్వజాతివారును అతని పొరుగువారును నాశనమగుచున్నారు, అతడును లేకపోవును. 11-15వ. జనములలో అల్పునిగాను మనుష్యులలో నీచునిగాను నిన్ను చేయుచున్నాను అని యెహోవా చెప్పుచున్నాడు. 16-22వ. ఏశావు భీకరుడై కొండ సందులలో నివసించుచు, పర్వత శిఖరమును స్వాధీనపరచుకొని హృదయ గర్వముతో మోసపుచ్చబడ్డాడు. హృదయ గర్వమునుబట్టి పక్షిరాజు వలె గూటిని ఉన్నత స్థలములో కట్టుకొనినను అక్కడనుండి క్రింద పడద్రోసెదను అని యెహోవా చెప్పుచున్నాడు. ఎదోము పాడైపోవును, దాని మార్గమున నడుచువారు ఆశ్చర్యపడి దాని యిడుమలన్నియు చూచి వేళాకోళము చేయుదురు. శత్రువు పక్షిరాజువలె లేచి యెగిరి బొస్రా మీద పడవలెనని తన రెక్కలు విప్పుకొనుచున్నాడు; ఆ దినమున ఎదోము బలాఢ్యుల హృదయములు ప్రసవించు స్త్రీ హృదయమువలె ఉండి ఎదోమీయులందరు నాశనమగుదురు.

**23-27వ. దమస్కును గూర్చిన ప్రకటన:-** దమస్కు ప్రసిద్ధిగల ఆనందము నిచ్చు పట్టణము. కాని ఆనందమునిచ్చు పట్టణము బలహీనమై బొత్తిగా విడువబడెను. దమస్కు ప్రాకారములో

దేవుడు అగ్ని రాజబెట్టగా ఆమె యౌవనులు వీధులలో కూలుదురు ఆ దినమున యోధులందరు మౌనులైయుందురు అని యెహోవా చెప్పాడు.

**28-33వ. కేదారు హాసోరును గూర్చిన ప్రకటన:-** 28-29వ. బబులోను రాజైన నెబుకద్రెజరు కేదారును, హాసోరును కొట్టగా వారి గుడారములను గొర్రెల మందలను శత్రువులు కొనిపోవుదురు తెరలను ఉపకరణములను ఒంటెలను పట్టుకొందురు అని చెప్పుచున్నాడు. 30-33వ. హాసోరు నివాసులారా, బబులోను రాజైన నెబుకద్రెజరు మీమీదికి రావలెనని ఆలోచన చేయుచున్నాడు మీ మీద పడవలెనను ఉద్దేశ్యముతో ఉన్నాడు, పారిపోవుడి. వారిని నఖముఖాల చెదరగొట్టుచున్నాను నలుదిక్కుల నుండి ఉపద్రవమును వారిమీదికి రప్పించుచున్నాను. హాసోరు చిరకాలము పాడై నక్కలకు నివాస స్థలముగా ఉండును అక్కడ ఏ మనుష్యుడును కాపురముండడు ఏ నరుడును దానిలో బసచేయడు అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**34-39వ. ఏలామీయులను గూర్చిన ప్రకటన:-** 34 ఏలాము అనగా పారసీకము, ఇప్పటి ఇరాన్, పారశీకులు యూదులను శ్రమ పెట్టినందున కాబోలు ఏలాముకు శిక్ష ప్రకటించుచున్నాడు. కోపాగ్నిచేత కీడును వారి మీదికి నేను రప్పించుదును, వారిని నిర్మూలము చేయువరకు వారివెంట ఖడ్గము పంపుచున్నాను అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

## 50వ. అధ్యాయము (20+12+14=46వ)

**అంశము:- బబులోనును గూర్చిన ప్రకటన**

**1-20వ. బబులోను కూలుట:-** 1-5వ. బబులోనును గూర్చి యిర్మీయాద్వారా యెహోవా బబులోను పట్టబడును, బేలు అవమానము నొందును, బబులోను విగ్రహములు అవమానము నొందును అని చెప్పాడు. దేవుడు బబులోనుకు తీర్పు తీర్చు కాలమున ఆనాటికి ఇశ్రాయేలువారును యూదావారును తమ దేవుడైన యెహోవా యొద్ద విచారించుటకై కూడి వచ్చెదరు. ఎన్నటికిని మరువబడని నిత్యనిబంధన చేసికొని యెహోవాను కలిసికొందము రండని చెప్పుకొనుచు సీయోను తట్టు అభిముఖులై అచ్చటికి వెళ్లు మార్గము అడుగుచు వచ్చెదరని యెహోవా చెప్పాడు. 6-10వ. బబులోను నుండి పారిపోవుడి కల్దీయుల దేశములో నుండి బయలువెళ్లుడి మందలకు ముందు మేక పోతులు నడుచునట్లు ముందర నడువుడి. ఉత్తర దేశమునుండి మహాజనమగు మాదీయ పారసీకుల సమూహమును రేపుచున్నానని యెహోవా చెప్పుచున్నాడు. 11-15వ. దేవుని స్వాస్థ్యమును దోచుకొనుచు ఉత్సహించుచు పెయ్యవలె గంతులు వేయుచు బలమైన గుఱ్ఱములవలె బబులోను వారు సకిలించుచున్నారని చెప్పుచున్నాడు. దాని బురుజులు, దాని ప్రాకారములు

విరుగగొట్టబడునని యెహోవా చెప్పుచున్నాడు. 16-20వ. అష్షూరు రాజును నేను దండించినట్లు బబులోను రాజును అతని దేశమును దండించి వారిని శిక్షించి, ఇశ్రాయేలు వారిని తమ మేత స్థలమునకు తిరిగి రప్పించెదను అని యెహోవా చెప్పుచున్నాడు.

**21-32వ. బబులోను నాశనముకై పిలుపు:-** బబులోను దేశములో యుద్ధధ్వని వినబడుచున్నది. అధిక నాశనధ్వని వినబడుచున్నది బబులోనూ, నిన్ను పట్టుకొనుటకై యెహోవా బోనుపెట్టియున్నాడు. యెహోవాతో నీవు యుద్ధము చేయ బూనుకొంటివి నీవు చిక్కుపడి పట్టబడియున్నావు. గర్విష్ఠుడా, నేను నీకు విరోధినైయున్నాను నీ దినము వచ్చుచున్నది. నేను నిన్ను శిక్షించుకాలము వచ్చుచున్నది అని యెహోవా చెప్పుచున్నాడు. గర్విష్ఠుడు తొట్రిల్లి కూలును, అతని లేవనెత్తువాడెవడును లేకపోవును నేనతని పురములలో అగ్ని రాజబెట్టగా అది అతని చుట్టుపట్టులన్నిటిని కాల్చివేయును అని ప్రభువు చెప్పుచున్నాడు.

**34-46వ. బబులోను సమూల నాశనము:-** బబులోను పట్టబడుచున్నదని. జనములలో అంగలార్పు వినబడుచున్నది బబులోను పూర్తిగా నాశనమగును.

## 51వ. అధ్యాయము (10+9+5+9+11+9+11=64వ)

**అంశము:- బబులోనును గూర్చిన ప్రకటన.**

**1-10వ. బబులోను పతనమును గూర్చిన దేవుని నిర్ణయము:-** బబులోను మీదికిని దానిలో కాపురముచేసి విరోధముగలేచిన వారిమీదికి అన్యదేశస్థులను బబులోనునకు పంపుచున్నాను వారు ఆ దేశమును తూర్పారపట్టి దాని వట్టిదిగా చేయుదురు. కల్దీయులదేశములో సర్వసైన్యమును బొత్తిగా నిర్మూలము చేయుడి. అది చేసిన క్రియలనుబట్టి ఆయన దానికి ప్రతికారము చేయుచున్నాడు. బబులోను నిమిషమాత్రములోనే కూలి తుత్తునియలాయెను. దానిని చూచి అంగలార్చుడి అది స్వస్థతనొందునేమో దాని నొప్పికొరకు గుగ్గిలము తీసికొని రండి. మనము బబులోనును స్వస్థపరచగోరితిమి అయితే అది స్వస్థత నొందలేదు దాని విడిచి పెట్టుడి. మన మన దేశములకు వెళ్లుదము రండి దాని శిక్ష ఆకాశమంత యెత్తుగా సాగుచున్నదని బబులోనుతో కలిసినవారు చెప్పుకొనిరి.

**11-19వ. బబులోను పతన వివరము:-** బాణములు చికిలిచేయుడి కేడెములు పట్టుకొనుడి. బబులోను ప్రాకారములమీద పడుటకై ధ్వజము నిలువబెట్టుడి. తెలివిలేక ప్రతి మనుష్యుడు పశుప్రాయుడు పోతపోయువాడు తానుచేసిన విగ్రహమును బట్టి అవమానమొందును అతడు పోతపోసినది మాయా రూపము దానిలో ప్రాణమేమియు లేదు. యాకోబునకు స్వాస్థ్యమగువాడు వాటివంటివాడు కాడు ఆయన సమస్తమును నిర్మించువాడు. ఇశ్రాయేలు ఆయనకు స్వాస్థ్యముగా నున్న గోత్రముల కధిపతియగు యెహోవా అని ఆయనకు పేరు.

**20-24వ. బబులోను పతనమునకు దేవుని పరికరము:-** నీవు నాకు గండ్రగొడ్డలి వంటివాడవు యుద్ధాయుధము వంటివాడవు. నీవలన నేను జనములను విరుగగొట్టుచున్నాను. నీవలన రాజ్యములను విరుగగొట్టుచున్నాను. బబులోనును కల్దీయుల దేశనివాసులును మీ కన్నులయెదుట సీయోనులో చేసిన కీడంతటికి నేను వారికి ప్రతీకారము చేయుచున్నాను అని యెహోవా చెప్పాడు.

**25-33వ. బబులోనుకు వ్యతిరేకులైన దేవుని సాధనము:-** సర్వభూమిని నశింపజేయు నాశనపర్వతమా, నేను నీకు విరోధిని అని నీవు చిరకాలము పాడై యుందువు అని యెహోవా చెప్పుచున్నాడు. బబులోనుపురము చదరము చేయబడిన కళ్లమువలె ఆయెను ఇంక కొంతసేపటికి దానికి కోతకాలము వచ్చును.

**34-44వ. బబులోనుపై దేవుని ఫిర్యాదు:-** బబులోను రాజైన నెబుకద్రెజరు మమ్మును మింగివేసెను. మమ్మును నుగ్గుచేసెను, మమ్మును వట్టికుండవలె ఉంచియున్నాడు. భుజంగము మింగునట్లు మమ్మును మింగెను. మా శ్రేష్ఠపదార్థములతో తన పొట్ట నింపుకొని మమ్మును పారవేసియున్నాడు. సీయోను నివాసులు తమ ఉసురు కల్దీయ దేశ నివాసులకు తగులును అని యెరూషలేమువారు అనుకొనుచున్నారు. బబులోనులోనే బేలును శిక్షించుచున్నాను వాడు మింగిన దానిని వానినోటనుండి కక్కించుచున్నాను ఇక మీదట జనములు వానియొద్దకు సమూహములుగా కూడి రావు బబులోను ప్రాకారము కూలును;

**45-53వ. బబులోనుపై అనేక తీర్పులు:-** నా జనులారా! మీరు దానిలోనుండి బయటకు వెళ్లుడి యెహోవా కోపాగ్నినుండి తప్పించుకొనుడి మీ ప్రాణములను రక్షించుకొనుడి. ఏటేట వదంతి పుట్టుచువచ్చును దేశములో బలాత్కారము జరుగుచున్నది ఏలికమీద ఏలిక లేచుచున్నాడు. మీ హృదయములలో దిగులు పుట్టనియ్యకుడి. రాబోవు దినములలో నేను బబులోను యొక్క చెక్కిన విగ్రహములను శిక్షింతును దాని దేశమంతయు అవమానము నొందును. జనులు హతులై దాని మధ్యను కూలెదరు ఇశ్రాయేలులో హతులైనవారిని కూలజేసినట్లు సర్వభూమిలో బబులోను నిమిత్తము హతులైనవారు కూలుదురు.

**54-64వ. బబులోను మునిగి పోవుట- దానిని గూర్చిన వ్రాతలు:-** కల్దీయుల దేశములో మహా నాశనధ్వని వినబడుచున్నది. యెహోవా బబులోనును పాడుచేయుచున్నాడు దాని మహాఘోషను అణచివేయుచున్నాడు. వారి తరంగములు ప్రవాహజలములవలె ఘోషించుచున్నవి వారి ఆర్భాటము వినబడుచున్నది. విశాలమైన బబులోను ప్రాకారములు బొత్తిగా పడగొట్టబడును దాని ఉన్నతమైన గుమ్మములు అగ్నిచేత కాల్చివేయబడును. యిర్మీయా బబులోను మీదికి వచ్చు అపాయములన్నిటిని, అనగా బబులోనును గూర్చి

వ్రాయబడిన యీ మాటలన్నిటిని గ్రంథములో వ్రాసెను. కాగా యిర్మీయా శెరాయాతో ఇట్లనెను నీవు బబులోనునకు వచ్చినప్పుడు ఈ మాటలన్నిటిని చదివి వినిపించి నీవు ప్రకటింపవలెను యెహోవా, మనుష్యులైనను జంతువులైనను మరి ఏదైనను ఈ స్థలమందు నివసింపక పోవుదురనియు, అది నిత్యము పాడుగా నుండుననియు దానిని గూర్చి నీవు సెలవిచ్చితివి. ఈ గ్రంథమును చదివి చాలించిన తరువాత నీవు దానికి రాయికట్టి యూఫ్రటీసు నదిలో దాని వేసి నేను దాని మీదికి రప్పింపబోవుచున్న అపాయములచేత బబులోను మరల పైకి రాలేక ఆలాగే మునిగిపోవును, దాని జనులు అలసియుందురు అను మాటలు నీవు ప్రకటింపవలెను. యిర్మీయా యొక్క మాటలు ఇంతటితో ముగిసెను.

## 52వ. అధ్యాయము (11+5+7+4+3+4=34వ)

అంశము:- యెరూషలేము పట్టబడుట - చెరల వివరము.

**1-11వ. సిద్కియా చివరి దినముల చరిత్ర:-** సిద్కియా ఇరువది యొక్క సంవత్సరములవాడై, యెరూషలేములో పదకొండు సంవత్సరములు ఏలెను, అతడు యెహోయాకీము నడిచిన చెడ్డనడత ప్రకారముగా యెహోవా దృష్టికి చెడ్డనడత నడిచెను. సిద్కియా బబులోను రాజు మీద తిరుగుబాటుచేయగా నెబుకద్రెజరు తన సైన్యమంతటితో యెరూషలేము మీదికి వచ్చి పదకొండవ సంవత్సరము వరకు పట్టణము ముట్టడిలో నుంచగా, దేశ ప్రజలకు ఆహారము లేకపోయెను. పట్టణ ప్రాకారములు పడగొట్టబడగా సైనికులందరు పారిపోగా కల్దీయుల దండు సిద్కియా రాజును తరిమి యెరికో మైదానములో అతని కలిసికొని రిబ్లా పట్టణమున నున్న బబులోను రాజునొద్దకు అతని తీసికొనిపోగా అతడు అచ్చటనే సిద్కియారాజును శిక్ష విధించెను. సిద్కియా కుమారులను అతని కన్నుల యెదుట చంపి, సిద్కియా కన్నులు ఊడ దీయించి రెండు సంకెళ్లతో అతని బంధించి, బబులోనునకు అతని తీసికొనిపోయి, మరణమగు వరకు చెరసాలలో అతని పెట్టించెను.

**12-16వ. యెరూషలేము పతన వివరము:-** అయిదవ నెల పదియవ దినమున, అనగా రాజైన నెబుకద్రెజరు ఏలుబడియందు పందొమ్మిదవ సంవత్సరమున బబులోను రాజు ఎదుట నిలుచు నెబూజరదానను రాజ దేహసంరక్షకులయధిపతి యెరూషలేముకు వచ్చి, యెహోవా మందిరమును రాజు నగరును యెరూషలేములోని గొప్పవారి యిండ్ల నన్నిటిని కాల్చివేసెను. యెరూషలేము చుట్టునున్న ప్రాకారములన్నిటిని పడగొట్టెను. నెబూజరదాను ప్రజలలో కడుబీదలైన కొందరిని, పట్టణములో శేషించిన ప్రజలను, బబులోను రాజు పక్షము చేరినవారిని, గట్టి పనివారిలో శేషించిన వారిని చెరగొని పోయి, ద్రాక్షావనములను చక్కపరచుటకును సేద్యము చేయుటకును కడుబీదలలో కొందరిని ఉండనిచ్చెను.

**17-23వ. కొనిపోబడిన దేవాలయ ఉపకరణములు:-** మరియు యెహోవా మందిరములో

నుండిన ఇత్తడి స్తంభములను మందిరములో నుండిన మట్లను ఇత్తడి సముద్రమును కల్దీయులు తునకులుగా కొట్టి ఆ ఇత్తడి అంతయు, యాజకులు సేవచేయు ఇత్తడి ఉపకరణములన్నిటిని గొనిపోయిరి. రాజైన సొలొమోను యెహోవా మందిరమునకు చేయించిన రెండు స్తంభములను సముద్రమును మట్లక్రిందనుండిన పండ్రెండు ఇత్తడి వృషభములను గొనిపోయెను. వీటికన్నిటికున్న ఇత్తడి యెత్తు వేయుటకు అసాధ్యము.


**24-27వ. రిబ్లా పట్టణములో చంపబడిన యూదులు:-** పట్టణములో నుండి యోధులమీద నియమింపబడిన యొక ఉద్యోగస్థుని పట్టణములో దొరికిన రాజసన్నిధిలో నిలుచు ఏడుగురు మనుష్యులను, దేశ సైన్యాధిపతియగు వానియొక్క లేఖరిని, పట్టణపు మధ్యను దొరికిన అరువది మంది దేశప్రజలను, పట్టుకొని వారిని కొట్టించి చంపించి యూదా వారిని తమ దేశములో నుండి చెరగొనిపోయెను.

**28-30వ. చెరల వివరము:-** 1) క్రీ.పూ. 606లో మొదటి విడతగా బబులోనుకు చెరకు వెళ్ళిరి. 2) నెబుకద్రెజరు తన యేలుబడియందు ఏడవ సంవత్సరమున మూడువేల ఇరువది ముగ్గురు యూదులను చెరగొనిపోయెను. ఇది. క్రీ.పూ. 597లో జరిగిన రెండవ విడత చెర. 3) నెబుకద్రెజరు ఏలుబడి యందు పదునెనిమిదవ సంవత్సరమున అతడు యెరూషలేమునుండి ఎనిమిదివందల ముప్పది ఇద్దరిని చెరగొని పోయెను. ఇది క్రీ.పూ. 586లో జరిగిన మూడవ విడత చెర. 4) నెబుకద్రెజరు ఏలుబడియందు ఇరువది మూడవ సంవత్సరమున రాజ దేహసంరక్షకుల యధిపతియగు నెబూజరదాను యూదులలో ఏడువందల నలుబది యయిదుగురు మనుష్యులను చెరగొని పోయెను. ఆ మనుష్యుల వెరసి నాలుగువేల ఆరువందలు. ఇది బహుశా ఐగుప్తుకు వెళ్లిన వారి యొక్క చెరయై యుండవచ్చును. ఇది క్రీ.పూ. 581లో జరిగినది.

**31-34వ. బబులోనులో హెచ్చించబడిన యెహోయాకీను రాజు:-** యూదా రాజైన యెహోయాకీను చెరపట్టబడిన ముప్పది యేడవ సంవత్సరమున పండ్రెండవ నెల యిరువదియైదవ దినమున బబులోను రాజైన ఎవీల్మెరోదకు తన యేలుబడి యందు మొదటి సంవత్సరమున అనగా క్రీ.పూ. 561 యూదారాజైన యెహోయాకీనునకు దయచూపి, బందీగృహములోనుండి అతని తెప్పించి అతనితో దయగా మాటలాడి అతనితో కూడ బబులోనులో నుండు రాజుల సింహాసనముకంటె ఎత్తయిన సింహాసనము అతనికి నియమించెను. మరియు అతడు తన బందీగృహ వస్త్రములు తీసివేసి వేరు వస్త్రములు ధరించి కొని తన జీవితకాలమంతయు ఎవీల్మెరోదకు సన్నిధిని భోజనము చేయుచువచ్చెను. మరియు అతడు చనిపోవు వరకు అతడు బ్రతికిన దినములన్నియు అనుదినము అతని పోషణకై బబులోనురాజుచేత భోజనపదార్థములు ఇయ్యబడుచుండెను. ఇందులో దేవుని కృప ఎంత గొప్పదో తెలిసికొనగలము.

# ఇశ్రాయేలు దేశము - చుట్టున్న పది శత్రు దేశాలు 46-51 అధ్యా.

తూర్పున:- 1)బబులోను(50-51అ.), 2)అమ్మోను(49అ.), 3)మోయాబు(48అ.), 4)ఏలాము(49అ.). పడమర:- 5)ఫిలిష్తీయ(47అ.).
ఉత్తరమున:- 6)దమస్కు(49అ.), 7)హాసోరు(49అ.). దక్షిణమున:- 8)ఐగుప్తు(46అ.), 9)ఎదోము(49అ.), 10)కేదారు(49అ.)




ALPHA BOOK
0193
Rs.30/-